సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్

2025–27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. 3లో

సంపుటి 08, సంచిక: 261 | గురువారం | 21-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ఓటు హక్కు ప్రశ్నార్థకం

## ఇసి రాజ్యాంగ సంస్థగా పనిచేయడం లేదు

- ఓటు హక్కుకోసం బిహార్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైంది
- బిజెపి, మోదీలను గద్దె దింపేందుకు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఇండియా కూటమిలో పరస్పర సహకారం, సర్దుబాటు ఉండాలి
- సిపిఐ రాష్ట్ర 4వ మహాసభను ప్రారంభిస్తూ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన మహాసభలు

### ఉప రాష్ట్రపతి ఎన్నిక రాజకీయ యుద్ధం

'ఉప రాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకం. ఈ ఎన్నిక రాజకీయ యుద్ధం. దేశ ఉప రాష్ట్రపతి ధన్‌కడ్ ఎందుకు రాజీనామా చేశారు? ధన్‌ఖడ్ రాజీనామాకు ఆయన అనారోగ్యం కారణం కాదు, రాజకీయ కారణం ఉన్నది. అదేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ప్రకటించారు. సిపిఐ కూడా మద్దతు ప్రకటించింది. లౌకిక పార్టీలు అన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి. ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపొందితే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం చూపుతుంది. చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.'

ఇ. చంద్రశేఖర్
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడడంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా లేదా తటస్థ సంస్థగా పని చేయడం లేదని మండిపడ్డారు. అందుకే బిహార్‌లోఓటు హక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైందన్నారు. రాజ్యాంగం, ప్రతీ ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడాలంటే బిజెపిని, ప్రధాని మోదీని అధికారం నుంచి దించి వేయాల్సిందేనన్నారు. అందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బిజెపిని, మోదీని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్' (మహారాజా గార్డెన్స్) లో మూడు రోజుల పాటు జరిగే సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రారంభ సభకు సిపిఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రాంగణంతా అరుణవర్ణం సంతరించుకుంది. మహాసభ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా పాల్గొన్నారు. సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సౌహార్ధ సందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖరరావు, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, తరువాయి 2లో

### మతోన్మాద బిజెపిని అడ్డుకునేది వామపక్షాలే

ఆ శక్తి తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టులకే ఉంది

సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి



వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకుంటున్నామన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటాలు నిర్వహించిందని, మాతృదేశం కోసం నాయకులు ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. 1942 వరకు తరువాయి 2లో

### అమరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన ఎర్ర జెండా

ఏటుకూరి ప్రసాద్



అమరవీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి దశలో ఉన్న రాజకీయ పరిస్థితులే ప్రస్తుతం దేశంలో ఉండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం మళ్లీ విజృంభిస్తోందన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, అదర్శాలతో ముందుకు వెళ్లారో ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకూ అనేక తరువాయి 2లో

# మన పొత్తు ప్రజలతోనే

- ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన గత బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపడంలో సిపిఐ కీలక పాత్ర
- రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి రానీయకుండా ఉండేందుకు వామపక్షాలు మరింత ఐక్యతతో ముందుకు సాగాలి
- మహాసభలో కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టిన కూనంనేని



బి.అంజన్ కుమార్
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి

కమ్యూనిస్టు పార్టీ స్థాయికి తగిన ఉద్యమాలను కొంత కాలంగా నిర్మించలేదని, ఇందుకు అధికార కాంగ్రెస్‌తో ఎన్నికల్లో ఉన్న అవగాహన ఒక కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం స్థిమితపడేందుకు కొంత సమయం ఇవ్వాలని ఎదురుచూసామని తెలిపారు. తమకు పొత్తు ఉన్న మాట వాస్తవమేనని, అసలు పొత్తు ప్రజలతోనే అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిన గత బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని వివరించారు. మతోన్మాద పార్టీ బిజెపిని తెలంగాణ గడ్డపై అధికారంలోకి రానీయకుండా ఉండేందుకు వామపక్షాలు మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సి ఉందని కూనం నేని సాంబశివరావు పేర్కొన్నారు. ముమ్ముందు ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు కార్యాచరణను ప్రస్తుత మహాసభలో రూపొందిస్తామన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్‌లోని కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో బుధవారం నాడు కూనంనేని సాంబశివరావు ప్రతినిధుల సభలో ముసాయిదా రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఎన్నికల హామీల విషయంలో కాంగ్రెస్ కొంత మంచిగానే చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మిగతా హామీల విషయంలో కొంత అసంతృప్తి ఉన్నదన్నారు. కాంగ్రెస్‌తో ఎన్నికలలో కలిసి పోటీ చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలుపై కమ్యూనిస్టు పార్టీ విమర్శ, పోరాటం విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. పార్టీకి బలమైన అవకాశాలు ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించి ప్రాధాన్యతాక్రమంలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపిని బిఆర్‌ఎస్ పైకి విమర్శిస్తున్నప్పటికీ పరోక్ష సహకారం అందిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం విచారణ, ఇతర కేసులతో ఆ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, బిజెపిలో సైతం అంతర్గత ఇబ్బందులు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలలో వేసిన గుడిసెవాసులందరికీ పట్టాలు సాధించే కృషి, పోరాటాలు కొనసాగించాలని, ఆర్.టి.సి, సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలను పరిరక్షించుకొనేందుకు ఉద్యమించాల్సి ఉందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ పునాది కలిగిన స్థానాలలో, అవకాశమున్న చోట పోటీ చేసి విజయం సాధించేందుకు కృషి చేయాలని ఇందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని తెలిపారు. పార్టీ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చే సేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టంతో పాటు వివిధ రంగాల ప్రజల సమస్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరంతర అవిశ్రాంత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



12

# భారీ రెడ్ ఫ్లాగ్ మార్చ్

షాపూర్ నగర్ కూడలి నుంచి కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్ వరకు దారంతా అరుణమయం

### రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నులు

- సరఫరాకు కేంద్రం ఆమోదం
- ఫలించిన కాంగ్రెస్ ఎంపిల యూరియా పోరాటం

ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రైతాంగం శ్రేయస్సు కోసం సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగం కు ఎల్లపుడు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు కేంద్రంతో పోరాడడం వల్ల యూరియా సరఫరాకు మోక్షం లభించిందన్నారు.. తెలంగాణ రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ ఆమోదం తెలిపిందన్నారు..కర్ణాటక నుంచి 10800 మెట్రిక్ టన్నుల తరువాయి 2లో

### వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉంటే

# పిఎం, సిఎంల తొలగింపు

## మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన హోంమంత్రి అమిత్‌షా

- బిల్లులు రాజ్యాంగ విరుద్ధం,ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి
- ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం, నిరసనతో దద్దరిల్లిన లోక్‌సభ
- ప్రతులు చించి వెల్‌లోకి దూసుకొచ్చిన ఎంపీలు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి,ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాలలో మంత్రులపై తీవ్ర నేరారోపణలు వచ్చినప్పుడు అరెస్టై 30 రోజులు కస్టడీలో ఉంటే వారు సహజసిద్ధంగా పదవీచ్యుతులయ్యేవిధంగా 130వ రాజ్యాంగ సవరణతోపాటు ఇతర సవరణ బిల్లులను హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ బిల్లులకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దోషిగా నిర్ధారణ కాకముందే కేవలం ఆరోపణలపై పదవీచ్యులను

#### మూడు బిల్లులు

1. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 75, 164, 239ఎఎఎలను సవరించేందుకు ఉద్దేశించిన ''రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు.
2. జమ్మూ అండ్ కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు
3. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ (సవరణ) బిల్లు, 2025.

రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు లక్ష్యాలు, కారణాలు ఇలా చెబుతున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు భారత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తారని భావించబడతారు. అధికార పదవుల్లోని మంత్రుల (ప్రధాని, ముఖ్యమంత్రులు సహా) వ్యక్తిత్వం, నడవడిక అణుమాత్రం తరువాయి 2లో

### టోక్యో, న్యూయార్క్‌తో హైదరాబాద్ పోటీ

- రాజీవ్ గాంధీ కృషి వల్లే దేశంలో ఐటి విప్లవం
- గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయం శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరానికి బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీ కాదని టోక్యో, న్యూయార్క్ లాంటి నగరాలతో పోటీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణంతో రిజిస్ట్రేషన్ తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## కీలక పట్టణం స్వాధీనం చేసుకున్న మయన్మార్ జుంటా సైన్యం

**బ్యాంకాక్ :** మయన్మార్‌లో జుంటా పాలకుల సైన్యం ఒక కీలక పట్టణాన్ని స్వాధీనం చేసుకుంది. జుంటా పాలకులు అధికారంలోకి వచ్చిన 2021 నుండి డిమోసో పట్టణం ప్రజాస్వామ్య తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది. దేశ రాజధాని నేపిడాకు 105 కి.మీ దూరంలో ఉన్న ఈ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జుంటా సైన్యం ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు 28న మయన్మార్‌లో వివాదాస్పద ఎన్నికలకు ప్రకటన వెలువడిన తర్వాత జుంటాకు ఇది పెద్ద విజయం.

దేశంలో ప్రజాస్వామ్యంకోసం తిరుగుబాటు చేసిన ప్రజాదళాల నుండి ఎక్కువ ప్రాంతాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలు నిర్వహించాలని జుంటా పాలకులు భావిస్తున్నారు. ఆంగ్‌సాన్ సూకీని పదవీచ్యుతురాలిని చేసిన తర్వాత తలపెట్టిన ఈ ఎన్నికలు కేవలం తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి తప్ప నిజమైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి కాదని అంతర్జాతీయ పరిశీలకులు ఇప్పటికే మయన్మార్ సైనిక పాలకులపై విమర్శలు ప్రారంభించారు.

## అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
### 76 మంది వలస ప్రజలు మృతి



**కాబూల్ :** అఫ్ఘానిస్థాన్‌లో మంగళవారం రాత్రి పొద్దుపోయాక రహదారిపై జరిగిన పెద్ద ప్రమాదంలో 76 మంది మరణించారు. వీరంతా ఇటీవల ఇరాన్ నుండి బలవంతంగా అఫ్ఘానిస్థాన్‌కు తరలివచ్చిన అఫ్ఘానిస్థాన్ వలస ప్రజలు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో జరిగిన అతి ఘోరమైన రోడ్డు ప్రమాదం ఇదేనని ఆ దేశ పత్రికలు తెలిపాయి. గుజారా జిల్లాలో హెరాత్ నగరం వెలుపల ఈ ప్రమాదం జరిగింది. వలస ప్రజలను తీసుకువెళుతున్న ఒక బస్సు ఎదురుగా వస్తున్న ఒక మోటారు సైకిలును, ఇంధనాన్ని తీసుకువెళుతున్న మరో లారీని ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిజ్వాలల్లో ప్రయాణికులు మరణించారు. ఈ బస్సులో ప్రయాణిస్తున్న వలస ప్రజలంతా ఇటీవలే ఇరాన్ నుండి అఫ్ఘానిస్థాన్ కాబూల్‌కు చేరుకున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుండి ఇరాన్, పాకిస్థాన్ దేశాల నుండి 15 లక్షలమంది అఫ్గానిస్థాన్ ప్రజలు తిరిగి స్వదేశం చేరుకున్నారు. ఈ రెండు దేశాలూ వారిని బలవంతంగా అఫ్ఘానిస్థాన్‌కు తిప్పి పంపాయి. అనేక దశాబ్దాలపాటు పాకిస్థాన్, ఇరాన్ దేశాలు వారికి ఆతిథ్యం ఇచ్చాయని, ఇప్పుడు స్వదేశానికి తిప్పి పంపాయని ఐక్యరాజ్యసమితి మైగ్రేషన్ ఏజన్సీ ప్రకటించింది. అఫ్ఘానిస్థాన్‌లో దశాబ్దాలుగా జరిగిన అంతర్యుద్ధం వల్ల, పేదరికంవల్ల రహదారులన్నీ మరమ్మతులు లేక దారుణస్థితిలో ఉన్నాయి. ఈ రహదారులపై ప్రమాదాలు సాధారణంగా మారాయి.

# హమాస్ ప్రతిపాదనకు తిరస్కృతి

- గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికకు ఐడిఎఫ్ ఆమోదం
- 60,000 మంది రిజర్విస్టుల మోహరింపుకు సిద్ధం



**టెల్అవీవ్ :** మధ్యవర్తుల ఒత్తిడితో గాజాలో కాల్పుల విరమణకు, పలిమంది బందీల విడుదలకు హమాస్ తెలిపిన అంగీకారాన్ని ఇజ్రాయెల్ తిరస్కరించింది. 50 మంది బందీలను ఒకేసారి విడుదల చేయాలనేది ఇజ్రాయెల్ షరతు. కానీ బందీలు, గల్లంతైనవారి బంధువుల వేదిక ఇజ్రాయెల్ చర్యను ఖండించింది. హమాస్ అంగీకారాన్ని ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించింది. అధికారంలో కొనసాగేందుకే నెతన్యాహూ హమాస్ ప్రతిపాదనను తిరస్కరించారని విశ్లేషకులు మరోవైపు విమర్శించారు. పది మంది విడుదలకు హమాస్ అంగీకారం తెలిపిన మరునాడే రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ సారథ్యంలో ఉన్నత సైనికాధికారులతో టెల్అవీవ్‌లో జరిగిన సమావేశం గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికను ఆమోదించింది. గాజా సిటీ ఆక్రమణ ఆపరేషన్‌ను ''గిడియోన్స్ ఛారియట్స్–బి'' అనే సంకేతనామంతో చేపడుతున్నారు. 60,000 మంది రిజర్విస్టు సైనికులను యుద్ధ రంగానికి రావాలని సమావేశం పిలుపు ఇచ్చింది. వీరంతా దశలవారీగా వస్తారు. హమాస్‌ను పూర్తిగా ఓడించి గాజాలో ఉన్న 50 మంది బందీలను ఒకేసారి చెరవిడిపించి తీసుకురావడం ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. గాజాలో సైనిక చర్యను విస్తరించేందుకు ఈ ఏడాది మే నాలుగో తేదీన ''గిడియోన్స్ ఛారియట్'' సంకేతనామంతో సైనికచర్యను ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదించి ప్రారంభించింది. గాజాను గెలుచుకుని పాలస్తీనియన్లను దక్షిణ ప్రాంతం వైపు నెట్టి, హమాస్ ఉగ్రవాద సంస్థను పూర్తిగా నిర్మూలించి మానవ సహాయ కేంద్రాలను తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలనేది మే నెలనాటి సైనిక చర్య లక్ష్యం. కానీ హమాస్ పూర్తి నిర్మూలన, బందీలందరి విడుదల అనేక ప్రధాన లక్ష్యాలు పూర్తి కాలేదు కాబట్టి ఇప్పుడు ''గిడియోన్స్ ఛారియట్–బి'' సంకేతనామంతో గాజాసిటీ ఆక్రమణ చర్య ప్రారంభిస్తున్నట్లు కట్జ్ చెప్పారు. ఈసారి దాడుల్లో ఐ డి ఎఫ్ గాజా స్ట్రిప్‌లో 75 శాతం భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంటుందని చెప్పారు. ఐతే హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలలోకి గనుక ఐడిఎఫ్ ప్రవేశిస్తే, బందీలదరినీ ఉరితీసి చంపుతామని హమాస్ హెచ్చరించడంతో ఇజ్రాయెల్ సైన్యం ఇంకా ముందుకు వెళ్ళే సాహసం చేయడంలేదు. కానీ ఉత్తర గాజాలోని జెబాలియా ప్రాంతంలో హమాస్ ఉగ్రవాదులను ఐడిఎఫ్ పూర్తిగా నిర్మూలించింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో కొద్దిసంఖ్యలో ఉన్న హమాస్ ఉగ్రవాదులు ఐడిఎఫ్‌తో తీవ్ర పోరాటం చేస్తున్నారు. మే నెలలో గిడియోన్స్ ఛారియట్స్ సైనిక చర్య ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకూ 48 మంది ఇజ్రాయెల్ సైనికులు పేలుడు ఘటనల్లో మరణించారు. కట్జ్‌తోపాటు ఐ డి ఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్‌స్టాఫ్) ప్రధానాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఏయల్ జమీర్, సహాయ సైన్యాధిపతి మేజర్ జనరల్ తమిర్ యాద్దై, ఆపరేషన్స్ డైరెక్టొరేట్ ప్రధానాధిపతి ఇట్జిక్ కోహెన్, ఇంటెలిజన్స్ డైరెక్టరేట్ ప్రధానాధిపతి మేజర్ జనరల్ స్లోమీ బిండెర్ తదితరులు మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొని గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికకు ఆమోదం తెలియజేశారు. 60 రోజుల కాల్పుల విరమణతోపాటు 10 మంది సజీవులతోపాటు మరో 18 మంది నిర్జీవులైన బందీల మృతదేహాలను స్వాధీనం చేసేందుకు సోమవారం రాత్రి హమాస్ అంగీకరించింది. ఇందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న 140 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ పూర్తిగా ఒకేసారి 50 మంది బందీలను విడుదల చేయాలని ఇజ్రాయెల్ పట్టుబట్టింది.

**8 మంది హమాస్ ఉగ్రవాదులు కాల్చివేత**

గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంలో ఒక సొరంగంలో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైన్యంపై బుధవారం ఉదయం కాల్పులు దాడిచేశారు. ఈ దాడులను సైన్యం తిప్పికొట్టింది. సైన్యం ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది హమాస్ ఉగ్రవాదులు మరణించగా మిగిలినవారు తిరిగి సొరంగంలోకి పారిపోయారు. కాగా గాజాలో బుధవారం ఉదయం నుండీ ఐడిఎఫ్ దాడుల్లో మరణించిన పాలస్తీనా ప్రజలసంఖ్య 35కు పెరిగింది. కాగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూ ఉండటంతో గాజా సిటీలో ఆకాశంలో అతిపెద్ద పొగ మేఘం కమ్ముకుంది.

## ఓటు హక్కు ప్రశ్నార్థకం
(మొదటి పేజీ తరువాయి)

కళవేన శంకర్, ఎం.బాల నరసింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా, ప్రముఖ సినీ నటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్‌గౌడ్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ తదితరులు ఆసీనులయ్యారు. సభలో డి.రాజా ప్రసంగిస్తూ దేశం ప్రస్తుతం అత్యంత సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రాథమిక హక్కులు, పౌరుల హక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బిజెపి, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజ్యాంగంపై దాడి పెరిగిందన్నారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వడంలేదని, అది పని చేయకపోతే ప్రజాస్వామ్యం అంతమవుతుందని, ప్రజాస్వామ్యం విధ్వంసం అవుతుందని హెచ్చరించారు. అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఉండగా, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్–సర్) పేరుతో పాలకులకు ఇష్టం లేని ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే తమిళనాడు, కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఎలా పనిచేస్తుందనేది పెద్ద సమస్య అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించేందుకు రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్‌కు అధికారాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఆ సంస్థ రాజ్యాంగ బద్ధమైన సంస్థగా పనిచేయడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదని, అర్హులైన వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ప్రజాస్వామ్యం ఎక్కడ అమలు జరుగుతున్నదని నిలదీశారు. బిహార్‌లో ఎస్‌ఐఆర్‌ను నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో సిపిఐ తరపున స్వయంగా తాను పిటిషన్ దాఖలు చేసినట్టు రాజా వెల్లడించారు. భారత్ హిందూత్వ దేశం, మతతత్వ రాజ్యాంగ మారితే దేశానికే పెద్ద విపత్తుగా పరిణమిల్లుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారు. భారతదేశాన్ని కాపాడాలంటే బిజెపికి వ్యతిరేకంగా, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందుకే ఇండియా కూటమి ఏర్పాటైందని, దాని ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని రాజా తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వాములు కూడా పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమని సూచించారు.

**ఓటు హక్కును 18 ఏళ్ళకు సవరించిన ఘనత సిపిఐదే**

ఇటీవలనే దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరిగిందని, స్వాతంత్ర్యం రాకముందు భారతదేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస పాలనలో ఉండేదని, అప్పట్లో ఎన్నికలు జరిగాయని, కానీ ఓటు హక్కు అందరికీ ఉండేది కాదని, సంపన్నులు, ఉన్నత స్థాయి వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశంలో 21 ఏళ్లు దాటిన పౌరులందరికీ మతాలు, ప్రాంతాలు, స్త్రీ, పురుష బేధం లేకుండా వయోజన ఓటు హక్కును రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించారని తెలిపారు. సిపిఐ నేత సి.కె.చంద్రప్పన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వయోజన ఓటు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించగా, నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అంగీకరించి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ఓటు హక్కును కల్పించారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వయోజనులైన పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఒకే సమయంలో ఓటు హక్కు లభించిందన్నారు. కానీ అమెరికాలో, యురోపియన్ దేశాల్లో చాలా కాలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అనేక పోరాటాలు తరువాతనే మహిళలకు ఓటు హక్కు దక్కిందన్నారు. భారతదేశంలో అత్యంత ధనికులైన అదానీ, అంబానీ ఓటుకు, సామాన్య ప్రజల ఓటుకు ఒకే విలువ ఉంటుందని, అది అంబేద్కర్ గొప్పతనమని చెప్పారు. అదే విధంగా ఓటుతో పాటు ప్రతి మనిషికి ఒకే విలువ ఉండే సమాజం కావాలని ఆయన ఆకాంక్షించారని గుర్తు చేశారు.

**ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలి**

కార్మికులు, రైతులు, మహిళలు, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణలో సిపిఐ అత్యంత బలమైన పార్టీ అని, ప్రస్తుతం ఒక్క ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను మరింత ఎలుగెత్తి చాటేందుకు పార్లమెంటు, అసెంబ్లీ, ప్రతి ప్రజాప్రాతినిధ్య ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలని ఉద్ఘాటించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు.

## అడ్డుకునేది వామపక్షాలే
(మొదటి పేజీ తరువాయి)

భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు శిక్ష అనుభవించారన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సిపిఐదన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కొంత బలహీనమైందని, దీనిని అధిగమించేందుకు దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, మేధావులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోయించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, తెలంగాణ విప్లవగడ్డపై కమ్యూనిస్టులుగా కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సిఎం కెసిఆర్ తానే ఒక వీరునిగా చెప్పుకుంటున్నారని, సాయుధ పోరాటాన్ని తామే నడిపించినట్టు చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఈ ప్రజాతంత్ర ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఎరుపెక్కిన ఎర్ర జెండా
(మొదటి పేజీ తరువాయి)

రూపాల్లో బయటపడడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు. ఈ దశలో అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో వామపక్షాలన్నీ ఐక్యంగా ముందుకు కదిలి ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయాల్సి అవసరముందన్నారు. సినీ నటులు మాదాల రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకమై పోరాటం చేసినప్పుడే సామాన్యుడి గుండె ప్రతిధ్వనిస్తుందని, కుళ్ళుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో పీకేస్తారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. మతతత్వ శక్తులను ఎదుర్కొవాలంటే డబ్బులు ప్రధానంగా మారిన ఎన్నికల వ్యవస్థపై అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. కళ కాసుల కోసం కాదని, సామాన్యులలో చైతన్యం తీసుకురావడం కోసమని, ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య వంతులను



చేసినప్పుడే ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. మానవ సంబంధాలను మట్టి కరిపించే విధంగా ప్రస్తుత సినిమాలు, సీరియల్స్ ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధం అన్నారు.

## 50 వేల మెట్రిక్ టన్నులు
(మొదటి పేజీ తరువాయి)

యూరియా షిప్‌మెంట్ ప్రారంభమైందన్నారు.. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.. యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసి తెలంగాణ రైతాంగం యూరియా కష్టాలపై దేశానికి తెలిసేలా చేసిన ఎంపిలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రల పట్ల రైతాంగం ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు.

## హైదరాబాద్ పోటీ
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలలో ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చెప్పబోతున్నామన్నారు. ఆదాయాన్ని ఇచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామని తెలిపారు. ఫైవ్ స్టార్ హోటల్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ స్థాయిలో సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ నాటికి 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రికి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. 2034 ప్రపంచమంతా హైదరాబాద్ నగరంవైపు చూస్తుందని ఆశాభావం వ్యక్త పరిచారు. ఆ స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం, నగర అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు శత్రువే, అలాంటి దొంగల పని పట్టాల్సింది మీరే అని తెలిపారు. ఆనాడు రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లే దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణలోనూ హైటెక్ సిటీ అభివృద్ధికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని గుర్తు చేశారు. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కంపెనీలు ఇక్కడికి వచ్చాయంటే ఆనాటి ముఖ్యమంత్రుల దూరదృష్టినే కారణమన్నారు. మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని, ఆనాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని కూడా కొంత మంది అవహేళన చేశారని ఆరోపించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ పాతబస్తీ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అని కొనియాడారు.మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. గోదావరి జలాలను తీసుకొచ్చి 365 రోజులు మూసీలో నీరుండేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామన్నారు.మధ్యతరగతి ప్రజల కోసం నగరంలో రాజీవ్ స్వగృహ భవనాలను నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివృద్ధితో పాటు నగర విస్తరణ జరగాలన్నారు.

**త్వరలో 4 లక్షల సాదాబైనామాలపై నిర్ణయం: మంత్రి పొంగులేటి**

ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ను సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. వీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఈ సాదాబైనామాలపై ఉన్నస్టేను తొలగించినందున నిజమైన, అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రస్తుతం జిహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలోగల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 6263 శాతం ఆదాయం లభిస్తోందని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు.

**ప్రజలకు మంచి చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం: మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అన్నారు, గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనం మూడు ఎకరాల విశాల స్థలంలో రూ.30 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.

## మూడు బిల్లులు
(మొదటి పేజీ తరువాయి)

అనుమానానికీ అతీతంగా ఉండాలి. తీవ్రమైన క్రిమినల్ నేరారోపణలపై అరెస్టు చేయబడిన, కస్టడీలో ఉంచబడిన మంత్రి రాజ్యాంగ నైతికత, సుపరిపాలన సూత్రాలకు విఘాతం కలించవచ్చు, ప్రజలు అతనిలో ఉంచిన రాజ్యాంగ విశ్వాసాన్ని దిగజార్చవచ్చు. అటువంటి వారిని పదవుల నుంచి తొలగించేందుకు చట్టం లేనందున ఈ సవరణ అవసరమైంది''. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాల్లోని మంత్రులపై సిబిఐ, ఇడిలను ప్రయోగించి ఇప్పటికే వేధిస్తున్న మోదీ ప్రభుత్వం, ఆ ప్రభుత్వాలను చట్టబద్ధంగా అస్థిరీకరించే కుట్రను ఈ బిల్లుల్లో ప్రతిపక్షాలు చూస్తున్నాయి. అందుకే వాటిని లోక్‌సభలో ప్రవేశపెట్టే దశలోనే తీవ్రంగా వ్యతిరేకించాయి.

## పిఎం, సిఎంల తొలగింపు
(మొదటి పేజీ తరువాయి)

చేసే యత్నం రాష్ట్రాలలో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసే చర్యగా, ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడిగా ప్రతిపక్షాలు పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష సభ్యుల విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. బిల్లును జెపిసికి పంపారు. ఒకదశలో నిరసనలతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడడంతో కేంద్రమంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కిరెణ్ రిజిజు సహా పలువురు అధికారపార్టీ ఎంపీలు వెళ్ళి అమిత్ షా చుట్టూ మద్దతుగా నిలబడ్డారు. సభ మార్షల్స్ కూడా అమిత్ షా చుట్టూ వలయంలా ఏర్పడ్డారు. సభ వాయిదా పడిన తర్వాత కూడా ఈ దృశ్యం కొనసాగింది.

రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టిన బిజెపి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తడంతో లోక్‌సభ దద్దరిల్లింది. ప్రభుత్వం భారత రాజ్యాంగంపైన, ప్రజాస్వామ్యంపైన, సమాఖ్య వ్యవస్థపైనా ప్రత్యక్ష దాడికి దిగిందని ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేయడంతో లోక్‌సభ అట్టుడికింది. కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు–2025, రాజ్యాంగ సవరణ బిల్లు (రాజ్యాంగానికి 130వ సవరణ)–2025, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు–2025లను అమిత్ షా సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం 1963 (20వ నిబంధన) ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి లేదా మంత్రులు అరెస్టయితే, కస్టడీలో గడిపితే వారిని తొలగించే నిబంధన లేదు. అందువల్ల ఈ చట్టంలోని సెక్షన్ 45 లో సవరణ ప్రకారం ఈ నిబంధనలు చేర్చడం ద్వారా వారిని తొలగించే అధికారం ప్రాప్తిస్తుంది.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్రాలలో మంత్రులు ఎవరైనా 31వ రోజు నాటికి బెయిలు పొంది కస్టడీ నుండి బయటకు రాలేకపోతే ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం వారు పదవులు కోల్పోతారు. ప్రతిపక్షాలు వ్యక్తంచేసిన అభిప్రాయాలను హోంమంత్రి అమిత్ షా లెక్కచేయలేదు. ఈ సవరణలు ఆమోదిస్తే, ప్రభుత్వ నిర్వహణపై ప్రజలకు విశ్వసనీయత పెరుగుతుందన్నారు. తర్వాత ఈ బిల్లును మూజువాణీ ఓటుద్వారా ఆమోదించి జాయింట్ సెలక్ట్ కమిటీ (జెపిసి)కి పంపారు. సెలెక్ట్ కమిటీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, మరో 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ప్రతిపక్ష ఎంపీలు తమ అభ్యంతరాలు, సవరణలు ఏమైనా ఉంటే జెపిసికి సమర్పించాలని, ప్రతిపక్షాలకు జెపిసిలో పూర్తి అవకాశం ఉందని అమిత్‌షా చెప్పడం ప్రతిపక్షాలను మరింత ఆందోళనకు గురిచేసింది.

మంత్రి అమిత్ షా ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగానే ప్రతిపక్ష ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ, రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఈ సవరణలవల్ల అస్థిరత్వానికి గురవుతాయని విమర్శించా రు. కాంగ్రెస్ ఎంపిలు మనీశ్ తివారీ, కె.సి.వేణుగోపాల్ తీవ్రస్థాయి లో ప్రతిస్పందిస్తూ, ఈ సవరణ బిల్లులు రాజ్యాంగవిరుద్ధమని, ప్రజాస్వామ్య విరుద్ధమని, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమని మండిపడ్డారు.

అమిత్ షా గుజరాత్ హోంమంత్రిగా అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా కె.సి.వేణుగోపాల్ ప్రస్తావించారు. ఆయన ఎందుకు ఇంకా రాజకీయాల్లో కొనసాగుతున్నారని, రాజకీయాల్లో కొనసాగడానికి ఆయనకున్న నైతికత ఏమిటని నిలదీశారు. అరెస్టుకు ముందే తాను పదవికి రాజీనామా చేశాననీ, కోర్టు విడుదల చేశాకే తిరిగి రాజకీయాల్లోకి వచ్చి పదవి చేపట్టానని అమిత్ షా తిరిగి తనను సమర్థించుకున్నారు. సభలో చెలరేగిన తీవ్ర గందరగోళం సద్దుమణగకపోవడంతో సభాపతి ఓం బిర్లా సభను సాయంత్రం ఐదు గంటలవరకూ వాయిదా వేశారు. ఐనాగానీ ప్రతిపక్షాలు తమ నిరసన కొనసాగించాయి. సభ్యులు హుందాగా ప్రవర్తించాలని, తమ తమ సీట్లలో కూర్చోవాలని సభాపతి విజ్ఞప్తి చేశారు. బిల్లును అనవసర తొందరపాటుతో ప్రవేశపెట్టారని ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ విమర్శించారు. సభా నిబంధనలకు అనుగుణంగా ఈ బిల్లును ప్రవేశపెట్టలేదని విమర్శించారు.

**ఇది ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ఎజెండా**
**నిరసనలకు సిపిఐ పార్లమెంటరీ పార్టీ పిలుపు**

రాజ్యాంగానికి తలపెట్టిన 130వ సవరణ ప్రతిపాదనతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు, జమ్మూ కశ్మీరు పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులను భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పార్లమెంటరీపార్టీ తీవ్రంగా ఖండించింది. వీటికి వ్యతిరేకంగా పార్లమెంటు వెలుపల, లోపలా తీవ్ర నిరసనలకు పిలుపు ఇచ్చింది. ఈ బిల్లులు ఆమోదం పొందానికి అనుమతిస్తే దేశ ప్రజాస్వామ్యానికీ, సమాఖ్య వ్యవస్థకూ తీవ్ర హాని కలుగుతుందని పేర్కొంది. హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన ఈ మూడు సవరణ బిల్లులూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల ఎజెండాలనీ, దేశంలో ప్రజాస్వామ్యానికి తెరదించి, ప్రతిపక్షాలను అణచివేసేందుకు, రాజ్యాంగ మౌలికసూత్రమైన సమాఖ్యవ్యవస్థపై ప్రత్యక్షదాడి చేసేందుకు, న్యాయబద్ధమైన పరిపాలన కొనసాగకుండా చూసేందుకే ఈ బిల్లులను తీసుకువచ్చారని సిపిఐ పార్లమెంటరీపార్టీ విడుదల చేసిన ప్రకటన నిశితంగా విమర్శించింది.

రాజ్యసభలో సిపిఐపక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ స్పందిస్తూ, ''ఈ అమానుషమైన బిల్లులు ఆమోదం పొందడం అంటే, పగ, ప్రతీకారాలు తీర్చుకునే రాజకీయాలకు గేట్లు ఎత్తివేయడంతో సమానం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి కేంద్రద దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బిజెపి ఇక ఇప్పుడు చాలా యధేచ్ఛగా ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలను అస్థిరీకరిస్తుంది, ఏ ముఖ్యమంత్రి అయినా అరెస్టు కావచ్చు, వారిని పదవి నుండి తొలగించవచ్చు. అందుకు వీలుగా అధికారపార్టీ ఈ సవరణలు ప్రతిపాదించింది, ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్యవ్యవస్థను ధ్వంసం చేయడానికి రాజకీయాలలో ఎలాంటి సమానత్వం లేకుం డా చేయడానికి పూనుకుంటున్నది'' అని విమర్శించారు. ఈ బిల్లులకు వ్యతిరేకం గా పార్లమెంటు వెలుపలా, లోపలా చాలా బలంగా ప్రజావాణి వినిపించాలని, నిరసన గళాన్ని చాటాలని సందోష్‌కుమార్ పిలుపు ఇచ్చారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులకు నష్టం వాటిల్లుతుందన్నారు.

**ప్రజాస్వామ్యశక్తుల ఐక్యతకు సిపిఐ(ఎం) పిలుపు**

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ, నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ మూడు సవరణ బిల్లులూ ఆ ప్రభుత్వ నయా నియంతృత్వ పోకడలను బహిర్గతం చేశాయని విమర్శించారు. ఈ బిల్లులు ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యంపై చేసిన ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. ఈ అమానుష, కిరాతక చట్టాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యశక్తులు ఐక్యం కావాలని పిలుపు ఇచ్చారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ, ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థకు మృత్యుఘంటికలు మోగిస్తోందన్నారు. ఎన్నికల వ్యవస్థను కూలదోయడం దగ్గర నుండి ఎన్నికల కమిషనర్ల నియామకాలు, ఒకేదేశం, ఒకే ఎన్నిక వ్యవస్థతోపాటు ఇప్పుడు ఈ మూడు సవరణ బిల్లుల వరకూ దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు పాడె కట్టేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

**పార్లమెంటరీ మెజార్టీ దుర్వినియోగం: ఖర్గే**

కేంద్రంలో బిజెపి నిసిగ్గుగా, బాహాటంగా తన పార్లమెంటరీ మెజారిటీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే విమర్శించారు. అమిత్ షా ప్రవేశపెట్టిన మూడు బిల్లులను ఆమోదించుకుని ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు ఇడి, ఐ.టి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలకు అమానుషమైన విపరీతాధికారాలు కట్టబెడతారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరీకరించేందుకు వీటిని ఉపయోగిస్తారన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల చిత్తశుద్ధి అసాధారణమైన సవాళ్ళను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, హుందాగా రాజ్యసభ పని చేసేందుకు ఆ విలువలను పునరుద్ధరించేందుకు తాను స్థిరంగా కట్టుబడి ఉన్నానని ఖర్గే పేర్కొన్నారు.

**రాజ్యాంగ విరుద్ధం : ప్రియాంకాగాంధీ**

అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు సవరణ బిల్లులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా పేర్కొన్నారు. ప్రజల కళ్ళకు గంటలు కట్టాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే రేపు ఇక ముఖ్యమంత్రిమీద ఎలాంటి కేసులు పెట్టాల్సిన అవసరం ఉండదని, ఎలాంటి నేరం చేయకపోయినాగానీ వారిని అరెస్టు చేసిన 30 రోజుల తర్వాత పదవీచ్యుతులను చేయవచ్చునన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి చెందిన చోట్ల ముఖ్యమంత్రులను గద్దె దించేందుకు ఈ బిల్లులను ఉపయోగిస్తారని విమర్శించారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపి సాకేత్ గోఖలే ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చివేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రతిపాదించిందని విమర్శించారు. ప్రభుత్వాలను కూల్చివేసేందుకు అమిత్ షా కొత్త మాయోపాయాలను ప్రవేశపెడుతున్నారన్నారు. లోక్‌సభలో టిఎంసి ఎంపి మహువా మొయిత్రా కూడా ఒక ప్రకటన చేస్తూ, సమాఖ్య వ్యవస్థను, న్యాయవ్యవస్థను తప్పించుకుని ముఖ్యమంత్రులను, మంత్రులను పదవీచ్యుతులను చేసేందుకు ఈ బిల్లులు తీసుకువచ్చారన్నారు. శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ స్పందిస్తూ, ప్రతిపక్షాల నాయకత్వంలో రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వాలను భయపెట్టేందుకే ఈ బిల్లులు తీసుకువచ్చారని విమర్శించారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు వి.డి.సతీశన్ తిరువనంతపురంలో బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతిపక్షాలు ఈ బిల్లులను గట్టిగా ప్రతిఘటిస్తాయన్నారు. సహజసిద్ధమైన న్యాయ విచారణకు విరుద్ధంగా ఈ బిల్లులను తీసుకువచ్చారన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మేడారం జాతరకు రూ.150 కోట్లు మంజూరు



ప్రజాపక్షం/హైదరాబాద్: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ఏర్పాట్ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసినట్లు బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరిలో జరిగే మేడారం మహా జాతర నిర్వహణ, మేడారంలో శాశ్వత నిర్మాణాల పనుల కోసం ఈ నిధులను ఖర్చు పెట్టనున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా మేడారం మహా జాతరను ఘనంగా నిర్వహించేందుకు రూ.150కోట్లు మంజూరు చేసిన సిఎం, డిప్యూటి సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

# రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

* 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీకి అసెంబ్లీలో చట్టసవరణ చేస్తాం
* రాహుల్ గాంధీ ప్రధాని కాగానే అమల్లోకి

**రాజీవ్ గాంధీ జయంతి సభలో సిఎం రేవంత్ రెడ్డి**



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీకి పోటీ చేసేందుకు ప్రస్తుతం 25 ఏండ్లు నిండాలనే నిబంధన ఉన్నదని దానిని 21 ఏండ్లకు సవరిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాగానే అమల్లోకి తెస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభలో చట్ట సవరణ చేస్తామన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, శాసనమండలి ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో 21 ఏండ్ల వయసుకు ఓటు హక్కు ఉండేదని అప్పట్లో పోటీ చేసే వయస్సును 25 ఏండ్లుగా నిర్ధారించారని అన్నారు. ఇప్పుడు 18 ఏండ్లకు తగ్గించనందున పోటీచేసే వయసును 21 ఏండ్లకు తగ్గించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. దానిద్వారా యువత రాజకీయాల్లోకి వస్తారని అన్నారు. రాజకీయాల్లోకి యువత ను ప్రోత్సహించడమే లక్ష్యమని చెప్పారు. తెలంగాణకు గుండెకాయలాంటి సచివాలయం ముందు రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దేశంలోని టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆయనే ఆద్యుడన్నారు. రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి అని అన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన తన ప్రాణాలను అర్పించారని గుర్తు చేసుకున్నారు. పారదర్శక పాలన అందించేందుకు సాంకేతికతను వినియోగించాలని ఆయన ఆనాడే ఆలోచించారన్నారు.

హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి పునాది కూడా రాజీవ్ గాంధీ స్ఫూర్తితోనే పడిందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. చట్ట సభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న సోనియాగాంధీ ఒత్తిడితోనే పార్లమెంటులో బిల్లు పెట్టి పాస్ చేసిందన్నారు.

**రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తాం..**

రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ వంటి సామాజిక సమస్యలను పరిష్కారం చూపామన్నారు. రాజీవ్ గాంధీ కలలను సాకారం చేయాలంటే రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు.

రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోమని, తెలంగాణలో కొలువు దీరిన ప్రజా ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దబోతోందని చెప్పారు. త్వరలోనే మూసీ ప్రక్షాళనను ప్రారంభించ బోతున్నట్లు చెప్పారు.

# కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్

**సిపిఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎండి.యూసుఫ్**



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్ అని, ఈ ప్రాంతంలో సిపిఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నామని సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి.యూసుఫ్ అన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు నివాస స్థలాల కోసం భూపోరాటాలు చేస్తూ అనేక కాలనీలు ఏర్పాటు చేసిందని చెప్పారు. మేడ్చల్ జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లో 'కామ్రేడ్ ఎస్.బాలమల్లేశ్ హాల్'లో బుధవారం ప్రారంభమైన మహాసభలో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ పేదలకు గూడుకోసం చేపట్టిన ప్రజా, భూపోరాటాల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక భూకబ్జాదారులు, గూండాల నుంచి అనేక దాడులను, హత్యా ప్రయత్నాలను, కేసులను ఎదుర్కొన్నారని, చివరకు ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. 1972లో సిపిఐ నాయకులైన కె.ఎల్.మహేంద్ర, పొట్లూరి నాగేశ్వర రావు, సభాపతి, వి.సత్తయ్య, నాగయ్యల నాయకత్వంలో ప్రాగాటూల్స్ స్థలంలో భూపోరాటం నిర్వహించి గిరినగర్ బస్తీని స్థాపించామన్నారు. ప్రాగా టూల్స్ యాజమాన్యం బస్తీని బుల్డోజర్లతో కూల్చివేయటానికి ప్రయత్నించగా అప్పట్లో ఎంఎల్‌సిగా ఉన్న కె.ఎల్.మహేంద్ర, పొట్లూరి నాగేశ్వరరావు, వి.సత్తయ్యనాయకత్వంలో పార్టీ కార్యకర్తలు బుల్డోజర్లకు అడ్డంగా పడుకుని బస్తీని కాపాడామన్నారు. ఇదే స్ఫూర్తితో జగద్గిరిగుట్ట, కళావతినగర్, మఖ్తూంనగర్, లెనిన్ నగర్, రావినారాయణ రెడ్డి నగర్‌లను ఏర్పాటు చేసి వేలాది మందికి ఇండ్ల స్థలాలను పంచిన చరిత్ర సిపిఐదన్నారు. ఈ సందర్భంగా అనేక కేసులు, భూస్వాముల దాడులు, ఆర్‌ఎస్ఎస్ దాడులను ఎదుర్కొన్నామని, ముఖ్యంగా ఈ పోరాటాలు నిర్వహించే సందర్భంలో శుక్రుపల దాడిలో అబ్బాస్, ఏసురత్నం తలలు పగిలేవి కాకుండ. నాయకులు, కార్యకర్తలు భూకబ్జు హత్యాకేసులతో సహా అనేక పోలీస్ కేసులను ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ ప్రాంతంలో ప్రజానాట్యమండలి శాఖ బలంగా ఉండి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిందని, కరోనాలో మరణించిన ప్రముఖ కవి వాగ్గేయకారుడు నిస్సార్ కుత్బుల్లాపూర్ మండల స్థానికుడేనని యూసుఫ్ పేర్కొన్నారు.

# మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

**మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ**

ప్రజాపక్షం/హైదరాబాద్: మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25లో డిసిఎ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డిసిఎ డైరెక్టర్ జనరల్ షాన్‌వాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది లో జులై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 ఈ ఏడాది జులై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యూయాస్, నాట్ స్టాండర్డ్ (డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. వేదేనే నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మనెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పిడియాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిసిఎ డిజిని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్ పనులను స్పీడ్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని.. తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## 2025-27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు
# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..
**త్వరలో నోటిఫికేషన్.. దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు**



ప్రజాపక్షం/హైదరాబాద్: మద్యం షాపుల గడువు నవంబర్ 30తో ముగియనుండడంతో తెలంగాణ రాష్ట్రంలో దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం ఈ నెల 14న గెజిట్ విడుదల చేసింది. 2025–27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గెజిట్ ఆధారంగా ఎక్సైజ్ కమిషనర్ మద్యం దుకాణాలకు దరఖాస్తు స్వీకరణ గడువును నిర్ణయిస్తారు. దరఖాస్తుల స్వీకరణకోసం ఎక్సైజ్ శాఖ అధికారులు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. దరఖాస్తు ఫీజు రూ.3లక్షలు ఉంటుంది. మద్యంషాపు కోసం కొనుగోలు చేసిన దరఖాస్తు ఫీజు తిరిగి చెల్లించబడదని గెజిట్‌లో పేర్కొన్నారు. మద్యం దుకాణాల్లో గౌడ్లకు 15శాతం, ఎస్‌సిలకు 10శాతం, ఎస్‌టిలకు 5 శాతాన్ని కేటాయింపు ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా ఉన్న షాపులకు రూ.50లక్షలు, 5 వేల నుంచి 50వేల జనాభా ఉన్న షాపులకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న షాపులకు రూ. 60లక్షలు, లక్ష నుంచి ఐదు లక్షల జనాభాకు రూ.65లక్షలు, 5 లక్షల నుంచి 20లక్షల జనాభా షాపులకు రూ.85 లక్షలు, 20 లక్షలపై అధికంగా ఉన్న మద్యం షాపులకు రూ.110లక్షల సంవత్సర ఫీజుగా ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు. మద్యంషాపు లైసెన్స్ పొందిన యజమాని సంవత్సరం ఫీజువేటితో అదనం గా రూ.5 లక్షలు చెల్లిస్తే వాక్ లిక్కర్ స్టోర్ పెట్టుకునే అవకాశం కల్పించారు. జిహెచ్ఎంసి పరిధిలో మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటలకు మద్యం దుకాణాలు నడుపుకునే అవకాశం ఉంటుంది. 2025 డిసెంబర 1 నుంచి 2027 నవంబరు 31 వరకు కొత్త మద్యం షాపులు నడుపుకోవడాని కి ఎక్సైజ్ శాఖ లైసెన్స్ ఇవ్వనున్నారు.


# దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు పునరుద్ధరణ చర్యలు

**అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల వివరాలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఆర్ అండ్ బి అధికారులతో బుధవారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టుల వివరాలు ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్ల,వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి ప్రధాన ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఇ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుల నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గత రెండ్రోజుల్లో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని, 24 గంటలు అలర్ట్‌గా ఉంటున్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళ్ళొద్దన్న ఆదేశాలు పాటిస్తూ..ప్రతి ఆర్ అండ్ బి అధికారి నిబద్ధతతో పనిచేశారని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహంకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలో 739 చోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించామని, అందులో 854 కి.మీ రోడ్లు దెబ్బతిందని, 25 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 5 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 310 చోట్లలో కాజ్ వే లు, కల్వర్టుల వరద ప్రవాహం ఉండగా అందులో 228 దారి మళ్లింపు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 200 చోట్లలో రోడ్లు, కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

తాత్కాలిక పునరుద్ధరణకు 46 కోట్లు వరకు ఖర్చు అవుతుందని,శాశ్వత పునరుద్ధరణ కోసం 984 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వివరించారు. రోడ్ల డ్యామేజ్, ప్రజల రాకపోకలకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా, పలు దినపత్రికల్లో వార్తలు చూశానని వాటి క్షేత్ర స్థాయి పరిస్థితి ఏంటని మంత్రి ఆరా తీశారు. దీనికి ఆ ప్రాంతాల్లో రోడ్ సేఫ్ చేసి ట్రాఫిక్ క్లియరెన్స్ ఉండేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. స్టేట్, నేషనల్ హైవే రోడ్లకు సంబంధించిన వివరాలు ఇంచార్జ్ ఈఎన్‌సి జయ భారతి, ఆర్నోల్డ్, ఆర్‌యుబి ల వద్ద పరిస్థితిని సి.ఇ. రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఇప్పటివరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పనితీరును అభినందించిన మంత్రి, అదే స్ఫూర్తితో రాసున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని వారికి చెప్పారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు, ఎంఎల్ఏలు సమక్షంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ ఎంఎల్ఏలతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి, మౌలిక వసతులు – రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. సంక్షేమ పథకాలైనటువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆర్థికంగా బలహీన వర్గాల కోసం ఆర్థిక సహాయం, రైతు రుణ మాఫీ, పంటల నష్టపరిహారం, విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మైనారిటీ & మహిళా అభివృద్ధి పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. యువత ఉపాధి అవకాశాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, రైతు బజార్ల విస్తరణ, ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుపై కూడా చర్చించారు.

# మహిళా పోలీసు శక్తికి అండగా తెలంగాణ ప్రభుత్వం

**మహిళా పోలీసుల తొలి సదస్సులో మంత్రి సీతక్క**

ప్రజాపక్షం/హైదరాబాద్:మహిళా పోలీసుల అవసరాలను గుర్తించి ప్రత్యేక వేసులుబాటు కల్పిస్తాం అని..మహిళా పోలీసు శక్తికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రాజేంద్రనగర్‌లోని రాజ్ బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సు బుధవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మహిళా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపిఎస్ అధికారులు చారు సిన్హా, శిఖా గోయల్, స్వాతి లక్రా తో పాటు కానిస్టేబుల్ నుండి ఎస్‌పి స్థాయి వరకు సుమారు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో మహిళా పోలీసుల విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరుగనుంది. ఈ సందర్భంగా సీతక్క ప్రసంగిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంమంత్రిగా మహిళా శక్తిని ప్రోత్సహిస్తున్నారని, ఈ సదస్సులో మహిళా పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనల ఆధారంగా సంక్షేమానికి సంబంధించిన సానుకూల నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1973లో కేరళలో కోజికోడ్లో దేశంలోని తొలి మహిళా పోలీస్ స్టేషన్ను ప్రారంభించిన విషయాన్ని వృత్తి ధర్మానికి మానవీయతను జోడిస్తే మంచి ఫలితాలు వస్తాయని, కమిట్మెంట్, కాన్ఫిడెన్సు చిరునామాగా తెలంగాణ మహిళా పోలీసులు నిలుస్తున్నారని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు ఎదుర్కొనే సంఘర్షణల దృష్ట్యా మెటర్నిటీ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. బొగ్గుబావుల నుంచి అంతరిక్షం వరకు మహిళలు రాణిస్తున్న ఈ రోజుల్లో మహిళల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ అండగా నిలవాలని, సమాజంలో మహిళల పట్ల ఉన్న చిన్నచూపును అరికట్టే బాధ్యత కూడా పోలీసులపైనే ఉందని ఆమె పేర్కొన్నారు. డెకిక్షన్, క్రమశిక్షణ, డిగ్నిటీతో మహిళా పోలీసులు పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు భరోసాగా నిలవాలని ఆమె సూచించారు. మహిళా పోలీసుల అవసరాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తే, వాటి ఆధారంగా చట్టాలు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి వాటిని తెలంగాణలో అమలు పరచేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 వేల మంది పోలీసుల్లో మహిళా పోలీసులు కేవలం 7 వేల మంది మాత్రమే ఉన్నారని, వారి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని సీతక్క గుర్తుచేశారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అధిగమించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్న నమ్మకాన్ని మంత్రి సీతక్క వ్యక్తం చేశారు.



# అంగన్‌వాడీలో త్వరలో అల్పాహార పథకం

**మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో మంత్రి సీతక్క**

ప్రజాపక్షం/హైదరాబాద్: అంగన్‌వాడీలో చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం కానుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జాయింట్ డైరెక్టర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్లు, అన్ని విభాగాల హెడ్‌ఓలు హాజరయ్యారు. సమావేశంలో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సాక్షం అంగన్‌వాడీ, ఆరోగ్య లక్ష్మీ, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, చిన్నారులకు యూనిఫాం పంపిణీ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ బలోపేతం, చిన్నారుల విజయ పాల సరఫరా, బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం, పాలనా కేంద్రాలు, పోషణ్ ట్రాకింగ్ తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన 1025 అంగన్‌వాడి భవనాలలో ఇప్పటివరకు 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారని.. మిగిలిన ప్రాంతాల్లో స్థలాన్వేషణ పనులు వేగం పూర్తి చేయాలని సూచించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.12లక్షలు కేటాయించినట్లు గుర్తుచేశారు. పనుల జాతరలో భాగంగా నూతన భవనాల శంకుస్థాపనలు జరగాలని, ఇప్పటికే పూర్తి చేసిన 22 అంగన్‌వాడీ భవనాలను స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలన్నారు. అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్ల యూనిఫాం చీరల తయారీ పూర్తైన జిల్లా కేంద్రాలకు చేరాయని, వాటిని త్వరగా పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే హైదరాబాద్ లోని 139 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన ఈ స్కీమ్ కారణంగా పిల్లల హాజరు 30 శాతం పెరిగిందని పేర్కొన్నారు. పిల్లల పోషకాహారాన్ని మెరుగుపరచడంకోసం ప్రతి చిన్నారికి ఉదయం100 మి.లీ. పాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ప్రతి వారం ఒక రోజు ఎగ్ బిర్యానీ, ఒక రోజు వెజిటబుల్ కిచిడి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు కూర్చునేలా బల్లల ఏర్పాటు అభిప్రాయాల మేరకు మార్పులు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సేవలను అందించడంలో ఎక్కడా రాజీ పడొద్దు అని అధికారులను ఆదేశించారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా పోషకాహారం అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వెలిబుచ్చారు దిని అభినందించారు.

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అర్బన్ ఫారెస్ట్రీ**
హైజింపెల్ ఆఫీస్ బిల్డింగ్, నానక్‌రాంగూడ, హైదరాబాద్ - 500032

Rc. No.09/UF/HMDA/2010 టెండర్ నోటిఫికేషన్ తేది: 19.08.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా పనులకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ షెడ్యూల్ ను తేది: 26.08.2025 నుండి http://tender.telangana.gov.in నందు పొందవచ్చు.

సం/- డైరెక్టర్, అర్బన్ ఫారెస్ట్రీ, హెచ్ఎండిఎ.

DIPR R.O. No. : 6801-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
EE-Div.15, Sec-bad Zone/GHMC
'E' Procurement NIT No. 24/EE/Div-15/SBZ/GHMC/2025-26 తేది: 20.08.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ WWW.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / కోసం కమీషనర్, డివిజన్-15, ఎస్ఇజడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6797-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025

**రోడ్లు మరియు భవనాల విభాగం**
(R&B) డివిజన్, నల్గొండ.
ఫోన్: 9440819242, ఇమెయిల్: eerbngd@yahoo.in

NIT నం.53 నుండి 56/PA వరకు EE/R&B/NLG/2025-26, తేది: 14.08.2025

ఈ క్రింద పేర్కొన్న పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. 2025-26 సంవత్సరానికి నల్గొండ జిల్లాలోని ఎంపిక చేసిన నల్గొండ (R&B) డివిజన్ రోడ్ల వరకు. ఇతర వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, నల్గొండ

DIPR R.O. No. : 6770-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అందరూ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని కాటేపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులంతా తమ ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసుకుని బిల్లులు పొందాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఇందిర, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఏఈ హౌసింగ్ రవి చంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేంద్ర పాల్గొన్నారు.



## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

**ప్రజాపక్షం/దేవరకొండ :** సినిమా థియేటర్లలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు ఉండేలా యాజమాన్యం చూడాలని నిబంధనలు మేరకు ఫైర్ సేఫ్టి ప్రమాదం జరిగే ముందు హెచ్చరిక సంబంధించిన సైరన్లు ఉండేలా ఎప్పటికప్పుడు యాజమాన్యం అలర్ట్ గా ఉండాలని దేవరకొండ ఏఎస్పి మౌనిక అన్నారు. బుధవారం పట్టణంలోని మనోజ్ థియేటర్, వెంకటేశ్వర థియేటర్‌లను ఆమె పరిశీలించారు. థియేటర్లలో వసతులు, ప్రేక్షకులకు కావాల్సిన సౌకర్యాలు, సేఫ్టికి సంబంధించిన వాటిని ఆమె పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకట్‌రెడ్డి, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.






## ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి

### సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. బుధవారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలో జానపద వీధి నాటకోత్సవాలకు గ్రామీణ వృత్తి కళాకారులు వందల సంఖ్యలో హాజరై స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనకు ప్రజానాట్యమండలి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో జరిగిన వీధినాటక ఉత్సవాల సభలో మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి నేటి ప్రజా పోరాటాల వరకు ప్రజానాట్యమండలిది వన్నె తగ్గని పాత్ర అని అన్నారు. రామన్నపేట మండల ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సుద్దాల హనుమంతు నడయాడారని వారి యాదిలో కళా ప్రదర్శన నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ప్రజా పోరాటాలకు ఆయుధం ఇచ్చింది కళారూపాలేనని మాజీ ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్, ప్రజాగాయని వేముల పుష్ప, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహా, మాజీ నాయకులు ఎండి.జహంగీర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, దేశపాక రవి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కూరెళ్ల నరసింహాచారి పాల్గొన్నారు.

## బుద్ధ వనాన్ని కొనియాడిన హ్యూస్టన్ బౌద్ధాచార్యులు

### కృష్ణాతీర బౌద్ధ వారసత్వాన్ని వివరించిన శివనాగిరెడ్డి




**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని బుద్ధ వనం ప్రాజెక్టు ఒక అద్భుత బౌద్ధ వారసత్వ పర్యాటక స్థావరం అని, అక్కడి కట్టడాలు, శిల్పాలు ఆచార్య నాగార్జున స్ఫూర్తిని ఈ తరానికి తెలియజేస్తున్నయని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్ నగరంలోని వియత్నాం బౌద్ధ విహార ప్రధానాచార్యులు థామ్ అన్నారు. బౌద్ధ పరిశోధకుడు, పురావస్తు శాస్త్రవేత్త, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బుధవారం హ్యూస్టన్ లోని బుద్ధ విహారాన్ని, మూడంతస్తుల పగోడాను, 72 అడుగుల ఖ్యాన్ ఆమ్ బోధిసత్వ విగ్రహాన్ని సందర్శించి, ప్రధాన బౌద్ధ ఆచార్యులను కలిసి కృష్ణా తీర బౌద్ధ వారసత్వ స్థలాలు, బౌద్ధాచార్యులు, నాగార్జునసాగర్ లోని నాగార్జున కొండ,బుద్ధవనం గురించి వివరించి, బుద్ధ వనం కు సంబంధించిన వీడియోను ప్రదర్శించగా థామ్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. తాను నాగార్జున కొండను సందర్శించాలని అనుకుంటున్నానని తెలిపారని శివనాగిరెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జునుడి రచనలను బుద్ధవనం ద్వారా ఈ తరానికి తెలియ రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను గురించి, అమరావతి శిల్పకళ ప్రత్యేకత, కృష్ణా తీరం నుంచి శ్రీలంక ద్వారా బౌద్ధం దక్షిణాసియాదేశాలకు చేరిందని వియత్నాం బౌద్ధ ఆచార్యులు వివరించానని శివనాగిరెడ్డి తెలిపారు.

## సాగర్‌కు పెరుగుతున్న వరద ఉధృతి..

### ప్రాజెక్టు గేట్లు ఎత్తు పెంచిన అధికారులు

### మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తున్న నేపథ్యంలో వచ్చిన ఇన్ ఫ్లో వచ్చినట్టే నాగార్జునసాగర్ వైపు విడుదల చేస్తుఉండటంతో సాగర్ ప్రాజెక్టు కు గంట గంటకు వరద పెరిగి పోటెత్తుతుంది దీనితో సాగర్ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయి ప్రాజెక్టు గేట్ల ఎత్తును పెంచారు. వస్తున్నటువంటి ఇన్ ఫ్లో 5 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 20 గేట్లను 13 అడుగులు 6 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద పోటెత్తుతూ ఉండటం సాయంత్రానికి ఈ వరద ఉధృతి 6 లక్షల క్యూసెక్కుల వరకు పెరగవచ్చని ప్రాజెక్టు అధికారులు తెలిపారు దీనితో కృష్ణా నది పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.సాగర్ ప్రాజెక్టుకు మొత్తం ఇన్ ఫ్లో 485872 క్యూసెక్కులు ఉండగా 478384 క్యూసెక్కు ల నీటిని అవుట్ ఫ్లో గా విడుదల చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు 583.70 అడుగులుగా ఉన్నది.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీమారం సూర్యాపేట రహదారి నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మొల్కపట్నం మాజీ ఎంపీటీసీ రెముడాల పరుశురాములు అన్నారు. బుధవారం ఆయన సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు ఫిర్యాదు చేసి మాట్లాడారు. బీమా రం సూర్యాపేట రోడ్డుకు నిధులు మంజూరై పది సంవత్సరాలు అయినా ఇంతవరకు రోడ్డు అసంపూర్తిగా ఉందని తక్షణమే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని రోడ్డు పూర్తి చేసేలా చూడాలని కోరారు. నిరంతరం వాహనాలు తిరిగే మార్గాన్ని అధికారులు, గత పాలకులు పట్టించుకోలేదని, దీంతో రోడ్డు అసంపూర్తిగా ఉండి ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు.

# యూరియా పంపిణీకి చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాకు వచ్చిన 510 మెట్రిక్ టన్నుల యూరియాను అవసరం ఉన్న రైతులకే పంపిణి చేయాలని, యూరియా పంపిణిలో ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవసాయాధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో యూరియాపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంగళవారం రాత్రి జిల్లాకు 510 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఈ యూరియాను ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలక అవసరం ఉన్నంత మేరా కేటాయించడం జరిగిందన్నారు. యూరియా సక్రమ పంపిణికి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖల అధికారుల సమన్వయంతో పంపిణి చేయాలని, యూరియా పంపిణిలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకూడదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అవసరం లేని రైతులు యూరియాను నిల్వ ఉంచుకోవద్దన్నారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా వాడపల్లి చెక్‌పోస్టు వద్ద యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌ను ఆదేశించారు. తహసీల్దార్లు సైతం ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను, గోదామ్‌లను తనిఖీ చేయాలన్నారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మొత్తం 19500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు సుమారు 14వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువులు ఉండేలా చూడాలని, ఎరువులు రిటైల్ షాపులకు వచ్చిన తరువాత సక్రమ పంపిణికి వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## ఎసిబి అధికారులకు చిక్కిన కోదాడ ఫారెస్ట్ ఆఫీసర్



**ప్రజాపక్షం/కోదాడ:** ఎసిబి అధికారుల వలలో ఓ అవినీతి తిమింగలం చిక్కింది. కోదాడ ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ అనంతుల వెంకన్న నల్లగొండ రేంజ్ ఎసిబి అధికారులకు చిక్కాడు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కలప వ్యాపారికి వ్యాపారం చేసేందుకు 20వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో, బుధవారం బాధితుడు నుండి 20వేలు తీసుకుని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకొనుచుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. కాగా నిందితుడిని నాంపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యం..

### ఇందిరమ్మ ఇండ్ల బిల్లులురాక లబ్ధిదారులు ఇబ్బందులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద గృహాలు నిర్మించిన లబ్ధిదారులు బిల్లులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసి 20 రోజులు కావస్తున్న, సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు అందడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇల్లు నిర్మిస్తే బిల్లును తక్షణమే ఇస్తామని హామీ ఇచ్చింది కానీ నెలలు గడిచినా ఇప్పటికే చెల్లింపులు జరగలేదు. అప్పు చేసి ఇల్లు కట్టుకున్న ఇప్పుడు కాంట్రాక్టర్లు, మేస్త్రీలు అడుగుతున్నారు. బిల్లులు రాక మేము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులకు బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నారు.

**ఎఇ పవన్ కుమార్ వివరణ...** లబ్ధిదారుల వివరాలు కంప్యూటర్లో అప్లోడ్ చేయగా లాగిన్ అవ్వడం లేదని, టెక్నికల్ ప్రాబ్లం ఉందని ఏఈ పవన్ కుమార్‌ను ఫోన్లో సంప్రదించగా ఈ విధమైన సమాధానం ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడు గడ్డం యాదయ్య..** ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మా పేరు రావడంతో ఇల్లు నిర్మించుకునేందుకు అన్ని ఏర్పాటు చేసుకొని బేస్మెంటు వరకు నిర్మాణం పూర్తి చేశాం. బేస్మెంట్ పూర్తి చేసి కూడా 20 రోజులు అయినది. బేస్మెంట్ పూర్తయిన వారంలోపు ఒక లక్ష రూపాయల బిల్లు ఇస్తామని అధికారులు తెలిపారు. అయినా ఇంకా కూడా బిల్లు రాలేదనీ ఆవేదన వ్యక్తం చేశాడు.

**ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లు వెంటనే మంజూరు చేయాలి...సిపిఐ**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



# తుంగతుర్తి గర్భిణి మృతి కేసులో ఏడుగురు అరెస్టు

### లింగనిర్ధారణకు ఉపయోగించిన పరికరాలు స్వాధీనం

### డిఎస్‌పి ప్రసన్నకుమార్ వెల్లడి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** తుంగతుర్తి మండల కేంద్రంలో ఈనెల 16వ తేదీన అబార్షన్ వికటించి గర్భిణీ మృతి చెందిన కేసులో పోలీసులు 7గురు నింధితులను బుధవారం అరెస్టు చేశారు. లింగనిర్ధారణకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన బయగల శ్రీను భార్య విజితకు కడుపునొప్పి రావడంతో తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీసాయిబాలాజీ హాస్పటల్‌కి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు స్కానింగ్ కూడా నిర్వహించారు. అప్పటికే ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో పుట్టబోయే శిశువు కూడా ఆడ అని తెలియడంతో అబార్షన్‌కు చేయించుకునేందుకు నిర్ణయించుకున్నారు. హాస్పటల్‌కు చెందిన ఆర్‌ఎంపి డాక్టర్ బండి శ్రీనివాస్‌తో రూ.25వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మరో ఆర్‌ఎంపి డాక్టర్ పానుగంటి సతీష్‌తో కలిసి విజితకు అబార్షన్ చేస్తున్న క్రమంలో వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి హుటాహుటిన తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా ఆమె మృతికి కారణంగా తుంగతుర్తి ఆర్‌ఎంపి వైద్యుడు బండి శ్రీనివాస్ కారణమంటూ మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసును తుంగతుర్తి సిఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విజితకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని కల్పన క్లినిక్‌లో పనిచేస్తున్న పోలెంపల్లి కల్పనను, తుమ్మచెర్ల గ్రామానికి చెందిన నర్సు అరుణని, స్కానింగ్ చేసిన అశోకుని, లింగ నిర్ధారణ పరీక్ష చేసే స్కానర్ ఏర్పాటు చేసిన నిర్వాహకుడు పులి వీరభద్రరావులను నిందితులుగా గుర్తించారు వీరితోపాటు అబార్షన్ చేసిన బండి శ్రీనివాస్, ఆర్‌ఎంపి, పానుగంటి సతీష్ ఆర్‌ఎంపి, మృతురాలి భర్త బయగల శ్రీను లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ వైద్య చట్టాల ప్రకారం ముందస్తు లింగనిర్ధారణ పరీక్ష నేరము, అర్హత లేకున్నా వైద్యం చేయడం నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి వాటికి సహకరించిన, ప్రేరేపించిన అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేస్తామని అన్నారు. ఇలాంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని డిఎస్‌పి కోరారు. ఈ సమావేశంలో తుంగతుర్తి సిఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో మూడు రోజుల పాటు పారిశుద్ధ్యం పనులకు మరియు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ మీటింగ్ ద్వారా డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీవోలు పంచాయతీ సెక్రటరీలు, వైద్య సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. మూడు రోజులపాటు అందుబాటులో ఉండి, గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఆయిల్ బాల్స్‌ను వాటర్ నిలిచి ఉన్నచోట వేయాలన్నారు. ట్యాంకులలో వాటర్ నిల్వ ఉన్నచోట ఆ నీటి మొత్తాన్ని పారవేయాలి అన్నారు. ఓహెచ్‌యస్ఆర్ ట్యాంకులను నెలలో మూడు సార్లు క్లీన్ చేయాలన్నారు. ట్యాంకులను బ్లీచింగ్, క్లోరినేషన్‌తో క్లీన్ చేసి కొత్త నీటిని నింపాలన్నారు. గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతి రోజు ఫాగింగ్ చేయించాలన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించి గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ జూమ్ మీటింగ్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇంటరాక్టివ్ డిజిటల్ లెర్నింగ్‌కు దోహదపడేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గణిత, భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు టిఎస్ఎంఎస్ ఇమాంపేట నందు నిర్వహించబడిన కెపాసిటి బిల్డింగ్ ప్రోగ్రాం ఆన్ లెర్నింగ్ అవుట్ కమ్స్ మీద నిర్వహించబడిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. మన జిలాల్లో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయని ఇదే స్ఫూర్తితో పని చేస్తూ విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు తప్పక సాధించేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి 70 శాతం మార్కులపైన సాధించాలని అభ్యసన ఫలితాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొని విజయవంతం కావాలని జిల్లా అధికారులకు, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. మోడల్ స్కూల్ విద్యార్థులతో సమావేశమై గత సంవత్సర ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాలలో విజయం సాధించి నగదు బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సంవత్సరం కూడా ఎస్ఎస్‌సి, ఇంటర్ విద్యార్థులు గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ రీతిగా విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు తెలిపి మోడల్ స్కూల్‌ను జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ డి జనార్ధన్, జిల్లా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు

### జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలను ప్రజా పాలనలో అందించడం జరుగుతుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో దేవరకొండ మండల ప్రింట్ మీడియా సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం అర్హులైన జనులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50శాతం ఫీజులో రాయితీ ఇస్తూ వారి సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం జర్నలిస్టులకు కల్పించిన అర్హతలు జీవో ప్రకారం ఇంటి స్థలాలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో జర్నలిస్టులకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సహకరించాలని అన్నారు. ప్రజా సమస్యలను ఎలుగెత్తి చూపుతూ పరిష్కార వేదికలుగా పత్రికలు జర్నలిస్టులు ఉండాలని, సమాజంలో విలువలతో కూడిన జర్నలిజాన్ని విలేకరులు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో గంజాయి, డ్రగ్స్, బ్లాక్మెయిల్ వంటి చర్యలకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించేదిలేదని ఆదిశగా లా అండ్ ఆర్డర్ పని చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ప్రింట్ మీడియా, దేవరకొండ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు గిరిధర్‌రావు, అధ్యక్షులు కరుణాకర్, ఉపాధ్యక్షులు రామదాసు, సహాయ కార్యదర్శి దర్శనం విష్ణు, ప్రచార కార్యదర్శి అంజన్, కార్యవర్గ సభ్యులు సైదులు, కృష్ణ, వెంకటేష్, ఇలియాస్, గిరిప్రసాద్, ఫయాజ్, మహేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు తగ్గే వరకూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వాతావరణ శాఖ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వర్షాలు తగ్గేవరకు నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తూ భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. కుండపోత వర్షాల వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోయారని తనకు సమాచారం తెలిసిన వెంటనే ఆవేదన చెందానని ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యం గా యువకులు ఈతకు వెళ్లొద్దని వరదలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు దాటవద్దని సరదా కోసం పొంగిపొర్లుతున్నప్పుడు సెల్ఫీలు దిగువద్దని మత్స్యకారులు చెరువుల్లోకి చేపల వేటకు వెళ్లొద్దని వాహనదారులు వరదలు వాగులు వంకలు నదులు పొంగిపొర్లుతున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో దాటకూడదని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఏదైనా అత్యవసర సమయాల్లో తనకు ఫోన్ ద్వారా తెలపాలని భువనగిరి నియోజకవర్గ ప్రజలందరికీ ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని అధికారుల హెచ్చరికలు సూచనలు తప్పకుండా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## గౌహతి హైకోర్టుకు ఇద్దరు శాశ్వత జడ్జీలు

'సుప్రీం' కొలీజియం ఆమోదం

**న్యూఢిల్లీ :** గౌహతి హైకోర్టులో ఇద్దరు అదనపు న్యాయమూర్తులను శాశ్వత జడ్జీలుగా నియమించాలనే ప్రతిపాదనను బుధవారం సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఆగస్టు 19న సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. 'గౌహతి హైకోర్టుకు చెందిన అదనపు న్యాయమూర్తులు జస్టిస్ బుడి హబంగ్, జస్టిస్ ఎన్.ఉన్నిక్రిష్ణణ్ నాయర్ (ఎస్ఐసి)ను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలనే ప్రతిపాదనను 2025 ఆగస్టు 19న సుప్రీంకోర్టు కొలీజియం నిర్వహించిన సమావేశం ఆమోదించింది' అని సంబంధిత కమ్యూనికేషన్ వెల్లడించింది. నవంబర్ 10నుంచి తాజాగా మరో సంవత్సరం కొత్త పదవీకాలానికి అదనపు జడ్జి జస్టిస్ కౌశిక్ గోస్వామిని గౌహతి హైకోర్టు అదనపు జడ్జిగా నియమించాలని కూడా కొలీజియం సిఫారసు చేసింది.

## 11 ఏళ్లుగా విపక్షాలపై బిజెపి సర్కార్ దాడి

ప్రతిపక్షాల వాకౌట్ మధ్య బిల్లులు ఆమోదించుకున్నారు

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శ

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని కూటమి పార్టీలకు పరిచయం చేసిన ఖర్గే



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ సూత్రాలకు అంకితభావంతో ఉన్న వ్యక్తిని ఉపరాష్ట్రపతి పదవికి పోటీలో నిలబెట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయని, సుదర్శన్‌రెడ్డి లాంటి వ్యక్తి అలాంటి వారేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్) సెంట్రల్ హాలులో బుధవారం తన అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్న వివిధ పార్టీల నాయకులకు ఉమ్మడి ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ గత 11 సంవత్సరాలలో బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై వివక్ష చూపిందని విమర్శించారు. ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను త్వరితగతితో పాటు ప్రతిపక్ష పార్టీల వాకౌట్‌ల మధ్య కూడా ఆమోదిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బిల్లులను తొందరగా ఆమోదిస్తోందని, ఎంపిలను మాట్లాడనివ్వకుండా చేస్తుందని, ఇందులో స్పీకర్ కూడా పాత్ర పోషించారని ఖర్గే మండిపడ్డారు.

కాగా, సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తూ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారికి, దానిని సమర్థిస్తున్న వారికి మధ్య పోరాటం జరుగుతోందని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దొంగిలించిన తర్వాత బిజెపి బిహార్ ఎన్నికలను దొంగిలించగలదని పేర్కొన్నారు, కానీ ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని, అది జరగనివ్వరని ఉద్ఘాటించారు. భారతీయ న్యాయశాస్త్రంలో సుదర్శన్ రెడ్డిని 'అత్యున్నత వ్యక్తి'గా అభివర్ణించిన ఖర్గే, న్యాయం పట్ల ఆయనకున్న అచెంచలమైన నిబద్ధతకు ఆయన ప్రసిద్ధి చెందారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం నిర్భయమైన పోరాట యోధుడిగా, భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన మైలురాయి తీర్పులను అందించారని అన్నారు. 'ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక కేవలం పదవి కోసం జరిగే పోటీ కాదు.. ఇది మన దేశ ఆత్మ కోసం జరిగే సైద్ధాంతిక యుద్ధం. పాలక పార్టీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ఎంచుకున్నప్పటికీ, రాజ్యాంగం, దాని విలువలను మనకు మార్గదర్శక కాంతిగా మేము సమర్థిస్తాము. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఆజ్యం పోసిన, మన రాజ్యాంగానికి పునాదిగా నిలిచిన న్యాయం, సమానత్వం, సమ్మిళితత్వ కాలాతీత విలువలను సుదర్శన్‌రెడ్డి మూర్తీభవించారు' అని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. మన ప్రజాస్వామ్య సంస్థల సమగ్రత అపూర్వమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయం లో, ఆయన నామినేషన్ నిరంతరం క్షీణిస్తున్న రాజ్యసభ పనితీరుకు న్యాయంగా, నిష్పాక్షికంగా, గౌరవాన్ని పునరుద్ధరించడానికి దృఢమైన నిబద్ధతగా నిలుస్తుందని ఖర్గే అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాల విశ్వసనీయత పార్లమెంటు బలమైన వేదికగా పనిచేయడంపై ఆధారపడి ఉంటుందని, ఇక్కడ సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల మనోవేదనలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా, న్యాయంగా వ్యక్తీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్ష పార్టీలు సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వడంలో ఐక్యంగా ఉన్నాయని, ఆయన జ్ఞానం, సమగ్రత, అంకితభావం మన దేశాన్ని న్యాయం, ఐక్యతలో పాతుకుపోయిన భవిష్యత్తు వైపు ప్రేరేపిస్తాయని, నడిపిస్తాయని తాము విశ్వసిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో తమ ఎంపిలు ఎలా ఓటు వేయాలో తెలుసుకోవడానికి సెప్టెంబర్ 8న మాక్ పోల్ నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, సంస్థ, కెసి.వేణుగోపాల్ తెలిపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎన్‌సిపిఎస్‌పి నాయకుడు శరద్ పవార్, ఎస్‌పికి చెందిన రామ్ గోపాల్ యాదవ్, డిఎంకెకు చెందిన తిరుచ్చిశివ, ఎస్ఎస్‌యుబిటి నాయకుడు సంజయ్‌రౌత్, టిఎంసికి చెందిన శతాబ్ది రాయ్ వంటి అనేక మంది ప్రతిపక్ష నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతేకాకుండా, ఉపరాష్ట్రపతి అభ్యర్థిని స్వాగతిస్తున్నప్పుడు ఇతర ప్రతిపక్ష ఎంపిలు కూడా సెంట్రల్ హాల్‌లో ఉన్నారు.

## ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ నామినేషన్



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్‌డిఎ అభ్యర్థి సిపి.రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనవెంట ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. రాధాకృష్ణన్, సీనియర్ ఎన్‌డిఎ నాయకులు కలిసి మోదీ, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసికి మోదీ నాలుగుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలలో మోదీ, సింగ్, షా, జెడి(యు) నాయకుడు రాజీవ్ రంజన్ సింగ్ ప్రధాన ప్రతిపాదకులుగా ఉన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి కనీసం 20 మంది ఓటర్లు ప్రతిపాదకులుగా, కనీసం మరో 20 మంది ఓటర్లు ద్వితీయులుగా తన నామినేషన్ పత్రాలకు సభ్యత్వాన్ని పొందాలి. దాఖలైన నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలలో ఎన్‌డిఎ తన నియోజకవర్గాలన్నింటికీ ప్రతిపాదకులు, ద్వితీయులుగా ప్రాతినిధ్యం వహించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను పరిశీలించిన తర్వాత రాధాకృష్ణన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆతర్వాత రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాల రసీదు స్లిప్‌ను ప్రధానమంత్రికి అందజేశారు. మోడీ, షా, సీనియర్ మంత్రులు ప్రహ్లాద్‌జోషి, ధర్మేంద్రప్రధాన్, ఇతర ఎన్‌డిఎ నాయకులు, టిడిపి నాయకుడు, కేంద్రమంత్రి కె.రామ్‌మోహన్ నాయుడు, శివసేన నాయకుడు శ్రీకాంత్ షిండే, ఎల్‌జెఎస్‌పి (ఆర్‌వి) నాయకుడు చిరాగ్ పాస్వాన్ రాధాకృష్ణన్‌ను పార్లమెంటులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తీసుకెళ్లారు. ముందుగా, రాధాకృష్ణన్ పార్లమెంటు కాంప్లెక్స్‌లోని ప్రముఖ వ్యక్తుల విగ్రహాలు ఉన్న ప్రేరణ స్థల్ వద్ద మహాత్మా గాంధీ, ఇతర జాతీయ నాయకులకు నివాళులర్పించారు.

## రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తన తండ్రికి నివాళులర్పిస్తూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'ప్రతిపౌరుడు గౌరవించబడే, సద్భావన ఉన్న, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో బలంగా నిలబడే భారతదేశం ఇది. నాన్న, మీఈ కలను నెరవేర్చడమే నాజీవిత లక్ష్యం' అన్నారు. వీర్ భూమిలోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నానికి తన కుటుంబంతో పాటు హాజరైన ప్రియాంకగాంధీ ఎక్స్ పోస్టులో 'మేము కరుణ, ప్రేమ, దేశభక్తి అనే మతాన్ని మీనుండి వారసత్వంగా పొందాం. మేమిద్దరం ఈ మతాన్ని ఎప్పటికీ అనుసరిస్తాము. ఎవరూ మమ్మల్ని విచ్ఛిన్నం చేయలేరు. ఎవరూ మమ్మల్ని ఆపలేరు. మా అడుగులు ఎప్పటికీ తడబడవు' అని పేర్కొన్నారు. రాజీవ్ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వీర్ భూమిలో ఒక స్మారక కార్యక్రమాన్ని నిర్వహించింది. పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్‌ఖర్గే, కెసి.వేణుగోపాల్, ప్రియాంకగాంధీ వాద్ర పాల్గొన్నారు. ఆతరువాత, సంవిధాన్ సదన్(పాత పార్లమెంట్‌హౌస్) సెంట్రల్ హాలులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజీవ్ గాంధీకి పుష్పాంజలి ఘటించారు. స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తదితరులు నివాళులర్పించారు. 'ఈరోజు రాజీవ్ జయంతి సందర్భంగా, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీజీకి నా నివాళులు' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. సద్భావన దివస్‌ను జరుపుకుంటున్నందున, లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించిన, భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీని మనం గుర్తుచేసుకుంటున్నామని ఖర్గే అన్నారు. దేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చాయన్నారు. రాజీవ్ జయంతి సందర్భం గా ఆయనకు ప్రగాఢ నివాళులర్పిస్తున్నామని ఖర్గే ఒక పోస్ట్‌లో తెలిపారు. ఈసందర్భంగా ఖర్గే మరోపోస్టులో రాజీవ్‌గాంధీ హయాంలో సాధించిన విజయాలను గుర్తుచేశారు. ఓటింగ్ వయస్సును 18సంవత్సరాలకు తగ్గించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం, టెలికాం, ఐటి విప్లవం, కంప్యూటరీకరణ కార్యక్రమాలు, శాంతి ఒప్పందాలను కొనసాగించడం, మహిళా సాధికారత, సార్వత్రిక టీకాకార్యక్రమం, సమ్మిళిత విద్యపై ప్రాధాన్యతనిస్తూ కొత్త విద్యా విధానం వంటి అపూర్వమైన కార్యక్రమాలు దేశంలో పరివర్తన మార్పులను తీసుకువచ్చాయని పేర్కొన్నారు.

## ఢిల్లీ సిఎంపై దాడి

హత్య కుట్రలో భాగమేనని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన 'జాన్ సన్‌వై' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి జరిగింది. హత్య కుట్రలో భాగమే ఈ దాడి అని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఘటనలో రాజ్‌కోట్ (గుజరాత్) నివాసి అయిన 41ఏళ్ల నిందితుడు సక్రియా రాజేష్‌భాయ్ ఖిమ్జీభాయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఐబి, ఢిల్లీ పోలీసుల స్పెషల్‌సెల్ సంయుక్తంగా విచారిస్తున్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ దాడి ఉదయం 8.15 గంటల ప్రాంతంలో జరిగిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చేతి, భుజం, తలపై గాయాలు అయ్యాయని పిడబ్ల్యుడి మంత్రి పర్వేష్ వర్మ తెలిపారు. ఈ దాడి తీవ్రమైన దాడి అని, ఇది ప్రాణాలకు ముప్పు కలిగించేది కావచ్చునని దర్యాప్తు గురించి తెలిసిన సీనియర్ పోలీసుఅధికారి ఒకరు తెలిపారు. తాము ఐబి, స్పెషల్ సెల్, నిఘా సంస్థలతో కలిసి విచారణ చేస్తున్నామని, నిందితుడిపై ఐదు క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. వాటిలో కత్తి దాడికి సంబంధించిన రెండు దాడి కేసులు, ఎక్సైజ్‌చట్టం కింద మూడు ఉన్నాయని ఓఅధికారి పిటిఐకి తెలిపారు. కఠినమైన తనిఖీలు ఉంటాయని నిందితుడికి తెలుసు కాబట్టి అతను ఎటువంటి ఆయుధాన్ని తీసుకెళ్లలేదని, కేవలం బట్టలు, కొన్ని కాగితాలతో కూడిన బ్యాగు ను తీసుకెళ్లాడన్నారు. కాగా, దాడికి సంబంధించి హత్యాయత్నం అభియోగాల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బిఎన్ఎస్ సెక్షన్ 109(1) కింద సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్) రాజాబందియా ఒక ప్రకటనలో తెలిపా రు. ఖిమ్జీభాయ్ రెండు రోజుల క్రితం ఢిల్లీకి వచ్చి ఉత్తర ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో బస చేసినట్లు తెలిపాయి. మంత్రి కపిల్‌మిశ్రా మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తి ముఖ్యమంత్రిని నేలపైకి తోసి కొట్టడానికి ప్రయత్నించాడన్నారు. ఇలాంటి దాడి ఢిల్లీ లో ఎప్పుడూ జరగలేదని మిశ్రా విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. షాలిమార్ బాగ్‌లోని సిఎం నివాసం నుండి వచ్చిన సిసిటివి ఫుటేజ్‌లను ఉటంకిస్తూ సిఎం గుప్తాపై దాడి హత్య కుట్రలో భాగమేనని అధికారికవర్గాలు తెలిపాయి. దుండగుడు కనీసం 24గంటల ముందుగానే దాడికి సన్నాహాలు ప్రారంభించాడని ఫుటేజ్ స్పష్టంగా చూపిస్తుందని వారు చెప్పారు. ఇదిలా ఉండగా నిందితుడి తల్లి భానుబెన్ సకారియా రాజ్‌కోట్‌లో మాట్లాడుతూ తన కొడుకు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడు కాదని, వీధికుక్కలపై సుప్రీంకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనడానికి దేశ రాజధానికి వెళ్లాడని పేర్కొంది. ఆమె తన కొడుకు 'శునక ప్రేమికుడు' అని పేర్కొంది. 'అతను కుక్కలు, ఆవులు, పక్షులను ప్రేమిస్తాడు. ఢిల్లీలోని వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత అతను కలత చెందాడు' అని చెప్పింది, కొన్నిరోజుల క్రితం సుప్రీంకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా నిరసనలలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్తానని ఫోన్‌లో చెప్పాడని పేర్కొంది.

## జిఎస్‌టి పన్ను రేట్ల తగ్గింపుతో సంవత్సరానికి దాదాపు రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం



పన్ను సంస్కరణల ఆవశ్యకతను విపులీకరించిన ఆర్థిక మంత్రి

జిఎస్‌టి మంత్రుల బృందంతో నిర్మలా సీతారామన్ సమావేశం

21న జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణపై మళ్లీ సమావేశం

**న్యూఢిల్లీ :** గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి) పాలనలో పన్ను రేట్లను తగ్గించడం, వ్యాపారాలపై సమ్మతి భారాన్ని సడలించడం వంటి సమగ్ర సంస్కరణల కోసం తన ప్రభుత్వ ప్రణాళికలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం రాష్ట్రాల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఓఎం'స్)కు సమర్పించారు. రేటు హేతుబద్ధీకరణ, బీమా పన్ను, పరిహార సెస్సుపై రెండు రోజుల పాటు జిఓఎం'స్ కేంద్రం సంబంధిత తదుపరి జిఎస్‌టి సంస్కరణలపై చర్చించనున్నాయి. దీని కింద 5, 18 శాతం రేటు పన్నుతో పన్ను విధించబడుతుంది. ప్రత్యేకించి 5 నుంచి 7 వస్తువులపై 40శాతం రేటును ప్రతిపాదించారు. ఇందులో 'సిన్ గూడ్స్' కూడా ఉన్నాయి. ప్రస్తుతం జిఎస్‌టి 5, 12, 18, 28శాతంగా ఉన్నది. అదేసమయంలో ఆహార, అవసర వస్తువులపై సున్నా లేదా 5శాతం రేటులో ఉన్నాయి. విలాస, డీమెరిట్ గూడ్స్ 28శాతం స్లాబులో ఉన్నాయి. దానిపై సెస్సు ఉంటుంది. మంత్రుల బృందాలను ఉద్దేశించి ప్రసంగించిన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రసంగం కొద్ది నిమిషాల పాటే కొనసాగిందని, కేంద్రం ప్రతిపాదనను ఆమె వివరించారని ఒక అధికార వర్గం వెల్లడించింది. రాష్ట్రాలకు జిఎస్‌టి సంస్కరణల ఆవశ్యకతను ఆమె వివరించారని కూడా తెలిపారు. రేటు హేతుబద్ధీకరణపై స్లాబ్‌లు, రేట్లను సూచిందం, కొన్ని ఎదుర్కొంటున్న సుంకాల విలోమాన్ని తొలగించడం తప్పనిసరి చేయబడింది. జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం ఈ నెల 21న మళ్లీ సమావేశం కానుంది. ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, ఈ ప్రతిపాదన ప్రభావం వల్ల సంవత్సరానికి దాదాపు రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం సంభవించవచ్చు. అక్టోబరు 1నుండి పన్నురేట్లు అమలుచేయబడితే, ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆదాయ నష్టం రూ.45,000 కోట్ల మేరకు ఉంటుందని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.

## ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అనుమతిస్తూ... పార్లమెంట్‌లో ఒక కొత్త చట్టం తీసుకురావాలి

కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లో షెడ్యూల్డ్ కులాల(ఎస్‌సిల)కు 15శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్‌టిల)కు 7.5శాతం, ఇతర వెనకబడిన తరగతుల(ఓబిసిల)కు 27శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం పార్లమెంట్‌లో కొత్త చట్టాన్ని తీసుకురావాలని బుధవారం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ రిజర్వేషన్ల అమలు విషయమై తన సిఫారసులతో పార్లమెంట్‌లో ఒక నివేదిక ప్రవేశపెట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇప్పుడు బంతి ప్రభుత్వ కోర్టులో ఉన్నదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిల కోసం ఈ డిమాండ్‌ను ఇకపై ఎంతోకాలం విస్మరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 'దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని విద్యపై ద్వైపాక్షిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం పార్లమెంట్‌కు తన రిపోర్ట్‌ను సమర్పించింది. ఇది ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల కోసం రిజర్వేషన్లను వాదిస్తోంది' అని జైరామ్‌రమేష్ చెప్పారు. ఆనివేదికలోని కీలక అంశాలను ఆయన హైలెటింగ్ చేస్తూ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 2006లో 93వ సవరణ ద్వారా ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల కోసం ప్రభుత్వం విధిగారిజర్వేషన్లు కల్పించాలని నొక్కిచెప్పిందన్నారు. 2014 మేలో ప్రమతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఆర్టికల్ 15(5) చెల్లుబాటును సమర్థిస్తూ ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో కూడా రిజర్వేషన్లు అనుమతించబడతాయని స్పష్టంచేసింది. అయితే ప్రస్తుతం దీనిపై పార్లమెంట్ ఎలాంటి చట్టాన్ని ఆమెదించలేదు. ఆర్టికల్ 15(5) ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి,ఓబిసి విద్యార్థులకు విధిగా రిజర్వేషన్లు ఉండాలని ఆదేశిస్తోంది.'ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి విద్యార్థుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మూడు ప్రైవేట్ సంస్థల అద్భుతమైన కూర్పును కమిటీ పరిశీలించింది. 0.89శాతం ఎస్‌సి విద్యార్థులు, 0.53శాతం ఎస్‌టి విద్యార్థులు, 11.6శాతం ఓబిసి విద్యార్థులు ఉన్నారు' అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఎస్‌సి వర్గాలకు 15శాతం రిజర్వేషన్ అమలు, ఎస్‌టి వర్గాలకు 7.5శాతం ఓబిసిలకు 27శాతం రిజర్వేషన్ అమలు చేసే ఒక చట్టాన్ని ఆమోదించాలని విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా సిఫారసు చేసిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కొన్ని డిమాండ్లలో ఇది కూడా ఒక కీలకమైన డిమాండ్. ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ఒక చట్టాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మరోసారి డిమాండ్ చేస్తోంది. కులగణన తర్వాత ఓబిసి కోటాను పెంచాలని రాహుల్‌గాంధీ కూడా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

## వివాహం ముగిశాక... ఇప్పుడైనా..మీ అహంకారం 'నశించాలి'

ఓ జంట వివాహాన్ని రద్దు చేసిన 'సుప్రీం' కీలకవ్యాఖ్యలు

మైనర్ కూతురును జాగ్రత్తగా చూసుకోవాలని విడిపోయిన జంటకు హితవు



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు బుధవారం ఒక జంట వివాహాన్ని రద్దు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. వారి మైనర్ బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించింది. వివాహం ముగిసిన తర్వాత ఇక ఇప్పుడైనా మీ అహంకారం తప్పకుండా 'నశించాలి' అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ సందర్భంగా తీవ్రంగా స్పందించింది. 'వివాహం రద్దు చేయడం మాకు నచ్చలేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పరస్పర అంగీకారంతో తమ వివాహాన్ని రద్దు చేసుకోవాలని, పార్టీలు ఉమ్మడి పిటిషన్‌ను దాఖలు చేసిన తర్వాత బెంచ్ ఈ ఉత్తర్వును జారీచేసింది. 'ఇప్పుడు ఇక అహం ఉండకూడదు. ఎందుకంటే ఇక వివాహం లేదు. వివాహంలో అహం ఉన్నా ఇక వివాహం అనేది లేనప్పుడు అహం నశించాలి. ఇక ఇప్పుడు మీరు బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి' అని ధర్మాసనం విడిపోయిన ఆ జంటకు హితవు చెప్పింది.ఈ కేసులో బాంబే హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించిన సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో అనేకసార్లు చర్చలు జరిపిన తర్వాత, పరస్పర అంగీకారంతో నిబంధనలు మరియు షరతులతో వివాహ డిక్రీ ద్వారా వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకున్నట్లు ఇరుపక్షాల తరపు న్యాయవాదులు తెలిపారు. వారి బిడ్డ సంరక్షణ, సందర్శన హక్కుల అంశాన్ని ధర్మాసనం గుర్తించింది. వారి బిడ్డ సంరక్షణ తల్లి తోనే ఉంటుందని బెంచ్ స్పష్ట ంచేసింది. ఉమ్మడి దరఖాస్తుకు అనుగుణంగా సందర్శన హక్కులు తండ్రికి ఉంటాయని తెలియజేసింది. ఆ వ్యక్తి తన మైనర్ కూతురుకు ప్రతీ నెలా రూ.50,000 చెల్లిస్తాడని రికార్డులో వచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద దాఖలు చేసిన ఉమ్మడి దరఖాస్తు పరిష్కారానికి సంబంధించిన నిబంధనలు, షరతులు హిందూ వివాహ చట్టం 1955లోని సెక్షన్ 13బితో రాజ్యాంగం ప్రస్తావించింది. ఏదైనా కేసులో లేదా పెండింగ్‌లో ఉన్న కేసులో పూర్తి న్యాయం చేయడానికి అవసరమైన ఉత్తర్వును జారీ చేయడానికి ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు అధికారాన్ని ఇస్తుండగా, హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13బి పరస్పర అంగీకారం ద్వారా విడాకులను పరిష్కరిస్తుంది. 'ఈ కోర్టు ముందు పార్టీలు హాజరవుతున్నాయి. ఈ కోర్టు ప్రశ్నించినప్పుడు పార్టీలు తమ అన్ని వివాదాల పరిష్కారానికి నిజంగా చేరుకున్నాయని, పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని కోరుతూ విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలియజేశారు' అని జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.

## నేషనల్ హైవే కార్యాలయం ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశాలు



**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** నేషనల్ హైవే 163 రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నందుకు గాను, నేషనల్ హైవే అథారిటీ కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని హనుమకొండ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు సిబ్బంది, బాధితుల తరపు న్యాయవాదులు, భూ నిర్వాసితులు బుధవారం హనుమకొండలోని హంటర్ రోడ్డులో ఉన్న నేషనల్ హైవే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం, కార్యాలయ ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇతర సామాగ్రిని జప్తు చేయడానికి కోర్టు సిబ్బంది ప్రయత్నించగా, మేనేజర్ ఇతర ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులు వారిని అడ్డుకున్నట్లు భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, మరియు నరేందర్ యాదవ్ తెలిపారు. కోర్టు విధులకు ఆటంకం కలిగించి, సామాగ్రిని జప్తు చేయకుండా నిరోధించినట్లు వారు చెప్పారు. కోర్టు సిబ్బంది తమ విధులకు ఆటంకం కలిగించవద్దని కోరినప్పటికీ, నేషనల్ హైవే సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించి, "మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ పరుష పదజాలం ఉపయోగించినట్లుగా న్యాయవాదులు పేర్కొన్నారు. సుమారు 13 గ్రామాల ప్రజలు 2013లో నేషనల్ హైవే కోసం తమ భూములను కోల్పోయారు. ఆ సమయంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నామమాత్రపు పరిహారాన్ని చెల్లించి, రోడ్డు నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. దీనిపై పైడిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ వద్ద అప్పీల్ దాఖలు చేశారు. అప్పీల్‌లో భాగంగా, 2015లో అప్పటి జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ స్క్వేర్ మీటర్‌కు రూ.400 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంచిన పరిహారాన్ని నిర్వాసితులకు చెల్లించడంలో నేషనల్ హైవే అథారిటీ జాప్యం చేయడంతో, జిల్లా న్యాయమూర్తి ఆస్తుల జప్తుకు ఆదేశాలు ఇచ్చారు. అయితే, ఈ ఆదేశాలను కూడా నేషనల్ హైవే కార్యాలయ సిబ్బంది అమలు చేయకుండా అడ్డుకున్నారని భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, నరేందర్ యాదవ్ తెలిపారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ పట్ల నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచిందని న్యాయవాదులు అన్నారు.

ప్రజాపక్షం
గురువారం, 21 ఆగస్టు

# 'గో బ్యాక్' వాదం తగదు

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో తాజాగా 'మార్వాడీ గో బ్యాక్' ఉద్యమం తలెత్తడం అవాంఛనీయం. వ్యాపార వైరం దీనికి మూలం. కొద్ది మంది వ్యక్తులు లేదా సమూహాల ఆందోళన రాష్ట్ర శాంతిభద్రతలను, సమభావనను ప్రమాదంలోకి నెడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మార్వాడీ వ్యతిరేక నిరసనలు, బంద్‌లు జరగడం ఆందోళనకరం. దేశంలోని వాణిజ్య రంగంలో దశాబ్దాలుగా మార్వాడీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇది కాదనలేని నిజం. అయితే, వారు చిన్న చిన్న వ్యాపారాల నుంచి పెద్దపెద్ద హోల్‌సేల్ దుకాణాల వరకూ అన్ని రకాల లావాదేవీలు నిర్వహించడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నది నేడు తెరపైకి వచ్చిన ఆరోపణ. నాణ్యత లేని, నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్నారని కొందరి ఆరోపణ. స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలన్న ప్రచారంతో కొనసాగుతున్న ఆందోళనలకు కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం వంతపాడడం విచిత్రం. సమాజాన్ని సముదాయాలు, ప్రాంతాల వారీగా చీల్చాలనుకోవడం అనైతికం. నిజానికి, ఒక భారత పౌరుడికి దేశంలో ఎక్కడైనా నివసించే, ఉద్యోగ, వ్యాపారాలు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఎక్కడైనా, ఎవరైనా కల్తీ లేదా నాణ్యతలేని సరుకులు అమ్ముతున్నా లేక పరుషపదజాలం ఉపయోగిస్తున్నా లేక దాడులు చేస్తున్నా సదరు వ్యక్తి లేదా వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. పోలీస్, న్యాయ వ్యవస్థలను ఆశ్రయించవచ్చు. అంతేగానీ, ఏకంగా ఒక సముదాయాన్ని దోషిగా నిలబెట్టడం, 'గో బ్యాక్' అంటూ ఆందోళనలకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఆమన్‌గల్‌లో చిన్నగా మొదలైన ఘర్షణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొన్ని ప్రాంతాల్లో బంద్‌లకు దారి తీశాయి. కొంత మంది సోషల్‌మీడియా మాధ్యమంగా మార్వాడీలను లక్ష్యంగా చేసుకొని, వారి పట్ల వ్యతిరేకతను పెంచుతున్నారు. ద్వేషాన్ని నింపుతున్నారు. మార్వాడీల వ్యాపారం.. స్థానిక వ్యాపారులపై ఆర్థిక ప్రభావం.. వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, 'గో బ్యాక్ మార్వాడీ' నిరసనలను ఉద్యమంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక రాష్ట్రం వారు మరో రాష్ట్రంలో వృత్తి, వ్యాపారాలు చేపట్టడం సర్వసాధారణం. ఉత్తరాదికి చెందిన ఎన్నో రాష్ట్రాల నుంచి ఎన్నో సముదాయాలకు చెందిన వారికి రాష్ట్రంలో వ్యాపారాలు ఉన్నాయి. వీరందరినీ మార్వాడీలుగా పేర్కోవడం సర్వసామాన్యమైంది. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం నుంచి వచ్చిన వారు మాత్రమే మార్వాడీలు. ఆ రాష్ట్రానికి చెందిన అందరూ కాదు. రాష్ట్రంలో ఉన్న బంజారాలు కూడా ప్రస్తుత రాజస్థాన్ ప్రాంతం నుంచి ఈ విధంగా వచ్చి స్థిరపడిన వారే. వారిని మార్వాడీలు అని ఎందుకు అనడం లేదు? ఏదిఏమైనా మార్వాడీలు అని ఎవరిని అంటారనే విషయం కూడా తెలియకుండానే చాలా మంది 'మార్వాడీ గో బ్యాక్' నినాదాలు చేయడం, బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమేకాదు.. రాజ్యాంగ విరుద్ధం కూడా. స్థానిక, బహుళజాతి వ్యాపార సంస్కృతి మధ్య సహజంగా జరిగే పోటీకి రాజకీయ రంగు పులమడంతో, ఒక చిన్న సంఘటన క్రమంగా సంఘర్షణ రూపాన్ని సంతరించుకుంటున్నది. స్థానిక వ్యాపారులు వ్యాపారంలో పోటీపడాలిగానీ, ఈర్ష్యాద్వేషాలు పెంచుకోకూడదు. అదే సమయంలో, ఎవరినైనా 'గో బ్యాక్' అనడం సమంజసమా అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాలి. సమాజంలో ఎవరినీ లేదా ఏ సమూహాన్ని వెనక్కి వెళ్లమనడం రాజ్యాంగ విరుద్ధం. నైతిక పతనం. అన్ని సముదాయాలకు, మతాలకు, భాషలకు రాజ్యాంగం సమాన హక్కులు ఇచ్చింది. వివక్ష చూపటం, లేదా వెనక్కి వెళ్లిపోవాలనడం నేరం. వాణిజ్యం, వ్యాపార రంగాలలో పోటీతత్వం తప్ప ఇలాంటి వైషమ్యాలు సమాజ పురోగవృద్ధికి మంచిది కాదు.

మన దేశం అన్ని రకాల దురహంకార, వేర్పాటువాద, ప్రాంతీయ, భాషా వ్యతిరేక ఉద్యమాలను చూసింది. మూల్యం చెల్లించుకుంది. అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంది. కులోన్మాద, మతోన్మాద ఆందోళనలూ చూసింది. తులనాత్మక అభివృద్ధి సాధనలో పాలకులు విఫలమైనందున 'స్థానికులకే అన్నీ', 'ధరిత్రి పుత్రులు' వంటి ఉద్యమాలు చెలరేగాయి. ఇప్పటికీ ఈ బుద్ధి తొలుస్తూ ఉంటుంది. రాజకీయ అసంతృప్తి జీవులు ఆజ్యం పోస్తుంటారు. దశాబ్దాల పోరాటాలు, త్యాగాల తర్వాత తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. వేగవంతమైన అభివృద్ధికి శాంతి భద్రతలు, ప్రశాంత వాతావరణం అవసరం. దీనికి భంగం కలిగించడం మన కాళ్లను మనం నరుక్కోవడమే. ఇదేదో చిన్న అలజడి అని ప్రభుత్వం తాత్సారం చేయరాదు. ఈ ఉద్యమ బాధ్యులను పిలిచి, వారికేమైనా న్యాయమైన సాధకబాధకాలుంటే తెలుసుకొని పరిష్కరించాలి. అనవసరంగా ద్వేషాలు రెచ్చగొడుతున్న అల్లరిచిల్లర వ్యక్తులను అణచివేయాలి. రాష్ట్రం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలో నివసిస్తున్న అందరికీ భరోసా ఇవ్వాలి.

# జిఎస్‌టి సంస్కరణ సమస్యలకు పరిష్కారం చూపేనా?

**ఆర్.సూర్యమూర్తి**

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణను 'దీపావళి కానుక'గా అందిస్తామని వాగ్దానం చేయడంతో, దానిని నెరవేర్చడానికి చాలా ఉన్నత స్థాయిలో గడువును, ప్రమాణాన్ని నిర్దేశించారు. ఈ వాగ్దానం కుటుంబాలకు ఉత్సాహాన్ని, చిన్న వ్యాపారాలకు ఉపశమనాన్ని కలిగించడంతో పాటు, ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉందనే భరోసాను కలిగించేలా రూపొందించబడింది. కానీ, స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల వెనుక పండుగ వాతావరణం అంతగా లేని వాస్తవం దాగి ఉంది. జూలై నెల జిఎస్‌టి గణాంకాలు ఈ వాగ్దానం మాటలలోకూడా దాచిపెట్టలేని లోపాలను బైటపెడుతున్నాయి. దిగుమతులు పన్ను వ్యవస్థను నిలబెడుతున్నాయి, దేశీయ వినియోగం వడపోతోంది, తిరిగి చెల్లింపులు భారీగా పెరుగుతున్నాయి, ఇంకా రాష్ట్రాల వారీగా జిఎస్‌టి పనితీరులో ఉన్న అసమానతలు 'సరళీకరణ'చర్యను ఆర్థిక ఇబ్బందుల పంపిణీగా మార్చవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, ఒక కానుకగా చెప్పబడుతున్న అంశం భవిష్యత్తులో ఆర్థిక సమస్యలకు దారి తీయవచ్చు. జిఎస్‌టి కౌన్సిల్ (గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్) వద్ద ఉన్న మోదీ సంస్కరణల ప్రణాళిక మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది: నిర్మాణాత్మక మార్పు, రేట్ల హేతుబద్ధీకరణ, 'సులభ జీవనం'.ఇది వినియోగదారులకు అనుకూలమైన చర్యల జాబితా: అత్యధికంగా వినియోగించే వస్తువులపై రేట్లను తగ్గించడం, ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ సరిదిద్దడం, ఇంకా వ్యాపారాలకు నిబంధనలను సులభతరం చేయడం.

ప్రభుత్వం ఎఫ్ఎంసిజి సాచెట్లు, సిమెంట్ నుంచి ట్రాక్టర్లు, డ్రోన్లు, ఆటోమొబైల్ కేంద్రాలు, ఇవి బ్యాటరీ భాగాలు, చివరకు ఎయిర్ కండీషనర్ల వరకు వివిధ వస్తువులపై రేట్లను తగ్గించే ఆలోచనలో ఉంది. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ పురి ఇంధన వాయువును జిఎస్‌టి పరిధిలోకి తీసుకు రావాలని మళ్లీ నొక్కి చెప్పారు. అయితే, అధికారులు ప్రస్తుతం ఉన్న ఐదు శ్లాబులను కొన్ని మినహాయింపులతో రెండంచెల వ్యవస్థగా మార్చాలని పరిశీలిస్తున్నారు. పైకి చూస్తే, ఇది ఒక ఆర్థిక స్వీట్ బాక్స్ లాగా కనిపిస్తుంది. ప్రతి వర్గానికి ఒక ముక్క ఉంటుంది. కానీ సమస్య ఏమిటంటే, ఈ స్వీట్ బాక్స్ లోపల ఖాళీగా ఉండవచ్చు. 2025 జూలైలో జిఎస్‌టి వసూళ్లు ఏడాదికేడాది 7.5% పెరిగి రూ.1,95,735 కోట్లకు చేరుకున్నాయి. సాధారణంగా చూస్తే, ఇది జిఎస్‌టి విధానానికి ఒక ఊపు అనిపించవచ్చు. కానీ, లోపల ఉన్న వాస్తవాలను పరిశీలిస్తే, పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దిగుమతుల ఆధారిత జిఎస్‌టి ఆదాయం 9.7% పెరగగా, దేశీయ జిఎస్‌టి కేవలం 6.7% మాత్రమే పెరిగింది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే: రిఫండ్లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర దేశీయ జిఎస్‌టి, కోవిడ్ మహమ్మారి తర్వాత మొదటిసారిగా ఏడాదివారీగా క్షీణించింది. అంటే, భారతదేశం ఆత్మనిర్భర్ ఆర్థిక వ్యవస్థ జిఎస్‌టి వసూళ్లు ఆరోగ్యంగా కనిపించడానికి దిగుమతి చేసుకున్న వస్తువులపై ఎక్కువగా ఆధారపడుతోంది. విదేశీ సరుకుల దిగుమతి బిల్లులు చెల్లిస్తుంటే, స్వదేశీ డిమాండ్ తక్కువ స్థాయిలో ఉన్నపుడు 'ఆత్మనిర్భర్ భారత్' నినాదం నిస్సారంగా వినిపిస్తోంది. జులై నెలలో జిఎస్‌టి రిఫండ్లు 66.8% పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే కేవలం దేశీయ రిఫండ్లు మాత్రమే 117.6% పెరిగాయి. ప్రభుత్వం ఇది వ్యాపారాలకు ఆర్థిక లభ్యతను పెంచుతుందని చెబుతుంది. కానీ నిజం ఏమిటంటే, ఇది పన్ను నిర్మాణంలో ఉన్న తీవ్రమైన అసమర్థతలను బయటపెడుతుంది.

దీనికి ప్రధాన కారణం ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్, అంటే, తుది ఉత్పత్తిపై పన్ను కంటే దాని తయారీకి ఉపయోగించే ముడిసరుకులపై పన్ను ఎక్కువగా ఉండటం. లిథియం అయాన్




బ్యాటరీలు దీనికి ఒక ఉదాహరణ: విడి భాగాలపై 28% పన్ను, బ్యాటరీలపై 18% పన్ను. తయారీదారులు రిఫండ్ కోసం ఎదురుచూస్తూ చాలా నెలలు నిధులు నిలిచిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం అకౌంటింగ్ సమస్య మాత్రమే కాదు ఇది పారిశ్రామిక పోటీతత్వ సమస్య. రిఫండ్ల కోసం నిరీక్షిస్తున్న సంస్థలు ఉత్పత్తిలో పెట్టుబడి పెట్టలేవు, కొత్త ఉద్యోగులను నియమించుకోలేవు లేదా వేగంగా నవీకరణలు చేయలేవు. దీని ఫలితంగా: ఉత్పత్తి మందగించడం, ఖర్చులు పెరగడం, ఇంకా అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో పోటీతత్వం క్షీణించడం జరుగుతుంది.

రాష్ట్రాల వారీగా చూస్తే, ఇది ఆర్థిక అసమానత చిత్రపటంలా ఉంది. అధికంగా బలమైన రాష్ట్రాలైన ఢిల్లీ (2%), గుజరాత్ (3%), రాజస్థాన్ (4%), మహారాష్ట్ర (6%), కర్ణాటక (7%), తమిళనాడు (8%)లో వృద్ధి నెమ్మదిగా ఉంది. చిన్న లేదా మధ్య స్థాయి రాష్ట్రాలు వృద్ధి చెందుతున్నాయి: మధ్యప్రదేశ్ (18%), ఆంధ్రప్రదేశ్(14%), పశ్చిమ బెంగాల్ (12%), పంజాబ్, హర్యానా (12%). మరోవైపు, మణిపూర్ 36%, మిజోరం 21% క్షీణించగా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, జమ్మూకశ్మీర్ కూడా నష్టాల్లో ఉన్నాయి. సంస్కరణలకు ఇది ఎందుకు ముఖ్యమైనది? ఎందుకంటే జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ అన్ని రాష్ట్రాలను ఒకే విధంగా ప్రభావితం చేయదు. సంపన్న, పట్టణీకరణ చెందిన రాష్ట్రాలు మధ్య, అధిక రేటు తరగతులలో ఎక్కువ వినియోగం ఉన్నవి అసమానంగా లబ్ధి పొందుతాయి. పేద, తక్కువ వినియోగం ఉన్న రాష్ట్రాలు తమ ఆర్థిక బలాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది అన్యాయం మాత్రమే కాదు, చాలా అవసరమైన రాష్ట్రాల్లో సంక్షేమ కార్యక్రమాలను, మౌలిక సదుపాయాల ప్రణాళికలను దెబ్బతీస్తుంది.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీకి చెందిన ప్రొఫెసర్ సచ్చిదానంద ముఖర్జీ కొత్త వర్కింగ్ పేపర్ ఒక గంభీరమైన వాస్తవాన్ని చూపిస్తుంది. కేంద్రం లేదా రాష్ట్రాలు దేని వద్ద కూడా ప్రతిపాదిత రేట్ల మార్పుల ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి అవసరమైన, రేటు వారీగా జిఎస్‌టి సమాచారం లేదు. ఆర్థిక మంత్రిత్వశాఖ స్వయంగా 2024లో జిఎస్‌టి రిటర్న్స్‌లో ఆ వివరాలు లేనందున శ్లాబ్ వారీగా వసూళ్లను విడగొట్టడం 'ప్రస్తుతం సాధ్యం కాద'ని అంగీకరించింది. అటువంటి సమాచారం లేకుండా, సంస్కరణ కేవలం ఆర్థిక జూదం. ఇది ఒక ప్రమాదకరమైన సమయంలో వస్తుంది. రాష్ట్రాలకు జిఎస్‌టి పరిహారం హామీ 2022లో ముగిసినందున, సంస్కరణలు ఆదాయాలకు హాని చేస్తే ఎటువంటి ప్రత్యామ్నాయం లేదు. ఇది రాజకీయ పోరాటాలకు, ఆర్థిక అస్థిరతకు దారి తీస్తుంది. జిఎస్‌టి రేట్లను ఒకేలా చేయడం కాగితంపై సులభంగా అనిపిస్తుంది. కానీ పరిహార యంత్రాంగాలు లేకుండా, ఇది అసమానతలను పెంచే విధంగా పన్ను భారాన్ని మార్చే ప్రమాదం ఉంది. ముఖర్జీ పరిశోధన ప్రకారం, గోవా వంటి సంపన్న రాష్ట్రాలు, అధిక పన్ను రేటు తరగతి వస్తువులపై చాలా ఎక్కువ ఖర్చు చేస్తాయి. పేద రాష్ట్రాల వినియోగ విధానాలు తక్కువ పన్ను ఉన్న నిత్యావసరాల వైపు మొగ్గు చూపుతాయి. రక్షణలు లేకుండా హేతుబద్ధీకరణ జరిగితే, సంపన్న రాష్ట్రాలు మరింత ఆదాయాన్ని సంపాదించవచ్చు, పేద రాష్ట్రాలు తమ బడ్జెట్లను తగ్గించుకోవాల్సి రావచ్చు. పర్యావరణ లేదా ఆరోగ్యపరంగా నష్టాలు కలిగించే వస్తువులపై '2026 తర్వాత అదనపు జిఎస్‌టి'ని ప్రభుత్వం పరిశీలిస్తోంది, కానీ ఇది ఇప్పటికే సెస్‌లు, సర్‌ఛార్జీలతో నిండిన వ్యవస్థకు మరో అదనపు పొర అవుతుంది. సరళీకరించడానికి ఉద్దేశించిన సంస్కరణలో సంక్లిష్టత మళ్లీ చోటు చేసుకుంటుంది. ప్రధాని ఈ దీపావళి వాగ్దానాన్ని ఒక గొప్ప చర్యగా గుర్తుంచుకోవాలని భావిస్తే, నాలుగు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. దేశీయ డిమాండ్‌ను తిరిగి పెంచడం–మధ్యతరగతి గృహాలు, ఎంఎస్‌ఎంఇలకు వినియోగాన్ని స్థిరంగా పెంచడానికి లక్షిత ఉద్దీపన పన్ను రాయితీలు, క్రెడిట్ హామీలు లేదా ప్రత్యక్ష బదిలీలు అవసరం. ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్లను సరిచేయడం, రిఫండ్ల భారాన్ని తగ్గించడం వల్ల వర్కింగ్ క్యాపిటల్ లభ్యత పెరుగుతుంది, ఉత్పత్తి చక్రాలు వేగవంతమవుతాయి, భారత పరిశ్రమ మరింత పోటీతత్వాన్ని పొందుతుంది.

ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి, మోదీ ప్రభుత్వం తక్కువ పనితీరు చూపుతున్న రాష్ట్రాలకు ద్రవ్య నష్టాలను నివారించడానికి పనితీరు ఆధారిత బదిలీలు లేదా ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెట్టాలి. ఇంకా, గణాంక ఆధారిత విధాన రూపకల్పనకు మద్దతుగా, రేటువారీ జిఎస్‌టి డేటా సేకరణను పటిష్టం చేయాలి. డేటా లేకుండా సంస్కరణ ఒక ద్రవ్య అంధకారం లాంటిది. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫార్సులను పరిశీలించడానికి ఎనిమిది నెలలుగా నిద్రాణంగా ఉన్న జిఎస్‌టి కౌన్సిల్, సమావేశం కానుంది. పండుగ సీజన్ కోసం ఒక సంచలనాత్మక సంస్కరణను ముందుకు తీసుకువెళ్లాలనే ఆశ ఉంటుంది.

కానీ, కౌన్సిల్ పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. ఎనిమిది సంవత్సరాల అల్లకల్లోలాల ద్వారా జిఎస్‌టిని నిలబెట్టిన కేంద్రం–రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన ఏకాభిప్రాయాన్ని కాపాడటం. చాలా వేగంగా ముందుకు వెళ్తే, ఆ ఏకాభిప్రాయం విచ్ఛిన్నం కావచ్చు, ఆదాయ పంపిణీ, పరిహారంపై వివాదాలకు దారి తీయవచ్చు. జిఎస్‌టి హేతుబద్ధీకరణ మోదీ తదుపరి పెద్ద ఆర్థిక ముద్ర కావచ్చు లేదా ఆయన తదుపరి పెద్ద విధానపరమైన తలనొప్పి కావొచ్చు. దీనిని సరిగ్గా చేస్తే, నిబంధనలను సులభతరం చేస్తుంది, వినియోగదారు ధరలను తగ్గిస్తుంది, ఇంకా భారత పరిశ్రమను మరింత పటిష్టం చేస్తుంది. తప్పుగా చేస్తే, ఇది ఆదాయాలను తగ్గించవచ్చు, రాష్ట్ర అసమానతలను పెంచుతుంది, ఇంకా ఆర్థిక వ్యవస్థను నెమ్మది వృద్ధి చక్రంలో బంధించవచ్చు. దాని ప్రస్తుత రూపంలో, జూలై డేటా ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. జిఎస్‌టి సంస్కరణ అనేది 'సులభ జీవనం' గురించి కంటే, భారతదేశం ఆర్థిక సమాఖ్య వ్యవస్థ స్థితిస్థాపకతను పరీక్షించడం గురించి ఎక్కువ ఉంటుంది. దీనిని తప్పుగా చేస్తే రాజకీయ ఇబ్బందులు మాత్రమే కాదు, అది కుంటుపడిన వృద్ధి, పెరిగిన అసమానతలకు, ఇంకా భారతదేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరోక్ష పన్ను ప్రయోగాలలో ఒకటి విఫలమైందని చెప్పుకోబడుతుంది.

(ఐపిఎ సర్వీస్)

# సూటి ప్రశ్నలకు అసంపూర్ణ, అసంబద్ధ సమాధానాలు

## ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తొలగని అనుమానాలు

భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) యొక్క నిష్పాక్షికత మరియు విశ్వసనీయతపై ఇటీవలి వివాదం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై లేవనెత్తిన ఐదు ప్రశ్నలు, దానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇచ్చిన సమాధానాలు, ఈ సమాధానాలపై విపక్షాలు, మీడియా నుంచి వచ్చిన విమర్శలు ఈ సంస్థ యొక్క పారదర్శకతను ప్రశ్నార్థకం చేశాయి.

రాహుల్ గాంధీ ఆగస్టు 8, 2025న ఎక్స్ వేదికగా ఎన్నికల సంఘానికి ఐదు ప్రశ్నలు సంధించారు: 1) డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు దాచిపెడుతున్నారు? 2) సీసీటీవీ ఫుటేజీని ఎందుకు తొలగిస్తున్నారు? 3) నకిలీ ఓటర్ల నమోదును ఎందుకు అడ్డుకో లేకపోతున్నారు? 4) విపక్ష నాయకులను ఎందుకు భయపెడుతున్నారు? 5) ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా మారిందా? ఈ ప్రశ్నలు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతపై బలమైన అనుమానాలను లేవనెత్తాయి. రాహుల్ ఆరోపణలు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ, బీజేపీకి అనుకూలంగా ఇసి వ్యవహరించిందన్న వాదనలపై ఆధారపడ్డాయి. బిహార్, హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో నకిలీ ఓటర్లు, అసాధారణ ఫలితాలను ఆయన ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు స్పందిస్తూ, ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆగస్టు 17, 2025న ఢిల్లీలో పత్రికా సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీ ఆరోపణలను అసంబద్ధంగా తోసిపుచ్చిన ఆయన, ఓటర్ల జాబితాలో అవకతవకలపై అనవసర అనుమానాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయడం వ్యక్తుల ప్రైవసీకి భంగం కలిగిస్తుందని, అందుకే అది సాధ్యం కాదని ఆయన మొండిగా వాదించారు. సీసీ ఫుటేజీ పబ్లిక్ డాక్యుమెంట్ అందులో ఓటర్ల మొఖాలు కనపడతాయి. ఇందులో అసభ్యత, దాపరికం ఏముంది? ఓటర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశాడా? లేదా? అనే నిర్ధారణ మాత్రమే జరుగుతుంది. అది ఇవ్వటానికి అభ్యంతరం ఎందుకో అర్థం కాదు. అంతేకాక, రాహుల్ తన ఆరోపణలకు అఫిడవిట్ సమర్పించాలని, లేకపోతే క్షమాపణ చెప్పాలని జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏడు రోజుల్లో అఫిడవిట్ రాకపోతే ఆరోపణలను నిరాధారంగా పరిగణిస్తామని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ సమాధానాలు విపక్ష నాయకుల నుండి, మీడియాలో తీవ్ర విమర్శలను రేకెత్తించాయి. విపక్ష నాయకులు ఇసి సమావేశాన్ని రాజకీయ ప్రసంగంగా, బీజేపీ అజెండాకు అనుగుణంగా జరిగినట్లుగా అభివర్ణించారు. రాహుల్ ప్రశ్నలకు సరైన సమాధానం సూటిగా ఇవ్వకుండా, ఇసి రక్షణాత్మక డొంకతిరుగుడు వైఖరిని అవలంభించిందని, తన దగ్గర సమాధానాలు లేవు అన్నట్లు, తనకు జవాబు చెప్పాల్సిన అవసరం లేనట్లు జ్ఞానేశ్ కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు విస్మయం కలిగిస్తోందని వారు అన్నారు. రాహుల్ బహిరంగంగా సూటిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సంఘంపై స్పష్టమైన ఆధారాల సహితంగా లోపాలు ఎత్తి చూపించారు. ఆ వీడియోను కోట్లాది మంది ప్రజలు చూశారు. విపక్షాలు ఇప్పటికే ఇసికి 18 వేల అఫిడవిట్లు కూడా ఇచ్చామని చెపుతున్నాయి. వాటిని ఎన్నికల సంఘం కనీసంగా నైనా పరిశీలించలేదు. తిరిగి రాహుల్ గాంధీ అఫిడవిట్ లిఖిత పూర్వ




కంగా ఇవ్వాలి అనడంలో అర్థం లేదు. అఫిడవిట్ ఇస్తేనే ... అప్పుడే ఆ ఆరోపణలపై విచారణ చేపడతాం అనడం ఇసి కమీషనర్ బాధ్యతా రాహిత్యంగా కనపడుతుంది. పైగా ఇసి కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ ఫక్త్ బీజేపీ ప్రతినిధిలా వ్యవహరించటం ఎన్నికల సంఘం ప్రతిష్టకు కళంకమే..అని విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, అసలు విపక్షాలు లేవనెత్తిన ఆరోపణలపై ఇసి దర్యాప్తు చేయకుండా రాహుల్‌పై తప్పుడు ఆరోపణలు చేయటం ఏమిటీ? రాహుల్‌ను, విపక్షాలను అకారణంగా నిందించడం అన్యాయమని విమర్శించారు. ఈ వివాదంలో రాహుల్ గాంధీ ఆరోపణలు సూటిగా ఆధార సహితంగా ఉన్నప్పటికీ, ఇసి స్పందనలోని లోపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. డిజిటల్ ఓటర్ జాబితా, సీసీటీవీ ఫుటేజీ వంటి సాంకేతిక విషయాలపై స్పష్టమైన వివరణ ఇవ్వకుండా, అఫిడవిట్ డిమాండ్ చేయడం ఇసి యొక్క బాధ్యతా రాహిత్యాన్ని సూచిస్తుంది. ఓటర్ జాబితాలో అవకతవకలు, నకిలీ ఓటర్ల సమస్యలను ఇసి తీవ్రంగా పరిగణించకపోవడం ప్రజాస్వామ్య ప్రక్రియపై అనుమానాలను మరింత బలపరిచింది. బీజేపీతో ఇసి సన్నిహిత సంబంధాల ఆరోపణలు, జ్ఞానేశ్ కుమార్ యొక్క రాజకీయ ధోరణి సూచించే ప్రసంగం ఈ అనుమానాలను రెట్టింపు చేశాయి. ఇసి యొక్క విశ్వసనీయత దెబ్బతినడం భారత ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన సంకేతం. ఓటర్ల ఆమోదం, పారదర్శకత లేని ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తుంది. రాహుల్ గాంధీ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చకుండా, సమగ్ర దర్యాప్తు ద్వారా వాటిని పరిశీలించి, స్పష్టమైన నివేదికలను బహిర్గతం చేయడం ఇసి బాధ్యత. అయితే, జ్ఞానేశ్ కుమార్ యొక్క రక్షణాత్మక వైఖరి, విపక్ష నాయకులను బెదిరించే ధోరణి ఇసి స్వతంత్రతపై ప్రశ్నలను లేవనెత్తాయి. మీడియా విమర్శలు ఇసి స్పందనలోని లోపాలను మరింత స్పష్టం చేశాయి. ఇసి యొక్క పత్రికా సమావేశం అసంబద్ధం మరియు రాజకీయ ధోరణి కలిగినదిగా అభివర్ణించబడింది. ఇసి యొక్క స్వతంత్రతను పరిరక్షించడం కోసం, ఆరోపణలను తిరస్కరించడం కంటే, వాటిని సమగ్రంగా దర్యాప్తు చేసి, ఓటర్లలో విశ్వాసం పెంచే చర్యలు తీసుకోవాలి. రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయ ఉద్దేశంతో చేసి ఉండవచ్చు, కానీ అవి లేవనెత్తిన ప్రశ్నలు ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తాయి. ఈ వివాదం భారత ఎన్నికల వ్యవస్థలో సమూల సంస్కరణల అవసరాన్ని ఎత్తి చూపుతుంది. ఓటర్ జాబితాల సమగ్రత, సీసీటీవీ ఫుటేజీ లభ్యత, ఎన్నికల అధికారుల నిష్పాక్షికత వంటి అంశాలపై స్పష్టమైన విధానాలు రూపొందించాలి. ఇసి యొక్క స్వతంత్రతను పరిరక్షించడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టగలం.

చివరిగా... రాహుల్ గాంధీ ఆరోపణలు, జ్ఞానేశ్ కుమార్ సమాధానాలు, మరియు విపక్షాలు, మీడియా నుంచి వచ్చిన విమర్శలు ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయతలో సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ఇసి ఈ సవాళ్లను దర్యాప్తు ద్వారా పరిష్కరించి, పారదర్శకతను పెంచే చర్యలు తీసుకోవాలి. లేకపోతే, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.

**– డాక్టర్.కోలాహలం రామ్‌కిశోర్**
**9849328496**

# మానవత్వం: మనిషిలోని మహోన్నత గుణం

మానవత్వం అంటే కేవలం మనుషులుగా జీవించడం మాత్రమే కాదు, మనిషిగా జీవించేందుకు అవసరమైన ఉన్నతమైన గుణాలను పెంపొందించుకోవడం. ఇది ఒక వ్యక్తిలోని కరుణ, దయ, ప్రేమ, సహనం, సానుభూతి వంటి సద్గుణాల సమ్మేళనం. ఒక సమాజం లేదా దేశం అభివృద్ధి చెందడానికి ఆర్థిక వనరులు ఎంత ముఖ్యమో, మనుషులు మానవత్వంతో జీవించడం అంతే ముఖ్యం. మానవత్వం లేని సమాజం కేవలం స్వార్థంతో నిండి, చిన్నాభిన్నం అవుతుంది. మన భారతీయ సంస్కృతి 'వసుధైక కుటుంబకం' అనే గొప్ప సూత్రాన్ని బోధిస్తుంది, అంటే ఈ ప్రపంచం మొత్తం ఒకే కుటుంబం అని. ఈ సూత్రం మానవత్వం యొక్క సారానికి ఒక చక్కని ఉదాహరణ. మానవత్వం మనిషిని కేవలం ఒక జీవిగా కాకుండా, ఆలోచనలు, భావాలు కలిగిన ఒక మహోన్నత శక్తిగా మారుస్తుంది. ఇది మన సమాజ నిర్మాణానికి పునాదిగా పనిచేస్తుంది. మానవత్వం ఉన్న చోట ప్రజల మధ్య ప్రేమ, నమ్మకం, సహకారం పెరుగుతాయి. ఇది ఒకరికొకరు సహాయం చేసుకునే సంస్కృతిని ప్రోత్సహిస్తుంది, తద్వారా బలమైన సురక్షితమైన సమాజం ఏర్పడుతుంది. మానవత్వం కేవలం సమాజాన్ని మాత్రమే కాదు, ఒక వ్యక్తి అంతర్గత ఎదుగుదలకు కూడా సహాయపడుతుంది. ఇది ఒక వ్యక్తిని స్వార్థం నుండి దూరం చేసి, ఇతరుల పట్ల ప్రేమను పెంచుతుంది. ఇతరులకు సహాయం చేసినప్పుడు కలిగే ఆనందం, ఆత్మసంతృప్తి అంతర్గత శాంతి అమూల్యమైనవి.

ఉదాహరణకు, మన చుట్టూ ఉన్న అనేక సంఘటనలను గమనించండి. ఒక రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే వ్యక్తిలో కనిపించేది మానవత్వమే. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులను కాపాడేవారు, నిరాశ్రయులకు ఆహారం, ఆశ్రయం కల్పించేవారు మానవత్వానికి నిలువుటద్దాలు. ఇటువంటి సంఘటనలు మనుషుల మధ్య నమ్మకాన్ని పెంచి, సమాజాన్ని మరింత దృఢంగా మారుస్తాయి. అంతేకాకుండా, ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి మానవత్వం అత్యంత అవశ్యకం. మానవత్వం అహింస, క్షమ అనే సూత్రాలను బోధిస్తుంది. ఈ గుణాలు యుద్ధాలు, కలహాలు, విద్వేషాలను తగ్గించి, ప్రపంచ దేశాల మధ్య సఖ్యతను పెంపొందించగలవు. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు, గొప్ప నాయకులు, తత్వవేత్తలు మానవత్వ గొప్పతనాన్ని చాటి చెప్పారు. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతం, మదర్‌థెరిస్సా నిస్వార్థ సేవ, నెల్సన్ మండేలా క్షమాగుణం మానవత్వ శక్తికి నిదర్శనాలు.

### మానవత్వ ముఖ్య లక్షణాలు:

మానవత్వం అనే విస్తృతమైన భావనను మనం కొన్ని ప్రధాన లక్షణాల ద్వారా మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చు. కరుణ, సానుభూతి అనేవి మానవత్వానికి మూలస్తంభాలు. కరుణ అంటే ఇతరుల బాధను అర్థం చేసుకొని, వారి స్థానంలో మనల్ని మనం ఊహించుకోవడం. ఒక పేదవాడి ఆకలిని, ఒక రోగి బాధను, లేదా ఒక నిస్సహాయుడి నిరాశను మనసుతో అనుభవించడమే కరుణ. ఈ కరుణ అనే భావనను ఆచరణలో పెట్టడమే సానుభూతి. కరుణ కలిగిన వ్యక్తి సహాయం చేయకుండా ఉండలేడు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. ఒకరికి మాట సాయం చేయడం, ధైర్యం చెప్పడం, లేదా ఒక చిన్న పనిలో తోడుగా ఉండటం కూడా సహాయమే. ఉదాహరణకు, బస్సులో ఒక వృద్ధుడికి సీటు ఇవ్వడం, బరువు మోస్తున్న వ్యక్తికి సహాయం చేయడం, లేదా దారి తప్పిన చిన్నారిని తల్లిదండ్రులకు చేర్చడం వంటి సంఘటనలు చిన్నవిగా అనిపించినా, వాటిలో మానవత్వం యొక్క గొప్పతనం దాగి ఉంటుంది. అలాగే, సహనం, గౌరవం మానవత్వంలో అంతర్భాగం. ప్రపంచం భిన్నత్వంతో కూడుకుని ఉంది. మనకు నచ్చని అభిప్రాయాలను కూడా గౌరవంగా స్వీకరించగలగడం గొప్ప మానవత్వ లక్షణం. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలిగే గుణం ఇది. ఇక, ఎవరైనా మనకు హాని చేసినప్పుడు వారిపై పగ సాధించడం కంటే, వారిని క్షమించడం గొప్ప మానవత్వం. క్షమ అనేది మనసును తేలికపరిచే ఒక శక్తి. ఇది మనకు మానసిక ప్రశాంతతను ఇస్తుంది. చివరగా, సమానత్వం అనేది మానవత్వంలో ఒక ముఖ్యమైన భాగం. మానవత్వం అందరినీ సమానంగా చూడాలని బోధిస్తుంది. కులం, మతం, రంగు, లింగం, ధనవంతుడుపేదవాడు వంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవించాలి. ప్రతి మనిషికి గౌరవంగా జీవించే హక్కు ఉంది.

### జీవితంలో మానవత్వాన్ని పెంపొందించుకోవడం

మానవత్వం అనేది కేవలం పెద్ద పెద్ద త్యాగాలు చేయడం ద్వారానే వ్యక్తమవుతుంది అనుకోవడం తప్పు. మన రోజువారీ జీవితంలో చిన్న చిన్న పనుల ద్వారా కూడా మానవత్వాన్ని ప్రదర్శించవచ్చు. ఉదాహరణకు, నిస్సహాయంగా ఉన్న జంతువులకు సహాయం చేయడం, పొరుగువారికి ఏదైనా చిన్న పనిలో తోడుగా ఉండటం, లేదా కష్టాల్లో ఉన్న స్నేహితుడిని పలకరించి ధైర్యం చెప్పడం వంటివి మనలో మానవత్వాన్ని పెంచుతాయి. రోడ్డుపై కూరగాయలు అమ్ముకునే వృద్ధురాలిని పలకరించి, ఆమెకు సహాయం చేయడం, లేదా వర్షంలో తడుస్తున్న వీధి కుక్కకు ఆశ్రయం కల్పించడం వంటివి చిన్న పనులే అయినా, వాటిలో గొప్ప మానవత్వం దాగి ఉంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు మర్యాదగా, గౌరవంగా ప్రవర్తించడం, ఒక చిన్న చిరునవ్వు కూడా ఇతరుల మనసును సంతోషపెడుతుంది. ఇతరుల తప్పులను విమర్శించడం కంటే, వారిని అంగీకరించడం, ప్రోత్సహించడం మానవత్వమే. మానవత్వం ఒక వ్యక్తిలోని నైతిక బలాన్ని, ఉన్నతమైన గుణాలను సూచిస్తుంది. ఎందుకంటే, మనిషి మనిషిగా జీవించడానికి తోడ్పడేది మనలో ఉండే మానవత్వం మాత్రమే. మానవత్వం అనేది మనం నేర్చుకోవాల్సిన ఒక పాఠం కాదు, మన జీవితంలో భాగం చేసుకోవాల్సిన ఒక అలవాటు.

**– జనక మోహన రావు దుంగ**
**8247045230**

# వయోవృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు చూడలేమా!

**(నేడు జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం...)**

భారతదేశంలో 60 ఏండ్లు లేదా ఆ పైన వయస్సు కలిగిన ప్రజలను సీనియర్ సిటిజెన్స్ లేదా వయోవృద్ధులుగా వర్గీకరిస్తాం. భారత్‌లో పన్నుల విభాగం నిర్వచనం ప్రకారం, 60 నుంచి 79 ఏండ్ల వయస్సు ఉన్న వారిని సీనియర్ సిటిజెన్స్ అని, 80 ఏండ్లు లేదా ఆపైన వయస్సు కలిగిన వీరిని సూపర్ సీనియర్ సిటిజెన్స్ అని పిలుస్తాం. నిన్నటి కాలంలో హీరోలు, పౌర సమాజానికి నాయకత్వం వహించిన వారు, అపార అనుభవాల పుట్టలు, వివేకవంతులు, నేటి యువతకు సరైన మార్గనిర్దేశకులు అయిన సీనియర్ సిటిజెన్స్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అమెరికా పూర్వ అధ్యక్షులు రొనాల్ రీగన్ చొరవతో ప్రతి ఏటా ఆగస్టు 21న జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం (నేషనల్ సీనియర్ సిటిజెన్స్ డే)ను పాటించడం 1988 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంస్థలు, పౌర సమాజం వయో వృద్ధులను తగు రీతిలో గౌరవంగా చూసుకోవడంతో పాటు వారు నిర్వహించిన పాత్రను తగు రీతిలో గుర్తు చేసుకుంటూ, వారి అభిప్రాయాలకు విలువను ఇస్తూ, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ, వారికి కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ, వారి హక్కులను గౌరవిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించడం ఈ దినోత్సవ ప్రత్యేకతగా గమనించాలి. 1988లో అమెరికాలో ప్రారంభమైన జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినం ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస కూడా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తులు చేయడం జరుగుతున్నది. వయో వృద్ధులు నేటి సమాజ పునాది రాళ్లు అని గమనించి వారిని సముచితంగా గౌరవించుకోవడం, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం, వారి సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేయడం కొనసాగుతూనే ఉండాలని ఐరాస సూచిస్తున్నది. జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం 2035 ఇతివృత్తంగా సమ్మిళిత భవిష్యత్తుకు వయోవృద్ధుల గళాలను బలోపేతం చేయడం అనే అంశాన్ని తీసుకొని అవగాహన కలిపించడం జరుగుతున్నది. పథక రచనలు, పౌర సమాజ సమస్యలు, కుటుంబ ఇబ్బందులకు పరిష్కారాలు ఇవ్వడంలో సీనియర్ సిటిజెన్స్ అభిప్రాయాలను ఆచరణలో పెట్టాలని నేటి తరం గుర్తుంచుకోవాలి. వయోవృద్ధులకు ప్రాధాన్యం ఇస్తూనే వారి విజయ గాధలను ప్రచారం చేయడం, వారి సూచనలు పాటించడం జరిగిన నాడు సమాజంలో శాంతి నెలకొంటుందని మరువరాదు. మనల్ని కంటికి రెప్పలా పెంచి మంచి స్థాయిని కల్పించి, తమ సంపాదనను మన ఎదుగుదలకు నీళ్ల వలె ఖర్చు చేసిన వయో వృద్ధులను గుండెలో పెట్టుకొని చూసుకోవడం మన కనీస కర్తవ్యం. వయో వృద్ధులు సజీవ గ్రంథాలయాలు, అపార వివేక నిఘంటువులు. నిన్నటి రోజుల్లో నేటి వయో వృద్ధులు చేసిన అద్వితీయ సేవలను గుర్తు చేసుకుంటూ, మన ఎదుగుదలకు వారి సలహాలను మెట్లు తీసుకుంటూ, వారితో కలిసి కుటుంబం సంతోషంగా సాగిపోవడమే మన ముందున్నా ఏకైక మార్గం అని మరువరాదు. నేటి యువత కూడా రేపటి వయో వృద్ధులని గుర్తుంచుకోవాలి. నేటి తరం యువత ఎగరడానికి వయోవృద్ధుల అనుభవాలను రెక్కలుగా మార్చుకోవాలి. వయోభేదం మరిచి సమ్మిళిత పౌర సమాజ స్థాపనకు కృషి జరగాలి.

**– బిఎంఆర్**
**9949700037**

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుంట ప్రభాకర్ తల్లి కుంట బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతు మృతిచెందగా బుధవారం ఆమె చిత్రపటానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, యూత్ అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, ముద్రబోయిన వెంకన్న, చెవ్వ కాశీనాథం, ఎస్‌కె రఫీక్, రామనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌పి డా. శబరీష్



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** ములుగు జిల్లా కన్నాయిగూడెం, మండలంలోని బుధవారం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజ్ ను మరియు గోదావరి వరద ముంపు గ్రామమైన వెంకట్రావుపల్లి గ్రామంలో ములుగు ఎస్పీ డా. శబరీష్, సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పోలీస్ అధికారులు, పలు శాఖల అధికారులు, ముంపు ప్రాంత ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, కన్నాయిగూడెం, ఎస్సై వెంకటేష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు సరఫరా చేయాలని,ఎరువుల సరఫరాలో పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల దుకాణాన్ని ఎస్పి కిరణ్ ఖరె,కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా రుకాణంలో ఎరువుల నిల్వలు,రైతులకు ఎరువుల అందిస్తున్న విధానం,రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సరిపడా మోతాదులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఎరువుల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేసారు.అధికారులు రైతుల ప్రయోజనాలు అవసరాలను బట్టి అప్రమత్తంగా ఉంటూ తక్షణమే సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాక అధికారులకు సూచించారు.రైతుల అవసరాలను బట్టి ఈ ప్రాంత రైతులకు మాత్రమే ఎరువులను అందించాలని బయటి రైతులకు ఇవ్వకూడదని ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ టీములు ఎరువుల విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని ఎరువుల కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి,వ్యవసాయ శాఖ ఏఓ సుప్రజ్యోతి,'పిఏసిఎస్ సిఈఓ కుమ్మరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాలానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వినియోగం



**ప్రజాపక్షం/ హసన్‌పర్తి :** మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాన్ని వాడుకోవడం ద్వారా ప్రశాంత వాతావరణం ఉంటుందని కాజీపేట ఎసిపి పింగిళి.ప్రశాంత్ రెడ్డి అన్నారు.హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ముచ్చర్ల గ్రామం బుధవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన సి సి కెమెరాలను కాజీపేట ఎసిపి పింగిళి. ప్రశాంత్ రెడ్డి.ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాన్ని వాడుకోవడం ద్వారా గ్రామంలో ప్రశాంత వాతావరణ ఉంటుందని,కుల, మత, రాజకీయ పార్టీల కతీతంగా గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలని, మద్యనిషేధం కోరుతూ గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా అరికట్టడంలో గ్రామ అభివృద్ధి కమిటీ, యువత చేసిన కృషి అభినందనీయమని, మిగతా గ్రామాలు కూడా ముచ్చర్ల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి సిఐ వట్టె.చేరలు, ఎస్సై రవికుమార్, సిద్దయ్య, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ కుమార్, గ్రామస్తులు కూడా మాజీ చైర్మన్ సంఘంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, పెద్ది ఇంద్రసేన రెడ్డి, పాల్గొన్నారు.

## పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు చెల్లించకుంటే వాహనం సీజ్

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వ్యక్తిగత వాహనాలపై పెండింగ్‌లో వున్న ట్రాఫిక్ చలాన్లు వాహనదారులు చెల్లించని పక్షంలో వాహనాన్ని సీజ్ చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ వాహనదారులకు హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజు, రోజుకి పెరిగిపోతున్న వాహనాల సంఖ్యతో పాటు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికమవడంతో పోలీసులు తీసుకుంటున్న చర్యలను అతిక్రమించి వాహనదారులు వాహనాలను నడుపతున్నారు. దీనితో పోలీసులు ట్రాఫిక్ నిబందనలు అతిక్రమించిన వాహనదారులపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పోలీసులు ట్రాఫిక్ జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. వరంగల్ ట్రాఫిక్ పరిధిలో 3,35,450 చలాన్లు, కాజీపేట ట్రాఫిక్ పరిధిలో 3,60,423, హన్మకొండ ట్రాఫిక్ పరిధిలో 2,73,770 చలాన్లు పెండింగ్‌లో వున్నాయి. మిగితా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 2,01,451 చలాన్లు పెండింగ్ వున్నాయని. ఇకపై ఎవరైన పెండింగ్ చలాన్లు చెల్లించకుండా రోడ్లపై వస్తే ప్రస్తుతం నగరంలో అన్ని కూడళ్ళల్లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నేషన్ కెమెరాల అధారంగా వాహనదారుడు ప్రయాణించే మార్గంలోని పోలీస్ ట్యాబ్‌లకు సమచారం వెళ్ళడం ద్వారా పోలీసులు మీ వాహనాలను రొడ్డుపై నిలిపివేసి జరిమానాలు క్లియర్ చేయడం జరుగుతుందని, లేని పక్షంలో వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తరిలించడం జరుగుతుందని, కావున వాహనదారులు తమ వాహనాలపై వున్న ట్రాఫిక్ జరిమానాలను త్వరితగతంగా చెల్లించాలని పోలీస్ కమిషనర్ వాహనదారులకు సూచించారు.

## గవర్నర్ చేతుల మీదుగా పానుగంటి శారదకు డాక్టరేట్

**ప్రజాపక్షం /జనగామ:** జనగామ పట్టణంలోని ధర్మకంచెకు చెందిన పానుగంటి శారద రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో ఛైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ విసి ముల్గురం కుమార్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. జనగామ పట్టణానికి చెందిన శారద మ్యాథమెటిక్స్‌లో పరిశోదన చేయగా గత గ నాలుగు మాసాల క్రితం ఉస్మానియా యూరివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానంలో డాక్టర్ శారద గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శారద ప్రస్తుతం సిద్దార్ధ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్ హెడ్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుండి చదువు పట్ల ఆసక్తి కనబర్చిన శారద డాక్టరేట్ పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ మాథ్యమెటిక్స్ డిఫార్ట్‌మెంట్ హెడ్ హరిసింగ్‌నాయక్, బోడాప్ ఛైర్మన్ కిషన్, సిద్దార్థ ఇన్స్‌ట్యూట్ డైరెక్టర్ గుండె మల్లేష్, యూనివర్సిటీ ఆచార్య ఆరూరి మహేందర్, నిజాం తెలుగు డిపార్ట్‌మెంట్ ఆచార్యులు ధీకొండ తిరుపతి, కీసర ట్రస్ట్ ఛైర్మన్ కీసర వెంకట్‌రెడ్డితో పాటు శారద భర్త సోమారపు ఉపేందర్, కూతుర్లు అభినందనలు తెలిపారు.

# యూరియా సక్రమ పంపిణీకి ప్రణాళికా బద్ధంగా చర్యలు



జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదు

అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కేటాయింపు

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, యూరియా సక్రమ పంపిణీకి ప్రణాళిక బద్ధంగాచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులు, వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాను జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అవసరం మేరకు కేటాయించడం జరిగిందన్నారు. యూరియా సక్రమంగా పంపిణీలో వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో సక్రమ పంపిణీ జరిగేలా చూడాలని, పంపిణీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ముఖ్యంగా వ్యవసాయ అధికారులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ఉన్న యూరియా నిల్వలను నిజాయితీగా అవసరం ఉన్న రైతులకే పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు అనవసరంగా యూరియాను నిల్వ ఉంచుకో వద్దని అవసరం ఉంటేనే యూరియాను తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రాల వద్ద ఎక్కువమంది రైతులు గుమ్మి గుడి ఉండకుండా ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు ప్రతి మండలంలో 3 గ్రామాల రై తులకు యూరియా అందించేలా ముందస్తుగా టోకెన్లు అందజేసి, యూరియా పంపిణీ సమయంలో రైతులకు పంటల ఆరోగ్య దీపిక కార్డులలో పంపిణీ చేసిన యూ రియా వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల వద్ద ఎక్కువమంది రైతులు వస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ ద్వారా ఆ రోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. యూరియాకు బదులు నానో యూరియా యొక్క ప్రాముఖ్యతను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అందుకుగాను వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, జిల్లాలోని 650 డీలర్ల వద్ద నానో యూరియా అందుబాటులో ఉంచుకుంటూ రైతులకు అవగాహన కల్పిస్తూ వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రగతిశీల రైతులకు నానో యూరియా లాభాల గురించి వివరిస్తూ వారి ద్వారా సామాన్య రైతులలో నానో యూరియా వాడకంపై చైతన్యం కల్పించాలన్నారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, అనురాధ, నీరజ, కల్పన, డాక్టర్ సాంబశివరావు, సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో కేంద్ర ప్రభుత్వం మినిష్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ 2025ను చేపట్టేందుకు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి రిజ్వాన్ పాల్గొని రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, గురుకులాల హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్, స్పెషల్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 30లక్షల మొక్కల్ని నాటామని, ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్స్‌ను బాధ్యతగా చేసి జాతీయ స్థాయిలో జిల్లా ప్రతిష్టను ఇనుమడింపచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యా శాఖ అధికారులు భోజన్న, గౌసియాబేగం, గౌతమ్‌రెడ్డి, పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రాయపర్తి:** కల్లుగీత కార్మికుల భద్రతకే రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య భద్రత కిట్లను అందచేయడం జరుగుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రాయపర్తిలోని రైతు వేదిక ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కల్లుగీత కార్మికులకు బుధవారం కాటమయ్య రక్షణ కిట్స్ అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. కల్లుగీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభలలో ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** బుధవారం నుండి మూడు రోజులపాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలకు మహబూబాబాద్ జిల్లా నుండి సిపిఐ కార్యదర్శి బి విజయసారథి ఆధ్వర్యంలో 25 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలలో రాష్ట్రంలో ఉన్నటువంటి సమస్యలపై చర్చించి ఉద్యమాలు చేస్తామన్నారు రానున్న గ్రామపంచాయతీ ఎంపీటీసీ జడ్పిటిసి మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలను సన్నద్ధం చేస్తామన్నారు రానున్న కాలంలో బిజెపి రాష్ట్రానికి విభజన హామీ చట్టంలో ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కాజీపేట కోచ్ పరిశ్రమ వాటి కోసం పోరాడుతామన్నారు ఈ సందర్భంగా రాష్ట్రం నలులు మూల నుండి 1000 మంది ప్రతినిధులు మహాసభలలో పాల్గొన్నారు అని తెలిపారు ఈ మహాసభలలో ప్రతినిధులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి అజయ్ సారథి రెడ్డి నల్లు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టబోయిన శ్రీనివాస్ సిపిఐ నేతలు పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ మామిళ్ల సాంబ లక్ష్మి తండ సందీప్ వీరవెల్లి రవి వెలుగు శ్రావణ్ కర్నం రాజన్న మేక వీరన్న బందు మహేందర్ మారగాని బాలకృష్ణ సారిక శ్రీనివాస్ జంపాల వెంకన్న భైసస్వామి బానోతు లింగ్య నాయక్ మాలోతు రవీందర్ పాల్గొన్నారు..

## రెండేళ్లలో అందుబాటులోకి మామునూరు ఎయిర్‌పోర్ట్

తెలంగాణలో మరో రెండు విమానాశ్రయాలు

మామునూరుతో పాటు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్

2027 జూన్ నాటికే పనులు పూర్తయ్యేలా కసరత్తు



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణలో విమానయాన రంగం కొత్త ఊపు అందుకోబోతోంది. వరంగల్, ఆదిలాబాద్‌లలో నిలిచిపోయిన విమానాశ్రయ ప్రణాళికలు ఇప్పుడు మళ్లీ కదలికలు మొదలుపెట్టాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఈ రెండు నగరాల్లో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను వచ్చే రెండేళ్లలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం అవసరమైన భూసేకరణ దాదాపు పూర్తయింది. 253 ఎకరాల భూమికి రూ.205 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు పట్ల తన కట్టుబాటును స్పష్టంగా చూపించింది. మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి మొదట చిన్న విమానాలకే పరిమితం చేయాలనుకున్నారు. కానీ రాష్ట్ర విజ్ఞప్తి మేరకు ఏఏఐ పెద్ద విమానాలు, కార్గో ఫ్లైట్లకూ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. అంటే ఏ320, బోయింగ్ 737 లాంటి వాణిజ్య విమానాల రాకపోకలకు కూడా ఈ ఎయిర్‌పోర్ట్ సిద్ధమవుతుందన్నమాట.ఈ ఏడాది చివర్లోనే పనులు ప్రారంభించేలా సన్నాహాలు జరుగుతున్నాయి. వరంగల్ అభివృద్ధికి ఇది కీలకమైన అడుగుగా భావిస్తున్నారు. ఇక ఆదిలాబాద్‌లో ఇప్పటికే 362 ఎకరాల వాయుసేన స్థలం ఉంది. దానిని వినియోగించుకుంటూ మిగతా భూసేకరణ కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. ఏఏఐ వచ్చే రెండు సంవత్సరాల్లో ఈ ఎయిర్‌పోర్టును కూడా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణ ప్రభుత్వం 2027 జూన్ నాటికే పనులు పూర్తయ్యేలా కసరత్తు చేస్తుండగా, కేంద్రం డిసెంబర్ వరకు గడువు పెట్టినట్లు సమాచారం. రెండు ప్రాజెక్టులు పూర్తైతే తెలంగాణలో వాయు ప్రయాణం మరింత విస్తరించనుంది. వరంగల్ విమానాశ్రయానికి ప్రత్యేకమైన చారిత్రక ప్రాధాన్యం ఉంది. నిజాం కాలంలోనే ఇక్కడి నుంచి విమానాలు ఎగిరాయి. భారత్ చైనా యుద్ధ సమయంలో కీలకమైన సేవలు అందించాయి.కానీ గత మూడు దశాబ్దాలుగా ఈ ఎయిర్‌పోర్ట్ మూతపడే ఉంది. ఇప్పుడు మళ్లీ పునరుద్ధరించాలనే ప్రయత్నం విజయవంతమైతే, వరంగల్ వాసుల కల నిజమవుతుంది. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌కి ఈ ప్రాజెక్టు కొత్త ఊపును తీసుకురానుంది. ఈ రెండు విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తే, తెలంగాణలో పర్యాటకానికి, వాణిజ్యానికి, పరిశ్రమలకు పెరుగుదల ఖాయం. ప్రత్యేకంగా వరంగల్‌లో ఐటీ, ఎడ్యుకేషన్, హ్యాండ్లూమ్ రంగాల అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది. ఆదిలాబాద్‌లో ఖనిజ, అటవీ సంపద ఆధారిత వ్యాపారాలకు కొత్త అవకాశాలు లభిస్తాయి. మొత్తానికి ఈ రెండు ప్రాజెక్టులు తెలంగాణ రవాణా రంగానికే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా కొత్త రెక్కలు ఇస్తాయని చెప్పొచ్చు.

## ఉపాధ్యాయులు బోధనా పద్ధతిని మార్చుకోవాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ :** ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మార్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరంలోని సుందరయ్య నగర్ జెడ్‌పిఎస్‌ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సుందరయ్య నగర్ జెడ్‌పిఎస్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల ఎఫ్‌ఆర్‌సి హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషల పఠన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులు సక్రమంగా చదవకపోవడంపై సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోధన పద్ధతులను మార్చుకోవాలని, అందుకుగాను ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెను, వంట గదిని పరిశీలించారు. రోజు వారి మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల నుండి భోజనం నాణ్యత పై ఫీడ్బ్యాక్ తీసుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, అందరూ విద్యార్థులు యూనిఫామ్ ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అధికారులచే నిరంతరం ఆకస్మిక తనీఖీలు కొనసాగుతాయని ఏదైనా లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న రెండు గదుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని డీఈఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## మహిళలు కుట్టు శిక్షణలో మెళకువలను నేర్చుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, కుట్టుకు సంబంధించిన మెలకువలను శిక్షణ కాలంలో నేర్చుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఎంతమంది శిక్షణ పొందుతున్నారని, కుట్టు శిక్షణలో ఎలాంటి యంత్రాలను వినియోగిస్తున్నారని కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలను అడిగారు. దీనిపై మహిళలు స్పందిస్తూ కుట్టు శిక్షణ కేంద్రంలో 45 మంది మహిళలు కుట్టుకు సంబంధించిన మెలకువలను నేర్చుకుంటున్నామని, వివిధ రకాల దుస్తుల కుట్టుకు అధునాతన కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ ద్వారా నేర్చుకుంటున్నట్లు బదులిచ్చారు. శిక్షణా కేంద్రంలో మహిళలు కుట్టు మిషన్ల ద్వారా కుడుతున్న విధానాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. టెక్స్టైల్ పార్కులో ఉపాధి అవకాశం వచ్చినా రాకున్నా స్వయం ఉపాధి ద్వారా సొంత కాళ్లపై నిలబడే అవకాశం లభిస్తుందన్నారు. గ్రామాలలో సొంతంగా కుట్టు ను ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. కుట్టు మిషన్ల కొనుగోలుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని డిఆర్డిఓ మేన శ్రీనుకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ ఆత్మకూరులో పురోగతిలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులు, లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణానికి ఇసుక, కంకర, సిమెంటు, ఇటుకలు, స్టీల్, తదితర సామగ్రి ఎక్కడ నుండి, ఎంతెంత రేట్లకు తెచ్చుకుంటున్నారని లబ్ధిదారును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి గురించి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఉరకలేస్తున్న ఉగ్ర గోదావరి

12.220 అడుగులకు చేరిన నీటి మట్టం

కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కథ కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం లోని త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసునట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సిడబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్డీఆర్ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అత్యవసర సేవలకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏదేని అత్యవసర పరిస్థితిలో పోలీస్ కంట్రోల్ రూము 100కు కాల్ చేయాలని తెలిపారు. పరిసరాల్లోకి ప్రజలు వెళ్లకుండా పోలీస్ పటిష్ట నియంత్రణ చేయాలని సూచించారు. ఎగువ ప్రాజెక్టు ల నుండి వరద వస్తున్నందున ఎప్పటికప్పుడు వరద సమాచారం ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, మయాంక్ సింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం

**ప్రజాపక్షం/పాల్వంచ :** డిసిఎంలో తరలిస్తున్న గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకొన్నారు. ఒడిసా నుండి తమిళనాడుకు డిసిఎం వాహనంలో 80 కిలోల గంజాయిని తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు మండల పరిధి జగన్నాధపురం గ్రామ సమీపంలో ఖమ్మం ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుండి వేగంగా వెళుతున్న డిసిఎం వాహనంపై అనుమానం కలిగింది. వెంబడించి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 80కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా డిసిఎంకు ఎస్కార్ట్‌గా ఓ కారులో ఇద్దరు ఉన్నట్లు చెప్పాడు. వెంటనే స్పందించిన అధికారులు కారును పట్టుకొని పరిశీలించారు. కారులో తుపాకులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆయుధాలు, కారుతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

## స్టడీ టూర్‌కు తరలిన కెఎంసి పాలకవర్గం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్ పాలక వర్గం స్టడీ టూర్ నిమిత్తం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరానికి తరలి వెళ్లారు. బుధవారం మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు మొత్తం 75 మంది బృందం ఇండోర్ స్టడీ టూర్‌కు తరలి వెళ్లారు. ఈనెల 23వరకు అక్కడ పర్యటించనున్నారు. ఇండోర్ నగరం స్వచ్ఛభారత్ సర్వేక్షణ్‌లో వరుసగా అగ్రస్థానంలో నిలుస్తుంది. అక్కడ మోడల్‌ను కెఎంసి పాలకవర్గ బృందం పరిశీలించనుంది. అక్కడ అనుసరిస్తున్న విధానాలను ఖమ్మం నగర అభివృద్ధిలో అనుసరించనున్నారు. పారిశుధ్య, వ్యర్థ నిర్వహణ, పట్టణాభివృద్ధి విధానాలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలు వంటి అంశాలను పాలకవర్గం అధ్యయనం చేయనుంది.

## అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరిలోవరద పెరుగుతున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. కడపటి వార్తలు అందే సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మొదటి ప్రమాద హెచ్చరిక మార్కు 43 అడుగులు దాటి ప్రవహిస్తోందని, ఎగువన వర్షాలు పడుతున్నందున మరింత వరద పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో వనిచేయాలని ఆదేశించారు. నదీపరివాహక గ్రామాల్లో నివసిస్తున్నవారికి ముందస్తు సమాచారం అందించడంతో పాటు, అవసరాన్నిబట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలని, గ్రామ స్థాయిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రతీ గ్రామంలో నిమిషానికోసారి పరిశీలించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో నదీతీర ప్రాంతాలకు వెళ్లరాదని, వరదనీటిలో వాహన ప్రయాణాలు చేయరాదని, అధిఆరులు జారీచేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

## భారత్ లేబర్ ప్రజా పార్టీ రద్దుకు ప్రతిపాదన

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎన్నికల్లో పోటీ లేని రాజకీయ పార్టీ అయిన భారత్ లేబర్ ప్రజా పార్టీని రాజకీయ పార్టీల రిజిస్టర్ జాబితా నుండి తొలగించేందుకు ప్రతిపాదిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ లేబర్ ప్రజా పార్టీ గత ఆరు సంవత్సరాలుగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో, ఉపఎన్నికల్లో గానీ తమ అభ్యర్థులను పోటీకి నిలబెట్టలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం ఆ పార్టీ విధివిధానాలు అమలుచేయకపోవడం స్పష్టమైందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 324 ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29ఏ కింద ఎన్నికల కమిషన్ తన అధికారాలను వినియోగించుకుంటూ ఆ పార్టీని రిజిస్ట్రర్ పార్టీల జాబితా నుండి తొలగించేందుకు ప్రతిపాదన చేసినట్లు పేర్కొన్నారు. ప్రాతినిధ్యం ఏమైనా ఉంటే ఆ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఈనెల 25వ తేదిలోగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ సమర్పించాలని సూచించారు. ఈనెల 29వ తేదీన విచారణ నిర్వహించనున్నందున పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఎలాంటి సమాధానం రాకపోతే పార్టీ తరుపున ఏ అభ్యంతరం లేనట్లుగా భావించి ఎన్నికల కమిషన్ రద్దు ఉత్తర్వులు జారీ చేస్తుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

### ప్రతి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
### ధరల పట్టిక ప్రదర్శించాలి
### ఆరోగ్యశ్రీ సిఎం రిలీఫ్ ఫండ్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు
### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి ప్రైవేటు వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యరంగానికి సంబంధించి చట్టాల పట్ల ప్రైవేటు ఆసుపత్రుల వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రి మేనేజ్‌మెంట్ సిస్టం (హెచ్‌ఎంఎస్), వైద్య ఖర్చుల నియంత్రణ, పిసిపిఎన్‌డిటి, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఎన్‌టిపి యాక్ట్, ఐవిఎఫ్, సరోగసి నియమాలు పాటిస్తూ నాణ్యమైన సేవలు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత చట్టాలపై ట్రైనర్ల ద్వారా శిక్షణ అందిస్తున్నామన్నారు. మన వాహనాలకు ఏవిధంగా రిజిస్ట్రేషన్, లైసెన్స్ తీసుకుంటామో అదేవిధంగా ప్రైవేటు ఆసుపత్రులు కూడా తప్పనిసరిగా క్లినికల్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద రిజస్టర్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులు పాటించాల్సిన నిబంధనలు ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ప్రతి ఆసుపత్రిలో వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలు ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. నిరుపేదలకు ఎంపానెల్మెంట్ ఆసుపత్రులలో రూ.10లక్షల చికిత్స అందించాలని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకం పట్ల అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒకే చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) ఆరోగ్యశ్రీ రెండు చోట్ల క్లైయిమ్స్ చేస్తున్నారని ఈ పద్ధతి మారాలన్నారు.

ఐవిఎఫ్ ఫర్టిలిటీ సెంటర్ నిర్వహణలో నిబంధనలు పాటించాలన్నారు. హైదరాబాద్ కేసులో టెస్ట్‌ట్యూబ్ బేబి నుంచి మానవ రవాణా వరకు తప్పులు జరిగాయని అటువంటివి నివారించేందుకే నిబంధనలు పాటించాలన్నారు. ఫర్టిలిటీ సెంటర్, ఐవిఎఫ్ క్లినిక్, జెనిటిక్ కౌన్సిలింగ్, నర్సింగ్ హోమ్, డయాగ్నస్టిక్, స్పీచ్‌థెరపి వంటి అనేక రకాల ఆసుపత్రులు వస్తున్నాయని వీరందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్పీచ్‌థెరపి పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అక్కడ క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నారా వంటి అంశాలను పరిశీలించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యం, అగ్నిప్రమాదాలకు సంబంధించి ఫైర్ క్లియరెన్స్ ఉండాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా ఒకే ఇంట్లో మూడు తరాలకు చెందిన ప్రజలు మరణించారన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఆసుపత్రులు తప్పనిసరిగా పాటించాలని ఇందులో ఎటువంటి సడలింపులు ఉండవన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు, టిబి నియంత్రణలో ప్రైవేటు ఆసుపత్రులు తమ సహకారాన్ని అందిస్తున్నారన్నారు.

ఆరోగ్యకరమైన ఖమ్మం జిల్లాను తయారు చేయడంలో ప్రైవేటు ఆసుపత్రులు తమ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షులు కంభంపాటి నారాయణ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపుపై హైకోర్టు స్టే ఇచ్చిందని దీనిని మున్సిపాలిటీలలో అమలయ్యేలా చూడాలన్నారు. చిన్న ఆసుపత్రులకు ఫైర్ సేఫ్టీ అంశంలో కొంత సడలింపు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్‌హెచ్‌వో డా.బి. కళావతిబాయి, డిసిహెచ్‌ఎస్ డా.రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, వెంకటరమణ, స్టేట్ టివోటిలు డా.కల్పన తోరన్, ఎస్‌ఎంవో డా.మురారి రాజేంద్రప్రసాద్, నారాయణమూర్తి, ప్రభుత్వ, ప్రైవేటు గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యాలు, డెమోసుబ్రహ్మణ్యం, నవీన్‌కుమార్, దుర్గ, అన్వర్, నాగరాజు, వేణు పాల్గొన్నారు.




## పెండింగ్ భూసేకరణ పూర్తిచేయాలి

### సర్వే పూర్తి చేసి భూ సేకరణ నోటిఫికేషన్ జారీ
### భూ సేకరణపై సమీక్షించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నీటిపారుదల ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పెండింగ్ భూసేకరణ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణపై సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంలో వివిధ ప్యాకేజీలలో మొత్తం 3778 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1964ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, మరో 1814 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీ 14, 15లోని పెండింగ్ భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్యాకేజీ 13కు సంబంధించి 167 ఎకరాల భూ సేకరణ నోటిఫికేషన్ జారీచేశామని సంబంధిత రైతులతో చర్చలు జరిపి సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్యాకేజీ 6లో 667 ఎకరాల భూమి, ప్యాకేజీ 2లోని 510 ఎకరాల భూమి ఎంజాయ్‌మెంట్ సర్వే, మార్కింగ్ సమాంతరంగా జరగాలని వీటిని గరిష్ట గడువులోగా పూర్తిచేసి నోటిఫికేషన్ జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేసేందుకు టైంలైన్ పెట్టుకుని పనిచేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం భూ సేకరణ పూర్తిచేయాలని ఎంజాయ్‌మెంట్ సర్వే, పబ్లిక్ నోటిఫికేషన్ జారీ, అవార్డు జారీ, భూముల బదలాయింపుకు నిర్దిష్ట గడువు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ల్యాండ్ అక్విజిషన్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ సాజియా సుల్తానా, ఇరిగేషన్ అధికారులు ఇఇ బి.అర్జున్, డిప్యూటీ ఇఇ కోటేశ్వరరావు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కోసం 28లోగా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆగస్టు 28లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు మూడు, ఐదు, ఎనిమిది తరగతులలో మిగిలిన సీట్లలో ప్రవేశం కొరకు కొయ, గొండు, నాయకపోడు తదితర గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో మిగిలిన సీట్లలో ఖమ్మం జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన, విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశం అందిస్తున్నామన్నారు. మూడవ తరగతిలో నాలుగు, ఐదవ తరగతిలో రెండు, ఎనిమిదవ తరగతిలో రెండు సీట్లు ప్రవేశానికి దరఖాస్తులనుఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 30న ఐటిడిఏ భద్రాచలం ఆఫీస్ నందు పివో అధ్యక్షతన లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఆగస్టు 28 సాయంత్రం ఐదు గంటల లోపు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నందు దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

# ప్రజల ప్రాణాలతో 'సింగరేణి' చెలగాటం

### సింగరేణి డస్ట్ పొల్యూషన్‌తో రోగాలు, వ్యాధుల బారినపడుతున్న గ్రామాల ప్రజలు
### సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు సింగరేణి ఓసి వలన డస్ట్, పొల్యూషన్ విపరీతంగా రావడం వలన ప్రజల ప్రాణాలు ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, ఇన్ఫెక్షన్, ఉదర సంబంధ వ్యాధులు గుండె సంబంధిత వ్యాధులు, ఎలర్జీ లాంటి ఇతర వ్యాధులు వస్తు ఇబ్బందికరంగా మారుతున్నాయని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దీనివలన రాజుపేట, విఠల్రావునగర్ బాపనకుంట, పికె.వన్ సెంటర్, శివలింగాపురం గ్రామాల ప్రజలు నిత్యం సింగరేణి డస్ట్‌తో ఇబ్బంది పడుతున్నారని ఇండ్ల మీద, చెట్ల మీద, నీటిలో డస్ట్ పొల్యూషన్ ఇబ్బందికరంగా మారుతుందని దీనివలన అనేకమంది ఉదర సంబంధిత వ్యాధులు, శ్వాసకోస వ్యాధులు, అనారోగ్యాలు బారిన పడి జబ్బులతో ఇబ్బందులతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని, రోగాల బారినపడి బాధపడుతున్నారని, ఈ విషయాన్ని సింగరేణి మరియు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పొల్యూషన్ వారు బుధవారం నాడు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పొల్యూషన్ అధికారులు దీనిపై దృష్టి సారించాలని, అధికారులు ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ఆరోపించారు.

ప్రజల ప్రాణాలతో ఆరోగ్యాలతో సింగరేణి వారు ఆడుకుంటున్నారని రాజుపేట, విట్టల్‌రావునగర్, శివలింగాపురం గ్రామాల ప్రజలను కూడా ఇతర ప్రాంతాలకు తరలించి వారికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి తరలించాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఈ అంశాలపై తహసీల్దార్, జిల్లా కలెక్టర్, మంత్రి ఎమ్మెల్యేల దృష్టి తీసుకెళ్ళామని దీనిపై పోరాడిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య ఇటీవల యాక్సిడెంట్లో దురదృష్టవశాత్తు మరణించడం జరిగిందని, వారి డిమాండ్ కోరిక మేరకు సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రజల ప్రాణాలను ఆరోగ్యాలను కాపాడి, వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పొల్యూషన్ అధికారులు కూడా దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల బిక్షం. గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, ఎస్కే నాయుడు తదితరులు డిమాండ్ చేశారు.



## గ్రంథాలయ చైర్మన్‌కు సత్కారం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్/తల్లాడ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన పసుపులేటి వీరబాబును మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా నాయకత్వం ఘనంగా సత్కరించింది. బుధవారం ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో మున్నూరుకాపు నాయకులు శెట్టి రంగారావు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబుకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు నాయకులు పసుపులేటి దేవేందర్, మున్నూరుకాపు ట్రస్టు బోర్డు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, చౌడం నర్సింహారావు, సముద్రాల శ్రీనివాసరావు, శ్రీదేవి, దేవిశెట్టి వెంకటేశ్వరరావు, చెరుకూరి పూర్ణచందర్‌రావు, జివివిఎల్ నర్సింహారావు, సిహెచ్.విప్లవ్‌కుమార్, భూపతి శ్రీనివాసరావు, నాంపల్లి శంకరయ్య, వాకాటి రమేష్, ఆకుతోట ఉపేందర్, కోనేటి నారాయణ, జయప్రకాష్, మురళికృష్ణ పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఖమ్మం నగరంలోని ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని 12 ఇంజనీరింగ్ కళాశాలల చైర్మెన్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల చైర్మెన్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు రీయంబర్స్‌మెంట్ టోకెన్ అమౌంట్ సుమారు రూ.24 కోట్లు ఉందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ అనేది కళాశాలలకు సంబంధించి కాదని ఇది కేవలం విద్యార్థులకు సంబంధించిన అంశమన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ రావడంలో జాప్యం జరగడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడి లోనవుతున్నారని దీనిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కోసం వామపక్ష పార్టీల కార్యదర్శులను, ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులను కలవాలని సమావేశంలో నిర్ణయించారు. కళాశాలల యాజమాన్యంతో కలిసి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు వస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ, మదర్ థెరిస్సా కళాశాల చైర్మన్ చలసాని సాంబశివరావు, శ్రీచైతన్య కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ప్రియదర్శిని కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్, నేషనల్ డిగ్రీ కళాశాల బాధ్యులు భరత్, దరిపల్లి కళాశాల బాధ్యులు కిరణ్, బొమ్మ కళాశాల చైర్మన్ రాజేశ్వరరావు, కెఎల్‌ఆర్ కళాశాల బాధ్యులు మణి, సాయిస్ఫూర్తి కళాశాల బాధ్యులు దాసరి ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ కలాం కళాశాల బాధ్యులు చావా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# వాణిజ్యానికి నివాస పన్ను

### రైస్‌మిల్ నిర్వాహకుడి మాయాజాలం
### నాడు పంచాయతీ, నేడు మున్సిపాలిటీ ఆదాయానికి గండి
### 'ప్రజాపక్షం' వరుస కథనాలతో వెలుగులోకి






ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** తీగలాగితే డొంక కదిలిన చందంగా..మారింది ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓ రైస్‌మిల్ భాగోతం..తవ్విన కొద్ది అనేక అడ్డగోలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు నిర్వాసితుల జీవనంపై సదరు రైస్ మిల్ నిర్వాహకుడు చెలగాటం ఆడుతున్నాడని అనుకున్నం.. కానీ ఏకంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన తీరు విస్మయానికి గురిచేస్తుంది. రైస్‌మిల్‌ను వ్యాపారానికి వాడుకుంటూ.. పంచాయతీకి మాత్రం నివాస పన్నునే కట్టాడు. అది కూడా తను నిర్మాణం చేసుకున్న రైస్‌మిల్ వరకే చెల్లించాడు. ఆ రైస్‌మిల్ సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో వుండగా, దాని చుట్టు ప్రహరీ కట్టుకుని గేట్లు పెట్టుకున్నాడు. ఇందులో ఉన్న ఖాళీ స్థలానికి సైతం పన్నును చెల్లించాల్సి ఉండగా ఎగనామం పెట్టాడు. ఇలా చేయడానికి తనకున్న రాజకీయబలాన్ని ఉపయోగించుకున్నట్లు తెలిసింది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. వ్యాపారానికి వాణిజ్య పన్ను, ఇంటికైతే నివాస పన్ను విధిస్తారు. అది కూడా ఆ ప్రాంత భూమి మార్కెట్ వాల్యూనిబట్టి పెరుగుతు ఉంటుంది. సదరు రైస్ మిల్ నిర్వాహకుడు ఇప్పుడు తీసుకుంటున్న నివాస ట్యాక్స్ 11వేల 562గాఉంది. అలాగే ఇందులో ఖాళీ స్థలానికి మాత్రం నాటి నుంచి ఎటువంటి ట్యాక్స్ సైతం కట్టడం లేదు.

ఇది నాటి పంచాయతీలో వాణిజ్య పన్ను ప్రకారమైతే ఖాళీ స్థలాన్ని కలుపుకుని సుమారు 20 నుంచి30వేల వరకు ప్రతి సంవత్సరం వచ్చేది. కానీ రైస్‌మిల్ ఏర్పాటు నుంచి నివాస పన్నునే కడుతుండటంతో ప్రభుత్వ ఆదాయం ఎంత నష్ట పోయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

**మున్సిపాలిటీలోనూ అదే పన్ను..**

ఇటీవల ఖమ్మంరూరల్ మండలం నుంచి 12 పంచాయతీలను కలిపి ఏదులాపురంమున్సిపాలిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని నివాసాలు నాటి ఎసెస్‌మెంట్ ప్రకారమే మున్సిపాలిటీ లాగిన్‌లో నిక్షిప్తమయ్యాయి. కాబట్టి రైస్‌మిల్ కూడా అదే ఎసెస్‌మెంట్‌తో ఉండటంతో ట్యాక్స్ కూడా నివాసానికే వస్తుంది. ఇలా అయితే ఇప్పుడు మున్సిపాలిటీ కూడా వాణిజ్య పన్నును నష్టపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా ఖాళీ స్థలానికి రావాల్సిన పన్ను కోల్పోతుంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు పూర్తి స్థాయిలో మెజర్‌మెంట్స్ తీసుకుని వాణిజ్యపన్నును విధించడం ద్వారా మున్సిపాలిటీకీ ఆదాయం వస్తుంది. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం పన్ను ఎగవేతపై పెనాల్టీని సైతం విధించే అవకాశం ఉంది.

సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు అటు పంచాయతీ, ఇటు మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టినందున్న అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

**వాణిజ్యపన్ను విధిస్తాం**
**కమిషనర్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి**

ఏదులాపురం మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం.. వ్యాపారసముదాయాలకు వాణిజ్యపన్నును విధిస్తాము. ఈ లాగిన్‌కై కలెక్టర్‌కి లెటర్ పెట్టాము, అప్రూవల్ రాగానే సంబంధిత రైస్ మిల్‌కు వాణిజ్యపన్ను విధిస్తాము.

## అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

### ఇళ్లస్థలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేయటం జరుగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిదయానంద్, అదనపు కలెక్టర్ అజయ్‌యాదవ్ పేర్కొన్నారు. తల్లాడ మండలం పినపాక గ్రామంలో భూమిలేని పేద ప్రజలకు ఇళ్లస్థలాలు అందించాలనే ఉద్దేశ్యంతో స్థానిక ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టాదయానంద్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తుందని, ప్రతి పేదవారికి ఉండటానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్, సీనియర్ నాయకులు గుర్రం శ్రీను, యూత్ కాంగ్రెస్ నాయకులు కటికి కిరణ్, తల్లాడ, పినపాక మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అటవీ భూమి కబ్జా !

### మొక్కలు నాటేందుకు యత్నం- అడ్డుకున్న గ్రామస్థులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** రాజకీయ నాయకుడిగా చలామణి అవుతున్న ఓ వ్యక్తి సుమారు ఎనమిది ఎకరాల అటవీ భూమిని ఆక్రమించుకొని పామాయిల్ వేసేందుకు కూలీలను తీసుకొచ్చిన విషయాన్ని తెలుసుకొన్న గ్రామస్థులు అడ్డుకొన్న సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి రెడ్డిగూడెం ( ప్రభాత్‌నగర్ )సమీపంలో గల ఎస్‌టి కాలనీ మధ్యలో స్మశాన వాటిక దగ్గరలో ఉన్న సుమారు 8 ఎకరాల భూమిని గతంలో గ్రామస్థులు దాన్యం కొనుగోలు కేంద్రానికి వినియోగించుకొనేవారు. ఖాళీగా ఉన్న స్థలం పై పాల్వంచకు చెందిన ఓ పార్టీ నాయకుడి కన్నుపడింది. భూమి కబ్జా చేసి పత్తి సాగు చేశారు. దీనిపై గ్రామస్తులు అడ్డుతగలగా మొదటగా నాయకుడు పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం భద్రాచలం కోర్టులో ప్రభాత్ నగర్‌కు చెందిన ఎనమిది మందిపై కేసు వేశాడు. దీనిపై గ్రామస్టులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు గత సంవత్సరం రెవిన్యూ, అటవీ అధికారులు ఉమ్మడి సర్వే చేశారు. అనంతరం అటవీ భూమిగా నిర్ధారించారు. ఈ భూమిని గ్రామ కంఠానికి ఇవ్వాలని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్, తహశీల్దార్‌లకు గ్రామస్థులు ధరఖాస్తు చేశారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోకుండా తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని బుధవారం అట్టి భూమిలో పామాయిల్ మొక్కలు నాటడానికి కూలీలని తీసుకొచ్చాడు. తెలుసుకొన్న గ్రామస్తులు అడ్డుకొన్నారు.

**అది అటవీ భూమే :** ఈ విషయంపై వైల్డ్‌లైఫ్ రేంజర్ కవితా ఆధురిన వివరణ కోరగా అది ఫారెస్ట్ కు సంభంధించిన భూమిఅని స్పష్టం చేశారు. అందులో రెండున్నర ఎకరాల భూమి పై కోర్టులో కేసు నడుస్తుందన్నారు. మిగతా ఆరు ఎకరాలలో మొక్కలు వేయొద్దని చెప్పామని అన్నారు.

## దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/మణుగూరు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు నందు ప్రతి సంవత్సరం ఆగష్టు 20వ తేదీన జరుపుకునే ప్రపంచ దోమల దినోత్సవంను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్ రావు మాట్లాడుతూ దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి, ప్రజలను అప్రమత్తం చేయడం, వాటి నివారణ మార్గాలను అమలు చేయడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం, నీటి నిల్వలు లేకుండా చేయడం, దోమ తెరలను వినియోగించడం, యాంటి లార్వా, దోమల మందు పిచికారీ చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ పావని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## అయ్యర్‌కు దక్కని చోటు..

### అభిషేక్ నాయర్ అసంతృప్తి



వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బిసిసిఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపిఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బిసిసిఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు.
అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు.




## ఐసిసి వన్డే ర్యాంకింగ్స్..

## రో–కో స్థానాలు అదృశ్యం!

ఐసిసి తాజాగా బుధవారం ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల స్థానాలు గల్లంతయ్యాయి! వీరిద్దరూ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే గతవారం (ఆగస్టు 13) ప్రకటించిన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 756 పాయింట్లతో రోహిత్ శర్మ రెండో స్థానం, 736 పాయింట్లతో విరాట్ కోహ్లీ నాలుగోస్థానంలో నిలిచారు. శుభ్‌మన్ గిల్ ఇప్పటికీ మొదటి స్థానంలో (784 పాయింట్లు) కొనసాగుతున్నారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ 739 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఈ ర్యాంకింగ్స్‌లో అసలు స్థానం దక్కలేదు. కారణాలేంటో స్పష్టంగా తెలియకపోయినా.. ఏదైనా సాంకేతిక లోపంతో ఇలా జరిగి ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ చివరగా తమ వన్డే మ్యాచ్‌ను యూఏఈ వేదికగా జరిగిన ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆడారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్ 10లో టీమ్ఇండియా నుంచి శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ మాత్రమే స్థానం దక్కించుకున్నారు.

**ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ (ఆగస్టు 20)**
శుభ్‌మన్ గిల్ – భారత్ – 784 పాయింట్లు
బాబర్ అజామ్ – పాకిస్థాన్ – 739 పాయింట్లు
డారిల్ మిచెల్ – న్యూజిలాండ్ – 720 పాయింట్లు
చరిత్ అసలంక – శ్రీలంక – 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ – ఐర్లాండ్ – 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ – భారత్ – 704 పాయింట్లు
షాయ్ హోప్ – వెస్టిండీస్ – 699 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్ అఫ్గానిస్థాన్ 676 పాయింట్లు
కుశాల్ మెండిస్ – శ్రీలంక – 669 పాయింట్లు
ట్రావిస్ హెడ్ – ఆస్ట్రేలియా – 648 పాయింట్లు

**ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాకింగ్స్.. (ఆగస్టు 13)**
శుభ్‌మన్ గిల్ – భారత్ – 784 పాయింట్లు
రోహిత్ శర్మ – భారత్ – 756 పాయింట్లు
బాబర్ అజామ్ – పాకిస్థాన్ – 751 పాయింట్లు
విరాట్ కోహ్లీ – భారత్ – 736 పాయింట్లు
డారిల్ మిచెల్ – న్యూజిలాండ్ – 720 పాయింట్లు
చరిత్ అసలంక – శ్రీలంక – 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ – ఐర్లాండ్ – 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ – భారత్ – 704 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్ – అఫ్గానిస్థాన్ – 676 పాయింట్లు
కుశాల్ మెండిస్ – శ్రీలంక – 669 పాయింట్లు

## చిక్కుల్లో పాక్ మాజీ కెప్టెన్

### వసిం అక్రమ్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు..



పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసిం అక్రమ్ చిక్కుల్లో పడ్డాడు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు ప్రచారం చేస్తున్న మాజీ బౌలర్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. జూదం, బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న అక్రమ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముహమ్మద్ ఫైజ్ లాహోర్‌లోని నేషన్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశాడు. విదేశీ బెట్టింగ్ యాప్ 'బాజీ'తో అక్రమ్‌కు సంబంధం ఉందని ఫైజ్ ఆరోపించారు. పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ ఈ బెట్టింగ్ యాప్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అయిన పోస్టర్, వీడియో క్లిప్‌లో వసీం అక్రమ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు మద్దతు తెలుస్తోందని.. ఇది యాప్‌పై సాధారణ ప్రజల్లో ఆసక్తిని పెంచిందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ క్రైమ్స్ యాక్ట్ 2016 కింద అక్రమ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫైజ్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశాడు.




### వేల సంవత్సరాల క్రితమే డ్రైనేజీ వ్యవస్థ




ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆధునిక పైప్‌లైన్, ప్లంబింగ్ వ్యవస్థలో ఒక భాగం అనుకుంటే పొరపాటే. నమ్మినా, నమ్మకపోయినా ఇది క్రీస్తుపూర్వం సుమారు 2500 నాటిది. మన దేశంలో, పురాతన కాలానికి చెందిన సింధు లోయ నాగరికత అవశేషాలుగా బాక్ట్రియా మార్జియానా ఆర్కియాలజికల్ కాంప్లెక్స్ (బిఎంఎసి) ప్రాంత పరిశోధకులు తేల్చిచెప్తున్నారు. భారత ఉపఖండంలోని వాయువ్య ప్రాంతంలో గ్రేటర్ బాక్ట్రియా ప్రాంతంలో వెలుగు చూసిన శిథిల నగరంలో అనేక అద్భుతాలు అందిరనీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. అక్కడ ప్రతి ప్రతి ఇంటినీ అనుసంధానించే డ్రేనేజీ వ్యవస్థ ఉండడం నమ్మలేని నిజం. లోథాల్ నగరంలో చాలా సంక్లిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఉండేదని, ఇది నగరంలోని ప్రతి ప్రైవేట్ ఇంటి నుండి వ్యర్థాలను సేకరించి నగరం వెలుపల ఉన్న కేంద్ర సంప్‌కు చేరవేసేదని పరిశోధకులు చెప్తున్నారు. అదే విధంగా వాయువ్యంలోని గోనూర్‌లో నీటిని సరఫరా చేయడానికి ఈ పైపులు ఉన్నాయి. ఆ రోజుల్లోనే, ఇప్పటి కాలానికి పోటీపడే రీతిలో మంచినీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు ఉండేవని అక్కడి తవ్వకాల్లో బయటపడిన శిథిల నిర్మాణాలు నిరూపిస్తున్నాయి.

ఎవరి అవసరాలకు అనుగుణంగా వారు మార్చుకుంటూపోయిన నేపథ్యంలో, చరిత్ర వక్రీకరణ నిరాటంకంగా సాగింది. ఇప్పటికైనా కళ్లు తెరచి, నిజం చూడకపోతే... వాస్తవ చరిత్రను అర్థం చేసుకోకపోతే, మానవజాతి వికాసం మరుగున పడుతుంది. అందుకే..
**'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడికాన్పించని కథలన్నీ కావాలిప్పుడు!**

# చరిత్ర వక్రీకరణ ఇంకెంతకాలం?




దాచేస్తే దాగని సత్యం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. నిజానికి చరిత్ర అంటే నిజం. చరిత్ర అంటే నాటి వాస్తవ పరిస్థితుల ఆవిష్కరణ. వివరణ. కానీ, శతాబ్దాలుగా తప్పుడు సమాచారమే చరిత్రగా చెలామణి అవుతున్నది. సింధు లోయ నాగరికత క్రీస్తు పూర్వం 1500–1750 మధ్యకాలంలో శిథిలమై ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. అక్కడ హరప్పా, మొహంజొదారో వంటి పెద్దపెద్ద నగరాలు ఉండేవి. విశాలమైన రోడ్లు.. ఇటుకలతో కట్టిన బహుళ అంతస్థుల భవనాలు.. అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థలతో నాగరికత విరాజిల్లిందని ఆ ప్రాంతంలో లభించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. దీనిని ద్రవిడ నాగరికతగా పేర్కొంటున్నారు. మధ్య ఆసియా నుంచి వచ్చిన ఆర్యులు భారత్‌పై దండయాత్ర చేశారని, సింధు లోయను ఆక్రమించారని ఇంత వరకూ ప్రచారంలో ఉన్న చరిత్ర చెప్తున్నది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వంటి ఎంతో మంది ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించారు. ఆర్యుల దండయాత్ర అనేది ఒక అభూత కల్పనగా కొట్టిపారేశారు. కొన్ని అంశాలను నిశితంగా విశ్లేషిస్తే, వారి వాదన నిజమేనని స్పష్టమవుతుంది. వైదిక యుగంలో ఆర్యులు కుటీరాలు, గుడిసెల్లో నివాసం ఉన్నట్టు ఒకవైపు చెప్తూనే, మరోవైపు, వారు సింధు లోయలో నగరాలు, పట్టణాలను ఆక్రమించుకున్నారని అంటున్నారు. ఇది ఎలా సాధ్యం? అప్పటికే నాగరికతతో విరాజిల్లుతూ, అద్భుతమైన కట్టడాలతో ఉన్న నగరాలను ఆక్రమించుకున్నప్పుడు, వాటిలో ఉండకుండా, దూరంగా గుడిసెల్లో లేదా కుటీరాల్లో ఆర్యులు ఎందుకు నివాసం ఉంటారు? ఒకవేళ స్థానికులతో ఆర్యులు జరిపిన యుద్ధంలో భవనాలు లేదా సంస్కృతి పూర్తిగా ధ్వంసమయ్యాయనే అనుకుందాం. అప్పుడు, అవే శిథిలాలపై ఆర్యుల నాగరికత లేదా సంస్కృతికి సంబంధించిన అవశేషాలు ఉండాలి. హరప్పా, మొహంజొదారో తవ్వకాల్లో, ఆర్యుల నాగరికతకు సంబంధించిన అవశేషాలు ఏవీ లేవు. అంటే, ఆర్యుల రాక, వారి దండయాత్ర మాట వాస్తవ దూరమనే కదా అర్థం. జీలం, చినాబ్ నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 800 నగరాలు ఉండేవని పురాతన చరిత్రకారులు పేర్కొన్నారు. వేదయుగంలో వైదికులు గ్రామీణ నాగరికతను అనుసరించారనడానికి ఆధారాలు ఉన్నాయి. ఈ రెండూ పరస్పర విరుద్ధం. ఆర్యుల రాక నిజమే అయితే, వారు ఎంతకాలం రాజ్యం చెలాయించారు? ఎప్పుడు, ఎవరి చేతిలో పరాజయం ఎదుర్కొన్నారు? చరిత్రలో వారి స్థానం ఎక్కడ? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి. కానీ, అలాంటివి ఏవీ లేదు. అందుకే, ఆర్యుల రాక ఒక కట్టుకథ అనే వాదన సరైనదే అనిపిస్తుంది. ఈ కోణంలో వాస్తవిక, హేతుబద్ధమైన చరిత్రను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# రీల్

## 'నేనెవరు?' లోగో విడుదల



నటకిరీటి డా.రాజేంద్ర ప్రసాద్, 'నువ్వేకావాలి, ప్రేమించు' వంటి సూపర్ హిట్ ఫిలమ్స్ ఫేమ్ సాయి కిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో యువ ప్రతిబాశాలి చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న వినోదాత్మక చిత్రం 'నేనెవరు?' ఇందులో నటుడు రాజేంద్ర ప్రసాద్ కీలకపాత్ర పోషిస్తున్నారు. జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంతో వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు. దీపిక సోనాక్షి జబర్దస్త్ రాజమౌళి ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రం షూటింగ్ ముగించుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రం టైటిల్ లోగోను తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వి.సముద్ర ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రివ్యూ థియేటర్ లో జరిగిన ఈ వేడుకలో చిత్రబృందం పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: శ్రీనివాస్, పాటలు: ఎస్.ఎస్.వీరు, మ్యూజిక్: చిన్ని కృష్ణ, ఎడిటర్: నందమూరి హరి తారకరామారావు, సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి పని చేస్తున్నారు.

## 'లిటిల్ హార్ట్స్' టీజర్ విడుదల

'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీ పేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నటుడు రాజీవ్ కనకాల మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాలో నటించేప్పుడు మా డైరెక్టర్ సాయి సెటిల్డ్‌గా పర్ ఫార్మ్ చేయండి సార్ అంటూ వెంటపడేవాడు. ఎంత సెటిల్డ్ గా నటించినా, మళ్లీ ఇంకాస్త అనేవాడు. ఈ సినిమా తర్వాత నాకు సెటిల్డ్ స్టార్ అనే బిరుదు వస్తుందేమో చూడాలి. డబ్బింగ్ చెప్పేప్పుడు కూడా సెటిల్డ్‌గా చెప్పండి అనేవారు. ఈ సినిమాలో నాకొక కొత్త తరహా క్యారెక్టర్‌లో నటించే అవకాశం దక్కింది అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ టీనేజ్‌లో ఉండే సరదా లైఫ్ మనందరికీ దాదాపు ఒకేలా ఉంటుంది. టీనేజ్ బ్యాక్ డ్రాప్‌లో మూవీ చాలా బాగుంటుంది కదా అని డిస్కషన్ చేస్తున్న టైమ్‌లో 'లిటిల్ హార్ట్స్' టీజర్ నా దగ్గరకు వచ్చింది. ఈ టీజర్‌లో చూపించినట్లు గల్లీలో కొట్లాటలు, ఇంట్లో పేరెంట్స్‌తో చివాట్లు, అమ్మాయి చుట్టూ చక్కర్లు, ఎంసెట్ ఎగ్జామ్ టెన్షన్స్..ఇవన్నీ కనిపించాయి. టీజర్ నాకు బాగా నచ్చింది. కామెడీ మూవీని థియేటర్స్ లో చూస్తే ఆ వైబ్ అలా అందరికీ రీచ్ అవుతుంది అని చెప్పారు.








## రామ్ చరణ్ కొత్త లుక్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'లో ఇప్పటివరకూ ఎన్నడూ చూడని కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన బ్యానర్ వృద్ధి సినిమాస్ పతాకంపై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో బజ్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ పెద్దిలో నెవర్ బిఫోర్ లుక్‌తో మెస్మరైజ్ చేయడానికి రెడీ అయ్యారు. టాప్ సెలబ్రిటీ స్టైలిస్ట్ ఆలీం హకీం, రామ్ చరణ్ కోసం స్పెషల్ కేర్ తీసుకొని సరికొత్త లుక్‌లో ప్రెజంట్ చేయబోతున్నారు. రామ్ చరణ్ స్టైల్ కొత్త బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేయనున్నారు. రీసెంట్‌గా స్టైలిస్ట్ ఆలీం హకీం, రామ్ చరణ్ తో కలిసి దిగిన ఫోటోలు మీడియాకు విడుదల చేశారు. రామ్ చరణ్ పుట్టిన రోజు వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానున్న పెద్ది, తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులలో ఒకటిగా రామ్ చరణ్ భావిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ కూడా ఇటీవల అతని పుట్టినరోజున విడుదల

## క్రేజీ కింగ్స్ స్టూడియోస్ షూటింగ్ షురూ

రోహిత్ వర్మ కథానాయకుడిగా రియా సుమన్ నాయికగా నటిస్తోన్న నూతన చిత్రం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్.ఎల్.పి. బేనర్‌లో నజీర్ జమాల్ నిర్మిస్తుండగా, గోవిందరెడ్డి చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. హీరో హీరోయిన్లపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి విజయ్ కనకమేడల క్లాప్ కొట్టగా, సీనియర్ దర్శకుడు రామ్ ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. మరో దర్శకుడు మల్లిఖార్జున గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రగతి, వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్రం గురించి నిర్మాత నజీర్ జమాల్ మాట్లాడుతూ.. తెలుగులో నాకిది మొదటి సినిమా. కథ విన్న తర్వాత బాగా నచ్చి సినిమా చేయడానికి ముందుకు వచ్చాను. కథానాయకుడు రోహిత్ వర్మ మాట్లాడుతూ దర్శకుడు అద్భుతమైన కథ చెప్పారు. తెలుగు ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలని నా మనసులో కోరిక వుండేది. ఈ చిత్రంలో అది కుదిరింది. చిత్రం కోసం తెలుగు బాగా నేర్చుకుంటున్నాను. అందరూ మెచ్చే సినిమా అవుతుందని నమ్మకం ఉంది.



## 'కాంతార చాప్టర్-1'లో గుల్షన్ ఫస్ట్ లుక్

బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీ 'కాంతార చాప్టర్ 1' నిర్మాతలు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. రిషబ్ శెట్టి కాంతారకు ప్రతిష్టాత్మక ప్రీక్వెల్‌లో కులశేఖర పాత్రలో నటిస్తున్నాడు గుల్షన్ దేవయ్య. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం వహించి తానే మళ్లీ సెంట్రల్ క్యారెక్టర్‌లో నటిస్తున్న 'కాంతార చాప్టర్ 1'. ఈ సినిమా విజువల్ విజువల్ వండర్‌గా ఉండబోతోంది. సినిమాటోగ్రఫీని అర్వింద్ ఎస్.కాశ్యప్ అందిస్తుండగా, ఫస్ట్ పార్ట్‌లో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన బి.అజనీష్ లోక్నాథ్ మ్యూజిక్ ఇస్తున్నారు. హోంబాలే ఫిలిమ్స్ విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. కులశేఖర పాత్రలో గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ బయటికి రావడంతో సినిమా మీద మరింత హైప్ పెరిగింది. ఈ మోస్ట్ లవ్డ్ యూనివర్స్‌లో అతని రోల్ ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో అన్న ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్‌లో అక్టోబర్ 2న విడుదల కానుంది.





## 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి 'గుంజి గుంజి' పాట విడుదల


ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ నూతన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. ఈ చిత్రానికి సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తుండగా.. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్జున్ మహీ ('ఇష్టంగా' ఫేమ్) ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఆడియో ప్రమోషన్స్‌లో భాగంగా గతంలో 'రెడ్డి మామ' అంటూ ఓ మాస్ బీట్ సాంగ్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు రిలీజ్ చేయడం, అది యూట్యూబ్‌లో ట్రెండ్ అవ్వడం అందరికీ తెలిసిందే. ఇక తాజాగా సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ 'గుంజి గుంజి' అంటూ సాగే ఓ యూత్ ఫుల్, మాస్, ఎనర్జిటిక్ సాంగ్‌ను విడుదల చేశారు.

## జూనియర్ ఎన్టీఆర్‌ను విమర్శిస్తే సహించం

### ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ వార్నింగ్



తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్‌ను ఎవరూ దూషించినా సహించబోమని ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రకటించింది. ఎన్టీఆర్ ను నోటికొచ్చినట్టు విమర్శించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రెండు రోజుల సమయం ఇస్తున్నామని, రెండు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఫాన్స్‌గా తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ ముజీబ్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్‌ను, షాలిని మేడంను ఎమ్మెల్యే అలా మాట్లాడటం సబబు కాదని అన్నారు. త్వరలోనే చలో అనంతపూర్‌కు పిలుపునిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడిన భాష మేము కూడా మాట్లాడగలం కానీ అలనాటి నీచ సంస్కృతి మా హీరో నేర్పించలేదని అన్నారు. తెలుగుదేశం పార్టీకి చీడపురుగులా తయారైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను వెంటనే తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చెయ్యాలని చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ అభిమాన సంఘం డిమాండ్ చేసింది. ఏది ఫాన్స్ వర్సెస్ ఎమ్మెల్యే వ్యవహారమే తప్ప పార్టీ వర్సెస్ ఫాన్స్ వ్యవహారం కాదని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే క్షమాపణ చెప్పకపోతే అన్ని ప్రాంతాల్లో ఆయన మీద కేసులు పెడతామని, అవసరమైతే ఇల్లు ముట్టడించే కార్యక్రమాన్ని కూడా చేపడతామని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు హెచ్చరించారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ధర్మపురిలో గోదావరి ఉధృతి పరిశీలన



ప్రజాపక్షం / ధర్మపురి : గోదావరినదిలోకి వస్తున్న భారీ వరద దృష్ట్యా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం ధర్మపురి గోదావరి తీరాన్ని అధికారులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. మంత్రి మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు గోదావరి పరిస్థితిని గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తహశీల్దార్ ఎడగొండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సిఐ ఎలపాటి రాంనర్సింహారెడ్డి,ఎస్ఐఉదయ్,రవీందర్ ఉన్నారు.

## 22న పనుల జాతర

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : ఈ నెల 22న పనుల జాతర 2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం తెలిపారు.స్వచ్ఛ భారత్ మిషన్, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా చేపట్టబోయేకొత్తపనులను పెద్దపల్లి జిల్లాలో ప్రారంభించడానికి పనుల జాతర 2025 అనే విశేష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. పనుల జాతర 2025 లో రాష్ట్ర వ్యాప్తంగా 2199 కోట్ల రూపాయల అంచనా తో పనులు ప్రతిపాదించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో పనుల జాతర 2025 కార్యక్రమం కింద 260 పశువుల పాకలు, 26 గొర్రెల షెడ్లు, 65 కోళ్ల ఫారాలు, 13 పాఠశాల మరుగుదొడ్లు, 130 వర్మీ కంపోస్ట్ గుంతలు, 13 చెక్ డ్యాం, 1300 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, 65 అజోల సాగు, 2 సెగ్రిగేషన్ షెడ్, 2 ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, 2 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, 27 అంగన్వాడి భవనాలు, 35 గ్రామపంచాయతీ భవనాలు మొత్తం 1940 పనులను 18 కోట్ల 43 లక్షల 24 వేల రూపాయలతో చేపట్టెందుకు ప్రతిపాదించామని అన్నారు. పనుల జాతర 2025 అభివృద్ధి పనులను మార్చి 2026 లోపు పూర్తి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తామని పేర్కొన్నారు.

## భార్యా పిల్లల బాగోగులు చూడని ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

ప్రజాపక్షం/పెద్దపల్లి : తరచుగా గృహ హింసకు పాల్పడుతూ భార్యా పిల్లల బాగోగులు పట్ల శ్రద్ధ వహించని ప్రభుత్వ ఉద్యోగి ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఫార్మసిస్టుగా పని చేస్తున్న కె .రవీందర్ భార్యా పిల్లలను పట్టించుకోకుండా వారి పోషణను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆయన భార్య కలెక్టరేట్లో ఫిర్యాదు చేసిందని అన్నారు. స్థానిక సఖి కేంద్రం సిబ్బంది భార్యాభర్తల ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించడానికి ప్రయత్నించగా, కె .రవీందర్ సహకరించలేదని, గృహహింస నిరోధక చట్టం ప్రకారం జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ నోటీసులు జారీ చేసినప్పటికీ రవీందర్ కౌన్సిలింగ్ కు హాజరు కాలేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు నివేదిక అందించారని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల పరివర్తన నియమావళి ప్రకారం భార్య పిల్లల పోషణను నిర్లక్ష్యం చేస్తున్న ఫార్మాసిస్టు కె రవీందర్ ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంట ప్రజలకు అనువుగా ఉండేందుకు మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నారని, నాణ్యత ప్రమాణాలు లేకుండా ప్రజలప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో జయశ్రీ వాటర్ ప్లాంవను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందించాలని ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లోని క్యాన్లు 90 రోజులుకు ఒకసారి మార్చాలని, నీటిలో ఎంతా శాతం క్లోరిన్ కలపాలో కూడా తెలియని వర్కర్లను షాపులలో ఉంచుతున్నారని, క్యాన్‌లో పురుగులు ఉంటున్నాయని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 25 వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, వాటిని తనిఖీ చేస్తామన్నారు. షాప్ లైసెన్స్‌ల గడువు ముగిసిన రెన్యువల్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. కొన్ని ప్లాంట్లలో క్లోరిన్‌కు బదులుగా బ్లీచింగ్ కలుపుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎల్లప్పుడూ మిషన్ భగీరత నీటిని, ప్లాంట్‌లలో కొన్న నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహేష్, సదానందం, ఏఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాలలో వేగంగా మరమ్మతులు



ప్రజాపక్షం / హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే సందర్శించారు. కళాశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మైనర్ రిపేర్ వర్క్‌కు చెందిన పనులను పరిశీలించారు. కళాశాల విద్యార్థులకు సమావేశ మందిరం ఇతర పనులు గ్రిల్స్, మెట్లు, ఫ్యాన్లు, కరెంట్‌కు సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ రావు అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, లెక్చరర్లు కే. సుగుణ, ప్రసాద్, జీ. తులసిదాస్, కే.వి. వాసుదేవ రావు, కే. మురళి మోహన్, జై విజేందర్ రెడ్డి, మల్లారెడ్డి, సుహాసిని, లైబ్రేరియన్ రాజేశం, వెంకట రమణ, రాజేందర్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

## ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



ప్రజాపక్షం / ముస్తాబాద్ : బుధవారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా పిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా, ప్రణాళిక బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరచాలని, ప్రజలు కూడా వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్పీ వెంట ఎస్ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.

## ఆర్థిక అంశాల్లో బ్యాంకర్లు మద్దతు

### బ్యాంకర్లకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి దిశా నిర్దేశనం



ప్రజాపక్షం/కరీంనగర్: వివిధ ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యసాధనలో ఆర్థికపరమైన అంశాల్లో బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రిజర్వ్, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించిన రుణ లక్ష్య పురోగతిపై డిసిసి , డిఎల్ఆర్‌సి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకర్లను కోరారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్య సాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు తమ రుణాలను రెన్యువల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు.2025–26ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ 2025 నెల వరకు రూ.4314.88 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాలలో జూన్ 30 వరకు 32.12 శాతం పూర్తయ్యిందని,పెండింగ్‌లోఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లు అందించిన త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ దేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లను సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి కింద మొదటి, రెండవ, మూడవసారి రుణం ధరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ ధరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతంజులై 1 నుంచి జనసురక్ష శిబిరాలుకరీంనగర్ జిల్లాలో ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నారని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 2800 మంది మున్సిపల్ కార్మికులు మల్టీపర్పస్ వర్కర్లను ఈ బీమాలో చేర్పించాలని తెలిపారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న చిరు ఉద్యోగులనుఈ స్కీములలో చేర్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లీడ్ బ్యాంకుమేనేజర్ఆంజనేయులు, ఆర్‌బిఐ అధికారి తాన్య, నాబార్డు డీడీఎం జయప్రకాష్, ఎస్‌బిఐ ఏజీఎం వెంకటేష్, టిజిబి ఆర్ఎం బాలనాగు, అధికారులు తదితరులున్నారు.

## వరద మృతుల కుటుంబాలకు అండ

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: మహారాష్ట్రనుండి తిరిగి వస్తుండగా ఉద్గీర్ జిల్లా కేంద్రం సమీపంలో వరదల్లో గల్లంతు అయి మరణించిన జగిత్యాల జిల్లా టి.ఆర్‌నగర్ 47,48వ వార్డులకు చెందిన వారికుటుంబాలనురాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డితో కలిసి పరామర్శించారు. జగిత్యాల పట్టణంలోని టి.ఆర్ నగర్ 47, 48 వ వార్డులకు చెందిన హసీనా సమీనా ఆఫ్రిన్ మహిళలు మహారాష్ట్ర నుండి తిరిగి వస్తుండగా ఉద్గీర్ జిల్లా కేంద్రం సమీపంలో వరదల్లో గల్లంతు అయి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... దైవ క్షేత్ర దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని మరణించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే సహాయంతో పాటు ముఖ్యమంత్రితో మాట్లాడి ఆర్థిక సహాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నా రు. భవిష్యత్తులో కూడా ఈ కుటుంబాలకు అం డగా ఉంటామని తెలిపారు. బాబుకు మెరుగైన వైద్యం అందిస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. మరణించిన కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు చిరు వ్యాపారాలు చేసుకోవడానికి మైనార్టీ వెల్ఫేర్ నుండి రుణ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. మరో మహిళ ఆచూకీ కోసం అక్కడి అధికారులతో మాట్లాడి తొందరలోనే ఆ మహిళ ఆచూకీ తెలిసుకునే విధంగా చర్యలు చేపడతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరణించిన వారి కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా రవి, తిరుపతి, సిరాజ్, నాగేంద్ర,తదితర నాయకులు ఉన్నారు.

## షీ టీమ్స్‌తో విద్యార్థినులకు మరింత భరోసా

### ఎస్ఐ మిర్యాల రవీందర్



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంతాపూర్, మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భరోసా టీం, షీ టీం, ఏహెచ్‌టియూ టీం, పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి రెండవ ఎస్ఐ మిర్యాల రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థినిలు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ టీమ్ ఎల్లప్పుడు సిద్దంగా ఉన్నాయని, షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా పిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. అదే విధంగా 8712670783 నెంబర్ ద్వారా వాట్సప్ లో కూడా పిర్యాదులు అందజేయవచ్చని వివరించారు. అలాగే విద్యార్థినిలు సామాజిక మాద్యమాల వినియోగంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం వంటి ఫ్లాట్‌ఫాం లలో ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతను కాపాడుకోవాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీం, భరోసా టీం, ఎహెచ్‌టీయూ టీమ్, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

## స్వీట్ షాపుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర జిల్లా కేంద్రంలోని పలు స్వీట్ హౌజ్‌ల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.స్టేట్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలతో బుధవారం జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్‌లోని అనిల్ స్వీట్స్ అండ్ బేకరి, ఆనంద్ స్వీట్స్, ముకరంపురలోని మహారాజా స్వీట్స్ షాపులలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తనిఖీలలో గుర్తించిన అంశాలను వెల్లడించారు. స్వీట్స్ తయారు చేసే ఏరియాతో పాటు భద్రపరిచడంతో లోపాలున్నాయని తెలిపారు. భద్రపరిచిన స్వీట్స్ పైన బల్లుల మలాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. స్వీట్స్ తయారుచేసే కిచన్ లో డ్రైనేజ్ బ్లాక్ అయి దుర్వాసన వస్తుందని,నిల్వ ఉంచిన పాలల్లో ఈగలు, దోమలు పడి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. స్వీట్స్ తయారీలో పరిమితికి మించి ఆర్టిఫీషియల్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు, స్వీట్స్ తయారు చేసే సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఫుడ్ సేఫ్టీ అధికారులు పేర్కొన్నారు. ఆనంద్ స్వీట్స్, మహరాజా స్వీట్స్ షాపులలో లోపాలను గుర్తించి స్వీట్స్ ను పారబోసినట్లు తెలిపారు. ఆనంద్ స్వీట్స్ షాపులో 20 లీటర్ల పాలను, మహారాజా స్వీట్స్ షాపులో 10 కిలోల బాదుషా,3 కిలోల ఖారా పారబోసినట్లు పేర్కొన్నారు. తనిఖీల అనంతరం స్వీట్ షాపులలోని షాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్ కు పంపినట్లు అదికారులు వెల్లడించారు. ఈ తనిఖీలలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఖలీల్ , గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంకిత్ రెడ్డి పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిది ఎమర్జెన్సీ పాలన

### యూరియా సరఫరా చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

### మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : రైతులకు సకాలంలో యూరియా అందించని కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో పర్యటించే నైతిక హక్కు లేదని.. గ్రామాల్లో కాంగ్రెస్ మంత్రులను, నాయకులను తిరుగనివ్వమని.. ఎక్కడికక్కడే అడ్డుకుంటామని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఇప్పటికైన రైతులకు యూరియా వెంటనే అందించాలని లేని పక్షంలో యూరియా కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎమ్మెల్యే హరీష్‌రావు హెచ్చరించారు. 51 సార్లు ఢిల్లీ పర్యటించిన రేవంత్‌రెడ్డికి యూరియ అందించే సమర్థత లేదని.. ముందుచూపు లేదని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎమర్జెన్సి పాలన తెచ్చాడని.. అందాల పోటీల పెట్టిన శ్రద్ధ, యూరియా మీద లేదన్నారు. ఇప్పటివరకు యూరియాపై ఒక్కసారి సైతం సమీక్ష చేయకుండ..ఇంతటి దుస్థితి తెచ్చిందని సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట జిల్లా నంగునూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ రైతులకు అగ్రతాంబులం వేస్తే..రేవంత్ రెడ్డి రైతులను అదోపాతాళంలోకి నెట్టివేశాడని విమర్శించారు. కెసిఆర్ గోదావరి జలాలలతో రైతుల పాదాలు కడిగితే.. రేవంత్‌రెడ్డి యూరియా కోసం రైతులతో పోలీసుల కాళ్లు మొక్కిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు కంటినిండ నిద్రపట్టడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కుంభకర్ణుడి నిద్రలో ఉందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ హయాంలో యూరియా సకాలంలో అందించి చెప్పులు క్యూలైన్లో పెట్టె పరిస్థితికి చెక్ పెట్టిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే మళ్లీ రైతులు యూరియా కోసం రోడ్డెక్కి కుస్తిపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతుల్లో సగం మందికి మాత్రమే రుణ మాఫీ చేశారని. వడ్లు అమ్మి మూడు నెలలు గడిచిన రైతులకు 1300 కోట్ల రుపాయలు బోనస్ డబ్బులు రాలేదన్నారు. రుణమాఫీ పేరిట రైతులను ఎంతకాలంఉసురు పోసుకుంటావని సిఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీష్‌రావు సూటిగా ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిం ది ఏమిలేదని..అన్ని ఎగ్గొట్టడమే అని విమర్శించారు. ఎప్పుడు ఏ ఎన్నికలు పెట్టిన కాంగ్రెస్‌గు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. బడేబాయ్... చోటేబాయ్ కలిపి రైతులకు ఏం న్యాయం చేశారన్నారు. అందాల పోటీల కోసం సమీక్షలు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలపై ఎందుకు సమీక్షలు చేయలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చేతగాని ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుండు భూపేశ్, దువ్వల మల్లయ్యా, వెంకట్ రెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేశ్. లింగం, మల్లేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం కృషి : ఆరెల్లి పోషం



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి లో మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పేర్కొన్నా రు. బుధవారం గోదావరి ఖని భాస్క ర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటియు సి ఆర్జీ వన్ బ్రాంచి మైనింగ్ స్టాప్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పని చేస్తు న్న మైనింగ్ స్టాఫ్‌కు ఏ వన్ గ్రేడ్ నుంచి ఈ వన్ గ్రేడ్ ప్రమోషన్ఇవ్వాలని, కోల్ ఇండియా లాగా సింగరేణి లో అలవెన్సులపై ఆదాయపు పన్ను యాజమాన్యం చెల్లించాలని, నైట్ షిఫ్ట్ అలవెన్సు ఇవ్వాలని, ప్రతి మైన్ నుంచి మైనింగ్ స్టాఫ్ నుండి కూడా బెస్ట్ సూపర్ వైజర్ అవార్డు ఇవ్వాలని, కోల్ ఇండియాలో ఏ వన్ గ్రేడ్ లో ఉన్న ఓవర్ మెన్ లకు సెకండ్ క్లాస్ సర్టిఫికెట్ ఉన్న వారికి ఎలాంటి ఎగ్జామ్ లేకుండా ఈ2 గ్రేడ్ ఇవ్వడం జరిగిందని, సింగరేణిలో కూడా అమలు చేయాలని తదితరఅంశాలపై సమావేశంలో చర్చించామన్నారు. పెర్క మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీవన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి, మైనింగ్ స్టాఫ్‌రఘుమనోజ్, వినయ్ కుమార్, రవి, శ్రీనివాసరావు, రవికుమార్, రాకేష్ పాల్గొన్నారు.

## మానేరు జలాలకు పూజలు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: గంభీరావుపేట మండలంలోని నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ పూర్తిగా నిండడంతో బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి మానేరు జలాలకు పుష్పాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ప్రాజెక్ట్ పూర్తి నీటి మట్టం 2 టీ. ఎం.సీ.లు కాగా, పూర్తిగా నిండింది. ప్రాజెక్ట్ ను కలెక్టర్, ఎస్పీ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ తో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. అప్పర్ మానేరు ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో తదితర వివరాలను నీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ లోకి ఎగువ నుంచి 9500 క్యూసెక్కుల నీరు వస్తుందని, అదే స్థాయిలో కిందికి వదులుతున్నామని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి మట్టాన్నీ ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తూ నీటిని వదలాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్, డీఈ నర్సింగం, డి.వి.హెచ్.ఓ. రవీందర్ రెడ్డి, తహసిల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ పాల్గొన్నారు.

## పాడి పశువులతోనే ఆర్థిక అభ్యున్నతి

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పాడి పశువులను సద్వినియోగం చేసుకొని పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. గంభీరావుపేట మండలం దేశాయిపల్లి గ్రామంలోని ప్రగతిభవన్‌లో 17 మంది ఎస్సీ లబ్ధిదారులకు ఒక్కరికి 2 చొప్పున మొత్తం 34 పాడి పశువులను కలెక్టర్ బుధవారం పంపిణీ చేశారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేసే పశువులకు డెలివరి తర్వాత 12 నుంచి 15 లీటర్ల పాలు ఇస్తాయని, ఎస్సీ లబ్ధిదారులకు నేడు 2 పశువులను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. నేడు 17 మంది లబ్ధిదారులకు ఇక్కరికి 2చొప్పున 34 పశువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. రవీందర్‌రెడ్డి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, పశువైద్యాధికారి అంజిరెడ్డిఉన్నారు.



## ‘హుస్నాబాద్’లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

### కలెక్టర్ హైమావతి

ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్ డివిజన్‌లో మంజూరైన పలు అభివృద్ధి పనులను,పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే ప్రారంభించాలని ,కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు మంజూరైన 4 వరుసల రహదారి పనులను వెంటనే మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై వివిధ మండలాల అధికారులతో అర్డీవో రామూర్తితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయితీ రాజ్ఇంజనీరింగ్ శాఖలో ఏం జి ఎన్ అర్ ఈజీ ఎస్ క్రింది చేపట్టిన జి పి భవనాలను అంగన్‌వాడి కేంద్రాలను,భవనాలను , ప్రాథమిక అరోగ్య కేంద్రాల్లో మరమత్తులను వెంటనే పూర్తి చేయాలని అదేశించారు. మిగిత పనులను కూడ పూర్తి చేయ్యాలని అన్నారు. కొన్ని గ్రామాల్లో స్థలము లేక కట్టలేని భవనాలను తహశీల్దార్, ఎంపిడివో సలహాలుతీసుకుని పూర్తి చెయ్యాలని కోరారు. కొహెడ నుండి సముద్రాల వరకు పూర్తి కావచ్చిన రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని అర్ అండ్ బి అధికారులను అదేశించారు. అంతక్కపేట నుండి కొత్త కొండ వరకు చేపట్టిన రోడ్డు పనులను పూర్తి చేయాలని కొరారు. కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు చేపట్టె 4 వరుసల రోడ్డు పనుల్లో కంటు పోళ్లు, చెట్లతోలగింపు పనులను సంబందిత అధికారుల అనుమతులు తీసుకుని పనులను మొదలు పెట్టాలని తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో పోతారం, పందిల్ల, జిల్లెగడ్డ ,బస్వాపూర్ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న లైటింగ్ పనులను వెంటనే పూర్తి చేయ్యాలన్నారు. గ్రామాల్లో పెండిగ్ ఉన్న మిషన్‌భగీరథ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. హుస్నాబాద్ మున్సిపల్‌లో పెండిగ్‌లో ఉన్న సిసి రోడ్లు, మురుగు నీటి కాల్వల నిర్మాణం , పంద్లివా గు నుండి ఎల్లమ్మ చెరువు వరకు చేపట్టిన బి టి రోడ్డు పనులు, రీడింగ్‌రూం, కమ్యూనిటి హాల్స్ పెండిగ్‌లో ఉన్న అభివృద్దిపనులను వెంటనే పూర్తి చేస్తు బతుకమ్మ ఘూట్‌ను మరియు ఎల్లమ్మ చెరువు సుందరికరణ పనులు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. వర్షకాలం లో చెరువుల పై అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అదేశించారు. అలాగే కొత్తగా నిర్మించే ఆసుపత్రి భవనం పక్కా ప్లాన్ ప్రాకారం నిర్మణం చేపట్టలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఎం పి డి వోలు, మున్సిపల్ కమీషనర్ అధికారులు సమీక్షలు చేసుకుంటు వేగం పెంచాలన్నారు. అలాగే వర్షకాలంలో అటవిశాఖ అధికారులు చెట్ల పెంపకంపై దృష్టిపెట్టాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి పై భవన అన్వేషన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధికారులు పాల్గోన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే..



ప్రజాపక్షం/బైంసా:బైంసా మండలంలోని ఖత్‌గాం గ్రామానికి చెందిన దేగ్లూర్ విఠల్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లక్ష ఎనిమిది వేల రూపాయల చెక్కును అందజేశారు.అదే విధంగా బాసర మండలంలోని సావర్‌గావ్ గ్రామానికి చెందిన దిబ్బికర్ రాజుకు 60 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్,బిజెపి బైంసా మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి,మండల నాయకులు భీమినేని శంకర్,మాజీ సర్పంచ్ రాము తో పాటు పలువురు ఉన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలకు తరలి వెళ్లిన నాయకులు



ప్రజాపక్షం/బెల్లంపల్లి:మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలకు బెల్లంపల్లి నియోకవర్గం నుండి బుధవారం పలువురు తరలివెళ్లారు. మహాసభలకు తరలి వెళ్లిన వారిలో రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, దాగం మల్లేష్, అక్కపెల్లి బాపు, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి తిలక్ అంబేద్కర్, ఎఐకెఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల రా జేశం, కొండు బానేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్‌లు ఉ న్నారు.

## నాటు సారా తయారు చేసిన, అమ్మిన,కొన్న వారిపై కఠిన చర్యలు



ప్రజాపక్షం/ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలో బుధవారం రోజున ఇటిక్యాల గ్రామం,పెంబి తండా ,తాటిగూడ గ్రామాలలో దాడులు నిర్వహించామని ఎక్సైజ్‌ఇన్స్పెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా నిర్మల్ ఎక్సైజ్‌ఇన్స్పెక్టర్ రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం,ఈ దాడులలో 4 కేసులు నమోదు చేసి 4 గురుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.వారి వద్ద నుండి 20 లీటర్ల నాటుసారాయి స్వాదీనం చేసుకొని,200 లీటర్ల నల్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్టు తెలిపారు .వారిలో ఇటిక్యాల తండాలో ముగ్గురు దొరికినట్టు అదేవిధంగా ఇటిక్యాల గ్రామంలో ఒక్కరు దొరికారని తెలిపారు.నాటు సారాయి తయారు చేసిన,అమ్మిన,రవాణా చేసిన,నల్ల బెల్లం,పట్టిక అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ దాడులలో ఆదిలాబాద్ ఎన్ఫోర్స్మెంట ఇన్స్పెక్టర్ అభిషేకర్,సిబ్బంది వెంకటేష్, సాయి,రాజేందర్, రవీందర్, నిరోషా,రవి, అశ్వక్,జమీర్,విజయ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన జిల్లా సిపిఐ కార్యదర్శి కుమారుడు



ప్రజాపక్షం/ సంగారెడ్డి :స ంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ కుమారుడు సయ్యద్ ఆశిం బుధవారం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జహీరాబాద్ బైపాస్ రోడ్డులో బైక్‌పై రోడ్డు దాటుతుండగా అతి వేగంతో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆశిం తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరిగి పోగా తలకు బలమైన గాయాలయ్యాయని ఆసిం తండ్రి సయ్యద్ జలాలుద్దీన్ తెలిపారు. హుటా హుటిన అంబులెన్సులో జహీరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని జలాలుద్దీన్ తెలిపారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబవరావు ,రాష్ట్ర నాయకులు వీర్ల ప్రకాష్ రావు, ఇటి నర్సింహా ,సిద్దిపేట జిల్లా కార్యదర్శి మందపవన్‌లు ఫోన్లో పరామర్శించారు. పరామర్శించిన వారిలో సిపిఐ నాయకులు రెహ్మాన్, ఆనంద్, తాజుద్దీన్, షఫీ , చిరంజీవులు మహబూబ్‌లు ఉన్నారు.

## వసతి గృహాలు శుభ్రంగా ఉండాలి

స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్



ప్రజాపక్షం/ సంగారెడ్డి: షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆద్వర్యంలో 2025–2026 వ సంవత్సరం గాను నూతన విద్యార్థుల ప్రవేశ నిమిత్తం వసతి గృహ సలహా సంఘం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నందు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వసతి గృహాల నిర్వహణ పరశుభ్రత గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి. శంకర్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## డయల్ '100'కు ఫోను చేసి దుర్వినియోగం చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష

ప్రజాపక్షం/ధర్పల్లి :డయల్ 100 కు పలుమార్లు ఫోన చేసి దుర్వినియోగపర్చినందుకు గాను వ్యక్తికి నిజామాబాద్ స్పెషల్ జ్యూడీషియల్ రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బుధవారం రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్పల్లి మండలంలో పఠాన్ సద్దాం అనే వ్యక్తి అనవసరంగా డయల్ 100 కు కాల్ చేస్తూ విధులకు ఆటంకం కలిగించగా ఆ వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే డయల్ 100 ను ఉపయోగించుకోవాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వరద నష్టాల నివారణకు చర్యలు

మంత్రి జూపల్లి



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్:జిల్లాలో భారీ వర్షాల కారణంగా జరిగిన వరద నష్టాల నివారణకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆబ్కారీ , మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసన మండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పి కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవలక్ష్మి , కాగజ్‌నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్, జిసిఓ కోట్నాక తిరుపతిలతో కలిసి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధిలతో వరదల వల్ల జరిగిన నష్టాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదైందున వాగులు, ఒర్రెలు, నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాలు జలమయమయ్యాయని, పంచాయతీ రాజ్, రోడ్లు భవన శాఖల పరిధిలోని రహదారులు, కల్వర్టులు, వంతెనలు, లో లెవెల్ వంతెనల వద్ద అప్రచ్ రోడ్డు కొట్టుకుపోవడం కారణంగా ప్రజానీకానికి ఇబ్బంది జరిగిందని తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో దాదాపు ప్రాథమిక అంచనా ప్రకారం 64503 ఎకరాల పత్తి, వరి, ఇతర పంటలకు నష్టం జరిగిందని, సుమారు 3100 మంది రైతులు పంటలను నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన పంటల నష్టం, రైతుల వివరాలు నమోదు చేసి పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించాలని, సర్వే ప్రక్రియలు ఎలాంటి పొరపాటు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో పశు నష్టం, మేకలు, గొర్రెలు చనిపోవడం జరిగిందని, పశు వైద్యాధికారులు వాటి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని, నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, సామగ్రి గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని రహదారులు కొంత మేరకు ధ్వంసం కావడం, అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిన చోట త్వరగా మరమ్మతులు చేపట్టి రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లు, గోడల వివరాలు అందించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వరద ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సహాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కోసం జిల్లా కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండడం జరిగిందని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని వట్టివాగు, కొమురం భీం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు ఆసిఫాబాద్ మండలం రాజూరా గ్రామానికి వెళ్లే రహదారిలో లెవెల్ వంతెనను మంత్రి పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని కొమురం భీం విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆసిఫాబాద్ మండలం మాలన్ గొంది గ్రామానికి చెందిన సిడాం గంగుకు చెందిన మేకలు వర్షాల కారణంగా మృత్యువాత పడటంతో 1.50 లక్షల రూపాయల పరిహారం ప్రొసీడింగ్‌ను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, పంచాయతీ రాజ్ ఇఇకృష్ణ, రోడ్లు భవనాల శాఖఇఇ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ ,సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## సక్రమంగా రైతులకు ఎరువులు అందించకుంటే చర్యలు

సొసైటీ సిబ్బంది, అధికారులపై జెడిఎ ఛత్రు నాయక్ ఆగ్రహం



ప్రజాపక్షం/చెన్నూరు:నియోజకవర్గంలో ఎరువుల కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతుండగా కోటపల్లి సొసైటి అధికారులు నిరుపేదల రైతులకు మొండిచేయి చూపిస్తూ బడా బాబులకు ఇష్టానుసారంగా ఎరువులు పంపిణీచేయడంపై జిల్లా వ్యవసాయాధికారి ఛత్రు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోటపల్లి సొసైటి ఎరువుల గోదాము వద్ద యూరియా పంపిణీని చెన్నూరు ఎడిఎ ప్రసాద్‌తో కలిసి ఆయన సందర్శించారు. వ్యవసాయాధికారుల కళ్లుకప్పి కొందరు వ్యక్తులకు అధికంగా యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఆయన గుర్తించారు. రైతుల ఎదుటే సొసైటీ సిబ్బంది వారి తీరు మార్చుకోవాలని హెచ్చరించడంతో పాటు అవసరం అయితే సొసైటీ సిఇఒ రాజు నాయక్‌ను విధుల నుండి తొగించాలని ఎడిఎ ప్రసాద్‌ను ఆదేశించారు. కోటపల్లి మండలంలోని పంట పొలాలకు దాదాపు పదమూడున్నర మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 80 శాతం యూరియా సొసైటీ కేంద్రాలకు పంపిణీచేశామని, ప్రతీ ఒక్క రైతు పంటకు సరిపడా యూరియా అందించాలని ఆయన సూచించారు. ఎరువులు పక్క రాష్ట్రానికి తరలి వెళ్తున్నాయనే సమాచారంతో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీకేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎరువులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని ఆయన తెలిపారు. ఎరువుల వినియోగంపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తూ పంపిణీలో అధికారులకు సంహరించడమే కాకుండా బాధ్యతగా తప్పుడు పద్దతిలో ఎరువులు తరలించే వారిని అడ్డుకోవాలని ఆయన కోరారు. ఎరువుల పంపిణీలో నిర్లక్ష్యం వహించి తప్పుడు పద్దతిలో ఎరువులు పంపిణీ చేస్తే సహించబోమని, కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఛత్రు నాయక్ సొసైటీ సిబ్బందితో పాటు కోటపల్లి ఎఇఒరాజ్‌కుమార్‌ను హెచ్చరించారు.

## మూడవ రోజూ నిరవధిక నిరాహార దీక్ష




ప్రజాపక్షం/కాగజ్‌నగర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు చేపడుతున నిరవధిక దీక్ష మూడవ రోజు బుధవారం కూడా కొనసాగింది. జీవో నెం.49 రద్దు చేయాలని, పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో సోమవారం నుండి నివరధిక దీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే . అదే విధంగా మూడవ రోజు మంచిర్యాల భాజపా మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, సీనియర్ నాయకులు దుర్గం అశోక్ ఎమ్మెల్యేకు పూలమాల వేసి మద్దతు తెలిపారు. పలు సంఘాలతో పాటు బీజెపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దీక్షకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బంది పరిక్షించారు. ఈ సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్ష విరమించబోమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే దీక్షకు భాజపా పట్టణఅధ్యక్షులు ఆర్మీ శివ కుమార్, పట్టణ యువకులు, ముత్తంపేట్ గ్రామ ప్రజలు, రైతులు సంఘీభావం తెలిపారు.

## యూరియా, డిఏపి ఎరువులకు కొరత లేదు : కలెక్టర్



ప్రజాపక్షం/నిర్మల్:జిల్లా రైతులకు ఎరువులు,విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.బుధవారం సో న్ మండల కేంద్రంలోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం ఎరువులు,విత్తనాల షాపును జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ,జిల్లాలో ఎరువుల కొరత లేదని,యూరియా,డీఏపీ వంటి ఎరువులు సరిపడా స్టాక్‌లో ఉన్నాయని తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల ప్రకారం ఎరువులను వినియోగించాలని సూచించారు.ప్రతి షాపులో ఎరువుల రేటు చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు.ఎరువుల సరఫరాలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాలని వ్యవసాయ, రెవెన్యూ,పోలీస్ అధికారులను ఆదేశించారు.అలాగే రైతులు ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించేలా,సరైన విధానంలో వ్యవసాయం సాగించేలా అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్,ఎస్పీ లు సోన్ గోదావరి పుష్కర ఘాటును పరిశీలించారు.భారీ వర్షాలతో గోదావరి నది వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.వర్షాల కారణంగా పంట నష్టం జరిగితే వెంటనే సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఏఎస్పీ రాజేష్ మీనా,ఆర్డీఓ రత్న కళ్యాణి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్,తహసీల్దార్ మల్లేష్,అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో 900 మెట్రిక్ టన్నుల యూరియా

ఇంకో 10 రోజుల్లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వెల్లడి



ప్రజాపక్షం/పాపన్నపేట:మెదక్ జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేకుండా అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం పాపన్నపేట మండలం లక్ష్మీ నగర్ గ్రామంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం కలెక్టర్ పరిశీలించారు. విక్రయ దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. ఎరువుల రైతులతో మాట్లాడారు. కేవలం యూరియా నే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను కూడా వాడవలసిందిగా సూచించారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలియజేశారు కొద్ది మంది కావాలని వదంతులు సృష్టించడం ద్వారా రైతులు సెప్టెంబర్లో కొనవలసిన యూరియా కూడా ఇప్పుడే కొనడానికి షాపులు దగ్గర రావడంతో రద్దీ పెరుగుతుందని అలానే వదంతులు నమ్మవద్దని వచ్చే పది రోజుల్లో ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా మన జిల్లాకు రావడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ లో కూడా మన అవసరానికి తగ్గట్టు 4000 మెట్రిక్ టన్నుల యూరియా వ్యవసాయ శాఖ నుండి మన జిల్లాకు తప్పకుండా పంపడం జరుగుతుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవం ...

ఇస్రో చైర్మన్ డా.నారాయణ్ చేతుల మీదుగా పట్టా ప్రదానం..




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినగర్ కాలనీలో నివసించే కొండ గోవర్ధన్,ఇటీవల హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.ఈ పట్టాను ఇస్రో చైరన్ డా.నారాయణ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.ఆదిలాబాద్ జిల్లా,నేరడిగొండ మండలంలోని గుత్పల గ్రామానికి చెందిన గోవర్ధన్,ఉస్మానియా యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో "పొలిటికల్ పార్టిసిపేషన్ అండ్ పొలిటికల్ అవేర్‌నెస్ ఆఫ్ గ్రాస్ రూట్ లెవెల్ లీడర్‌షిప్ ఇన్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్"అనే అంశంపై పరిశోధన చేశారు.ప్రొఫెసర్ నాయుడు అశోక్ పర్యవేక్షణలో ఈ పరిశోధన పూర్తి చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్,ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్,ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం,పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ కృష్ణ కుమార్,ప్రొఫెసర్ శ్రీలత,ప్రొఫెసర్ చల్లమల వెంకటేశ్వర్లు,మాజీ యూజీసీ డీన్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ,ఇంత గొప్ప చదువులు చదువుకునే అవకాశం కల్పించిన తన తల్లిదండ్రులకు,కుటుంబ సభ్యులకు,కళాశాల ప్రిన్సిపాల్‌కు,అధ్యాపకులకు,స్నేహితులు చంద్రశేఖర్,మెరుగు సాయికుమార్,జాడి తిరుపతికి,గుత్పల గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రాజెక్టు అభివృద్ధి పనులు వేగవంతం

నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రజాపక్షం/ సంగారెడి:నారాయణఖేడ్ డివిజన్ సిర్కాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ,నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి బుదవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నీటి నిలువ సామర్థ్యం వస్తున్న ఇన్‌ఫ్లో ,ఔట్ ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కుడి,ఎడమ కింద 4080 ఎడమ కాల్వ ద్వారా 1980 ఎకరాలకు సాగునీరు అందుతుందని అదికారులు కలెక్టర్కు వివరించారు. ప్రాజెక్టు కుడి కాలువ ,ఎడమ కాలువలలో జరుగుతున్న పూడికతీత చెట్ల తొలగింపు పనులకు జెసిబిలను ఉపయోగించి త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. చెరువులు నిండిన పరిస్థితుల్లో ప్రజలు చెరువుల వద్దకు వెళ్లకండా ముఖ్యంగా చెరువు కట్ట దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్ట ర్ అధికారులకు సూచించారు. త్వరలో మండలంలోని అప్రోచ్ రోడ్ల నిర్మాణం ,మరమ్మతులు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎప్‌డిఆర్ నిధులతో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఆర్అండ్ బి శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వెంకట సాయి ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల విక్రయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని యూరియాను పంట సాగుకు మాత్రమే వినియోగించాలన్నా రు.జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని రెవెన్యూ పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన టాస్క్ పోర్స్ టీం ద్వా రా యూరియా అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణ ంలో స్టాక్ రిజిస్టర్‌లుపరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతోమాట్లాడివారిసమస్యలు అడిగి తెలుసుకున్నా రు.

**నల్ల వాగు రెసిడిన్షియల్ పాఠశాల సందర్శన**

సిర్గాపూర్ మండల పరిధిలో భాగంగా కలెక్టర్ పి. ప్రా వీణ్య నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి నల్ల వా గులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేసారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో శానిటేషన్ పరిస్థితి పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.పాఠశాలలో సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపరచాలని పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను క లెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మా ట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం నా ణ్యమైన విద్యను రెసిడెన్షియల్ పాఠశాలలో అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో డైనింగ్ హాలు కిచెన్ షెడ్డు ,స్టోర్ రూమ్ లో ని తరగతి గదులను పరిశీలించారు. శానిటేషన్ సమస్య వల్ల అనేక రకాల సమస్యలు అవకాశం ఉన్నందున శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి పరిస్థితిని మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. అంటు వ్యాధులు విష జ్వరాలు డెంగీ,మలేరియా, చికెన్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ముందుగా సానిటేషన్ సమస్యను మెరుగు పరచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్, ఇరిగేషన్ డివిజన్ ఇఇసుందర్, డిఇ పవన్‌కుమార్, సిర్గాపూర్ తహసీల్దార్ హేమంత్ కుమార్, రెవెన్యూ శాఖ అధికారులు పంచాయతీ రాజ్ అధికారులు ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బలమైన, మిలిటెంట్ తరహా ఉద్యమాలు చేపట్టాలి

## సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకం గా తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు బలమైన, మిలిటెంట్ తరహా ఉద్యమాలను చేపట్టాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఇందుకు వామపక్షాలు, అభ్యుదయ వాదులు ముందుకు రావాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో బుధవా రం జాన్‌వెస్లీ సౌహార్ధ సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలను చేపట్టడం ద్వా రానే కమ్యూనిస్టు పార్టీలు మరింత బలపడుతాయని సూచించారు. ప్రజలలో ఉన్న అసమానతలపైన చైతన్యం కల్పించి, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడం కేవలం కమ్యూనిస్టు పార్టీల వల్లనే సాధ్యమన్నారు. హిట్లర్ లాంటి నియంతనే మట్టి కరిపించిన ఎర్ర జెండాకు ప్రధాని మోదీ ఒక్క లెక్క కాదని, ఇలాంటి మోదీలను ఎర్ర జెండా ఎంతో మందిని చూసిందని జాన్ వెస్లీ చెప్పారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, రాజ్యాధికారాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు ప్రధాని మోదీ మోకరిల్లుతున్నారని, దేశ ప్రజలను అవమానించే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని మండిపడారు. రాష్ట్రంలో బిసిల కు 42 శాతం రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నాయని, కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తున్నాయని జాన్ వెస్లీ దుయ్యబట్టారు. కమ్యూనిస్టు బలమైన ఉద్యమాలకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రూ.12వేలు, పెన్షన్‌పెంచుతామనే హామీని అమలు చేయలేదని, మహిళలకురూ. 2500 ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు.





# పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా..

- కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం ఉండాలి
- ఒకటి రెండు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలతో సంతృప్తి చెందొద్దు
- పార్టీ బలోపేతమైతే మన చేతిలోనే ఆయుధంగా నిలుస్తుంది
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**కె. సంతోష్ కుమార్**
**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి**

గ్రామ పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం ఉండాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీకి ఉన్న ఒకటి రెండు ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి స్థానాలతో పార్టీ నాయకులు, శ్రేణులు సంతృప్తి పడొద్దన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటే తప్ప భావసారూప్యత కలిగిన పార్టీలతో రాజకీయంగా సర్దుబాటు చర్చల ను బలంగా జరపలేమన్నారు. ఒకప్పుడు తెలంగాణ నుంచి అనేక మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు చట్ట సభలలో ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం ఉందని, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు తగిన ప్రాముఖ్యతను ఇచ్చి సమన్వయం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పైనే ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో భాగంగా బుధవారం మధ్యాహ్నం డెలిగేట్స్ సెషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిపిఐకి ఘనమైన చరిత్ర ఉన్నదని, గతంలో సిపిఐకి లోక్‌సభలో ప్రాతినిధ్యం కూడా ఉండేదని, అనేక ప్రజా పోరాటాలు చేశామని, అలాంటి పోరాట చరిత్ర కలిగిన పార్టీకి ప్రస్తుతం ఒకటి రెండు స్థానాలకు పరిమితమయ్యే పరిస్థితులు ఎందుకు కొచ్చాయో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఏమిటో ఒక సారి ఆలోచన చేయాలని సూచించారు. సిపిఐని బలోపేతం చేయనంత వరకు వామపక్ష ఐక్యతను సాధించలేమని తెలిపారు. శ్రేణులకు పార్టీయే ఒక ఆయుధమని, పార్టీ బలోపేతమైతే మన చేతిలోనే ఆయుధంగా నిలుస్తుందని వివరించారు. యువత, మహిళలను పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలోకి ఆకర్షించాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో బిజెపి గతంలో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అని నినదించిందని, అనంత రం చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల అంతం లక్ష్యం గా 'ఆపరేషన్ కగార్'ను చేపట్టిందని, భవిష్యత్ లో కమ్యూనిస్టులే లక్ష్యంగా బిజెపి కార్యాచరణ చేపడుతుందనడంలో ఆశ్చర్యం లేదన్నారు. బలమైన శత్రువులను ఎదుర్కొనేందుకు, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పనిచేయాలని, ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ శక్తులు భారతదేశ క్యారెక్టర్‌ను మార్చేందుకు, ఫాసిస్టు, మతతత్వ దే శంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్ర హం వ్యక్తం చేశారు. సిపిఐ అత్యంత బలంగా ఎదగకపోతే బిజెపిని ఎలా అడ్డుకుంటామని ప్ర శ్నించారు. కేంద్రంలో 400 ఎంపి సీట్లు వస్తే రా జ్యాంగాన్ని మార్చేద్దామని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు భావించాయని, కానీ సొంతంగా అధికారంలోకి కూడా రాలేకపోయిందని వివరించారు. పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభంతో అమెరికా వివిధ దేశాలపై అనేక ఆంక్షలను విధిస్తూ ప్రతి దేశాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పలు అంతర్జాతీయ సంస్థల సూచనలను కూడా అమెరికా అధ్యక్షులు ట్రంప్ పట్టించుకోవడంలేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధవాతావరణం నెలకొందని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చేస్తూ మారణహోమం సృష్టిస్తూ చిన్న పిల్లలను, మహిళలను కూడా చంపుతున్నదన్నారు. గతంలో భారతదేశం పాలస్తీనా ప్రజలకు మద్దతునిస్తుందని, మహాత్మా గాంధీ బహిరంగంగానే పాలస్తీని అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పాలస్తీనాకు గత కేంద్ర ప్రభుత్వం మద్దుతుగా నిలిచేదని, కానీ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత, మోదీ ఇజ్రాయిల్‌కు మద్దతునివ్వడం గర్హనీయమన్నారు.

# విభజన తర్వాత ఎపిలో భిన్నమైన రాజకీయ వాతావరణం

## సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



తెలంగాణ, ఎపి విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొన్నదని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విభజనత తరవాత ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీలు గడ్డుకాలాన్ని అధిగమిస్తున్నాయని, ఈ పరిస్థితుల నుంచి ముందుకు వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజులరామారం)లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలలో బుధవారం రామకృష్ణ సౌహార్ధ సందేశ మిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్‌డిఎ, ఇండియా కూటమి రెండు ఉండగా, మిగతా రాష్ట్రాలలో ఎన్‌డిఎకు అనుకూలంగా, కొంత వ్యతిరేక ఓటు వేసే అవకాశాలు ఉంటాయని, ఎపిలో మాత్రం ఇందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులకు మద్దతు తెలిపే విషయంలో ఎపిలో మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్‌డిఎ కూటమికే మద్దతునిస్తాయన్నారు. ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా పోలవ్వని ఏకైకా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రామకృష్ణ అన్నారు. ఎపిలో టిడిపి, జనసేన రెండు ప్రాంతీయ పార్టీలు బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని, ప్రతిపక్షంలో ఉన్న మరో ప్రాంతీయ వైసిపి మాత్రం ఎపిలో ఎన్‌డిఎకు వ్యతిరేకంగా కోట్లాడుతారని, ఢిల్లీకి వెళ్లగానే మోదీ సంకన ఎక్కుతారని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపికి పూర్తి స్థాయి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనే విషయంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. బిజెపికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైన ఎటువంటి నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకికవాదాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని రామకృష్ణ పిలుపు నిచ్చారు.

# సిపిఐ మహాసభ – కమిటీలు

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ నిర్వహణకు పలు కమిటీలను మహాసభలోప్రతినిధులు ఎన్నుకున్నారు.కమిటీలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేసి సంబశివరావు ప్రతిపాదించగా, ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కమిటీల వివరాలు.

**అధ్యక్షవర్గం** : చైర్ పర్సన్ పశ్య పద్మ, సభ్యులు వి.ఎస్.బోస్, నెల్లికంటి సత్యం, వలీ ఉల్లా ఖాద్రీ, ఇ.ఉమామహేశ్, మారుపాక అనిల్‌కుమార్, అజ్మీరా రాంమూర్తి

**సారథ్య సంఘం** : కన్వీనర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం మొత్తం

**తీర్మానాల కమిటీ** : కన్వీనర్ తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, సభ్యులు ఇ.టి.నరసింహ, ఎస్.కె.సాబీర్‌పాషా, ఎస్.బాలరాజు, బొమ్మగాని ప్రభాకర్, ఉజ్జిని రత్నాకర్‌రావు.

**మీడియా బ్రీఫింగ్ కమిటీ:** పల్లా వెంకట్ రెడ్డి, బాగం హేమంత్‌రావు, కలవేణ శంకర్ , ఎండి.యూసఫ్

**అర్హతల కమిటీ** : కన్వీనర్ ఎం.బాలనర్సింహ ఎన్.జ్యోతి, స్టాలిన్ (హైదరాబాద్), కె.ధర్మేంద్ర, పుట్ట లక్ష్మణ్, కె.మణికంఠరెడ్డి, ఎస్ఎండి. ఫయాజ్.

**మినిట్స్ కమిటీ** : కన్వీనర్ కె.బిక్షపతి, ఎల్.శ్రావణ్‌కుమార్, పంజాల శ్రీనివాస్.












# పలువురు ప్రముఖులకు సిపిఐ ఘననివాళి

ఇటీవల మరణించిన పలువురు సిపిఐ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ సంతాపాన్ని, వారి కుటుం బ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిం ది. అమరులు సమాజానికి చేసిన సేవలను కొనియాడుతూ మహాసభల నివాళులు అర్పించింది. మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యు లు బాగం హేమంతరావు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సిపిఐ రాష్ట్ర 3వ మహాసభల నుండి ఇప్పటి మహాసభల వరకు మరణించిన పలువురు సిపిఐ నాయకులు, ప్రముఖులు, వివిధ ఘటనలు, ప్రమాదాల్లో మరణించిన వారికి సభ సంతాపాన్ని తెలియజేసింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యు లు, కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్, అఖిల భారత కిసాన్ సభ జా తీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఖమ్మం జిల్లా మాజీ వైస్ చైర్మన్ బి.అయోధ్య, నారాయణపేట జిల్లా కార్యదర్శి, కొండన్నలతో పాటు పలువురు సిపిఐ నాయకులు, స్వాతం త్ర్య సమరయోధులకు ప్రతినిధులు నివాళులు అర్పించా రు. భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్ మోహన్‌సింగ్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష, హర్యా నా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా, ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం ములా యం సింగ్ యా దవ్, జార్ఖండ్ మాజీ సిఎం శిబుసోరెన్, కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి శాంతిభూషణ్, ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్, భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్, కేరళ రాష్ట్ర మాజీ సిఎం ఊమన్ చాందీ , ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు, కేంద్ర మాజీ మంత్రి, సినీ నటులు కృష్ణంరాజు, ప్రముఖ సినీ నటులు ఘట్టమనేని కృష్ణ, కళాతపస్వి కె.విశ్వనాథ్, కైకాల సత్యనారాయణ, తమ్మారెడ్డి చలపతిరావు, ప్రముఖ నటీనటులు జమున, ప్రముఖ సినీ గాయణి వాణీజయరామ్, చంద్రమోహన్, కోటా శ్రీనివాసరావు, శరత్‌బాబులకు నివాళులు అర్పించారు. వివిధ ప్రమాదా లు, వరదలతో మరణించిన వారికి ప్రతినిధుల సభ సంతాపం తెలియజేసింది.

ఫొటోలు అనిల్







# గాజులరామారం అరుణశోభితం

**టి.మల్లయ్య**
**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి**

సిపిఐ రాష్ట్ర 4 మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత షాపూర్‌నగర్ కూడలి నుంచి మహాసభల ప్రాంగణం 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేష్ హాల్' వరకు భారీ 'రెడ్ ఫ్లాగ్ మార్చ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి కళాకారులు ఆట పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిపిఐ సమర యోధులకు జోహార్లు అంటూ పార్టీ శ్రేణులు నినదిస్తూ ఎర్ర జెండాలు చేత బూని ముందుకు సాగారు. దాదాపు మూడు కిలో మీటర్ల పొడవునా దారి అరుణారుణమైంది. అరుణ పతాకాలు రెపరెపలాడాయి. ఎర్ర జెండా పోరాటాలకు నిలయమైన కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని ప్రజలు సిపిఐ ప్రదర్శనను ఆసాంతం తిలకించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రదర్శన అగ్రభాగాన నడవగా పార్టీ నాయకులు, ప్రతినిధులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాసభ ప్రాంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మహాసభల ప్రాంగణం పార్టీ శ్రేణుల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో ఉత్తేజం నింపారు. ప్రముఖ కవి, నవచేతన పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ అమరవీరుల స్థుపాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు,జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లావెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా, కళవేన శంకర్, ఎం.బాల నర్సింహా, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, మహాసభల ప్రతినిధులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఫొటో ఎగ్జిబిషన్, 'సభాపతి అమరవీరుల ప్రాంగణం' ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. మహాసభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.











Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com